J/NELLORE/003/24-26 R.N.I.No.25359/74 పేజీలు : 20

THE BEST TELUGU WEEKLY OF NELLOREANS

సైకిల్ గుర్తుకి ఓటు

జై తెలుగు దేశం! జై జై తెలుగు దేశం!!

సమర్థతకి చోటు

# లాయర్

సంపుటి : 43 సంచిక : 49 10.05.2024, శుక్రవారం వెల : రూ. 5 /- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

## కోల్పోయింది చాలు.. కోలుకుందాం!

## 'చంద్రన్న'నే.. ముఖ్యమంత్రిగా చేసుకుందాం!!




**శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరుజిల్లా తెలుగుదేశం పార్టీ**

Released by District TeluguDesam Party, SPSR Nellore Dist.,



ఉదయగిరి బరిలో...

# కేక పెట్టిస్తున్న కాకర్ల

## జలదంకిలో సినీనటుడు నారా రోహిత్‌కు భారీ స్వాగతం

ఎన్నికల ప్రచారంలో భాగంగా, తెలుగుదేశం పార్టీ తరపున ప్రముఖ సినీ నటుడు నారా రోహిత్ మే 7న ఉదయగిరి నియోజకవర్గంలోని జలదంకికి రావడంతో పార్టీలో కొత్త ఉత్సాహం ఉరకలు వేసింది. ఉదయగిరి నియోజకవర్గం టీడీపీ అభ్యర్థి కాకర్ల జోరు ప్రచారాలతో కేక పుట్టిస్తున్న సమయంలో, చంద్రబాబునాయుడి సోదరుని కుమారుడు..ప్రముఖ సినీహీరో రోహిత్ రాకతో జలదంకి పులకించింది. పెద్దఎత్తున ఆయనకు స్వాగతం లభించింది. నెల్లూరు ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని, ఎమ్మెల్యే అభ్యర్థి కాకర్ల సురేష్‌ను, రోహిత్‌ను గజమాలలతో, భారీ బాణసంచా వేడుకలతో స్వాగతించి, వారికి తమ సంపూర్ణ మద్దతు ప్రకటించారు.

ఉదయగిరి నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారం హోరెత్తి పోతోంది. నేతలు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కాకర్ల సురేష్‌లు తమ గెలుపుకోసం గ్రామగ్రామానా సభలు పెట్టి తెలుగుదేశం గెలిస్తే ప్రజలకు ఎంత ప్రయోజనకరమో వివరిస్తున్నారు. నారా చంద్రబాబునాయుడు సారధ్యంలో సిద్ధమైన సూపర్ సిక్స్ పథకాలు అన్ని వర్గాల ప్రజలకు ఎంతగానో ఉపకరిస్తాయని, ఈ ఎన్నికల్లో టీడీపీ-బీజేపీ-జనసేన కూటమి అభ్యర్థులను గెలిపించి, రాష్ట్రాన్ని మళ్ళీ బాగుచేసుకునే అవకాశం కల్పించాలని ప్రజలను కోరుతున్నారు. ఇప్పటికే వైకాపా చేతిలో రాష్ట్రం నాశనమైందని, మళ్లీ మరోసారి ఆ పొరపాటు చేయవద్దని, వైకాపాను ఓడించి తెలుగుదేశం పార్టీకి ఘనవిజయం చేకూర్చాలని స్థానిక నాయకులు వంటేరు వేణుగోపాల్‌రెడ్డి, చేవూరు జనార్ధన్‌రెడ్డి, జయచంద్రారెడ్డి, దశయ్య, మండల టీడీపీ నాయకుడు మధురెడ్డి తదితరులంతా ప్రజల్లో పెద్దఎత్తున ప్రచారాలు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈనెల 7న సినీనటుడు నారా రోహిత్ కూడా రావడంతో స్థానికులు కేరింతలు కొట్టారు. ఈ సందర్భంగా రోహిత్ మాట్లాడుతూ, అవినీతి అక్రమాలకు తావులేకుండా, రాష్ట్ర శ్రేయస్సుకు కంకణం కట్టుకున్న టీడీపీకి ఈ ఎన్నికల్లో అఖండ విజయం చేకూర్చాలన్నారు. చంద్రబాబు అధికారంలోకి వస్తేనే యువతకు భవిత ఉంటుందని, రాష్ట్రాన్ని అన్నివిధాలా అభివృద్ధి చేయగల సత్తా ఎన్డీఏ కూటమికి ఉందన్నారు.

### ఒక్క అవకాశం ఇస్తే..అభివృద్ధి చేసి చూపిస్తా - కాకర్ల

కాకర్ల మాట్లాడుతూ, ఈ ఎన్నికల్లో తనను గెలిపించాలని, ఒక్క అవకాశం ఇస్తే చాలు.. అభివృద్ధి ఎలా జరగాలో చేసి చూపిస్తానని అన్నారు. వైకాపా పాలనలో దోపిడీలు, దౌర్జన్యాలు పెరగడం అందరం చూశామని, ఘోరాలు-నేరాలు పెరిగిపోయాయని, ఇకనైనా ప్రశాంత పాలనకు టీడీపీని గెలిపించుకోవాలని కోరారు.

'టీడీపీని గెలిపించే బాధ్యత మీరు తీసుకోండి.. జలదంకి మండలాన్ని అభివృద్ధి చేసే బాధ్యతను నేను తీసుకుంటానని' ఈ సందర్భంగా వేమిరెడ్డి అన్నప్పుడు ప్రజలు పెద్దపెట్టున హర్షధ్వానాలు చేస్తూ వారికి తమ మద్దతు ప్రకటించారు. ప్రధాని మోడీ సహకారంతో చంద్రబాబునాయుడు-పవన్‌కల్యాణ్‌లు రాష్ట్ర ప్రజల భవిష్యత్తును తీర్చిదిద్దుతారని ఆయన ప్రజలకు భరోసా ఇచ్చారు. అవినీతి, అక్రమాలకు, అరాచకాలకు అడ్డుకట్ట వేయాలని, టీడీపీ అభ్యర్థులకు ఘనవిజయం చేకూర్చాలని ఆయన విజ్ఞప్తిచేశారు.




### వైకాపా నుంచి..కాకర్ల గూటికి

ఉదయగిరి పంచాయతీలోని ఇందిరానగర్ నుంచి, కొండాపురంలోని చింతలదేవి నుంచి అనేక కుటుంబాల వారు ఇటీవల వైకాపాను వీడి, తెలుగుదేశంలోకి వచ్చారు. మాజీ ఎమ్మెల్యేలు మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి, కంభం విజయరామిరెడ్డిల సమక్షంలో వారంతా కాకర్ల గూటిలో చేరారు.

### చింతలదేవి నుంచి వంద కుటుంబాలు

చింతలదేవి నుంచి సుమారు 100 కుటుంబాల వారు టీడీపీలో చేరడంతో వారికి కాకర్ల తదితరులు పార్టీ కండువాలు కప్పి, పార్టీలోకి సాదరంగా స్వాగతించారు. మండల కన్వీనర్ ఎం.ఓంకారం సూచనల మేరకు యారం కృష్ణయ్య, దామా మహేశ్వరరావు, క్లస్టర్ ఇంచార్జ్ చెరుకూరు వెంకటాద్రి, పోలినేని రమేష్‌ల ఆధ్వర్యంలో కాకర్ల సమక్షంలో వారు టీడీపీలో చేరారు.




## ఓటు భరోసా

ఓటు మన గమ్యం
బాధామయ మృత్యుదారుల్లో
ఆక్రోశిస్తున్న విభ్రమల్లో పూచిన
ఓటు మన గవేషణ
మొక్కలకు ప్రాణవాయువులు అందించి
ఫలాల ఫలితాల్ని పొందినట్లు
ప్రజాస్వామ్యానికి ఓటు
ఆక్సిజన్ ఇచ్చి బ్రతికించుకోవాలి
కాలి క్రింద భూమి క్రుంగకుండా
కాపాడుకోవాలి
బతుకు భరోసాతో విజేతలమై
ఎన్నికల్లో నెగ్గాలి
మార్గదర్శనం లేని మాయా లోకాన్ని
మనమే విధ్వంసం చేసుకోవాలి
సూర్యోదయాల్లో మంటల దీవెనలు
దీయని ప్రభుతను పాదుకొల్పుకోవాలి
ప్రభాతాలు ఉరి తీయబడని
మనోజ్ఞ సామ్రాజ్యం కోసం ఓటే మార్గం
పొలాల దారుల్లో విత్తనాలు
చల్లడం లాంటిదే ఓటెయ్యడమంటే!
నాలుగు రోడ్ల కూడలిలో చాకచక్యంగా
క్రీడించడమే ఓటెయ్యడమంటే
ఓటు మన జీవితాల్ని పండించే
అపురూప శాసనం
నుదుటి రేఖల్ని మార్చే
అరుణారుణ కేతనం
ఓటెత్తండి, పోటెత్తండి
ప్రజాస్వామ్యాన్ని బ్రతికించే
సారధులు కండి!



**చిన్ని నారాయణరావు**
944020 02942

## దళితులకు టీడీపీ చేసిందేమీ లేదు



మాలమహానాడు అధ్యక్షుడు చెన్నయ్య విమర్శ

చంద్రబాబునాయుడు పాలనలో దళితులకు ఒరిగిందేమీ లేదని, పైపెచ్చు దళితులను చులకనగా చూసింది చంద్రబాబేనని మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు బి.చంద్రయ్య విమర్శించారు. ఇటీవల ఆయన కందుకూరు పట్టణంలోని వైకాపా కార్యాలయంలో కందుకూరు ఎమ్మెల్యే అభ్యర్థి బుర్రా మధుసూదన్‌యాదవ్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ, జగన్ రాజ్యాంగబద్ధంగా దళితులకు నామినేటెడ్ పదవులిచ్చి రాజకీయంగా ప్రోత్సహించారని, చంద్రబాబు మాత్రం తన హయాంలో ఏనాడూ దళితుల గురించి పట్టించుకోలేదని అన్నారు. కరోనా కాలంలో జనం ఎన్నో ఇబ్బందులు పడుతుంటే టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు అప్పుడు ఎక్కడికి పోయారని ఆయన ప్రశ్నించారు. జగన్ పాలనలోనే దళితులకు న్యాయం జరుగుతుందని ఆయన అంటూ, ఈ ఎన్నికల్లో దళితులంతా వైకాపాకు అండగా నిలవాలని, కందుకూరు ఎమ్మెల్యే అభ్యర్థి బుర్రా మధుసూదన్‌యాదవ్‌ను గెలిపించుకోవాలని కోరారు.

## జైళ్లలో ములాఖత్ వేళల్లో మార్పు

వేసవి మండిపోతున్న నేపథ్యంలో జిల్లాలోని సబ్‌జైళ్లలో ఖైదీల కోసం అనుసరిస్తున్న ములాఖత్ వేళలను మార్పు చేస్తున్నట్లు జిల్లా సబ్ జైళ్ల అధికారి వెంకటేశ్వర్లురావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 8 నుంచి 11గంటల వరకు, మళ్ళీ సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు ములాఖత్ ఉంటుందని, జూన్ 15 వరకు ఈ వేళలు అమలులో ఉంటాయని ఆయన తెలిపారు.

### 'దేశం' రాష్ట్ర కార్యదర్శిగా..

## ఎల్సీ రమణారెడ్డి



తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా వింజమూరుకు చెందిన నాయకుడు ఎల్సీ రమణారెడ్డి నియమితులయ్యారు. గతంలో విద్యాశాఖలో పనిచేసిన ఎల్సీ, ఉద్యోగానికి రాజీనామా ఇచ్చి ఇటీవల జరిగిన తూర్పు రాయలసీమ ఎన్నికల్లో పోటీచేసి స్వల్ప ఓట్లతో అపజయం పాలైన విషయం తెలిసిందే. అయినా, ఎంతో కాలంగా ఆయన పార్టీకి చేస్తున్న సేవలను గుర్తించిన టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు ఆయన్ను తాజాగా రాష్ట్ర పార్టీ కార్యదర్శిగా నియమించడం విశేషం. ఉదయగిరి నియోజకవర్గంలో టీడీపీ గెలుపే ధ్యేయంగా పనిచేస్తానని, తెలుగుదేశం పార్టీ తరపున పోటీలో ఉన్న నెల్లూరు ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి కాకర్ల సురేష్‌ల విజయం కోసం అలుపెరగకుండా కృషిచేస్తానని ఎల్సీ ఈ సందర్భంగా చెప్పారు.

## విఎస్‌యు అధ్యాపకునికి పురస్కారం



నెల్లూరులోని విక్రమసింహపురి యూనివర్శిటీ (విఎస్‌యు)లో సోషల్‌వర్క్ విభాగంలో అధ్యాపకునిగా ఉన్న వెంకటసుబ్బారెడ్డికి ఇటీవల ఆదర్శ విద్యా సరస్వతి రాష్ట్రీయ పురస్కారం లభించింది. విఎస్‌యు వీసీ ఆచార్య సుందరవల్లి చేతులమీదుగా ఆ పురస్కారాన్ని ఆయనకు అందజేశారు. గుజరాత్‌లోని గ్లోబల్ మేనేజ్‌మెంట్ కౌన్సిల్ వారు వెంకటసుబ్బారెడ్డి సేవలను గుర్తించి ఈ అవార్డును ప్రకటించినట్లు తెలిపారు.

J/NELLORE/003/24-26 R.N.I.No.25359/74 పేజీలు : 20

THE BEST TELUGU WEEKLY OF NELLOREANS




# లాయర్

సంపుటి : 43 సంచిక : 49 10.05.2024, శుక్రవారం వెల : రూ. 5 /- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

● జగన్ పాలనపై

## ద్వజమెత్తిన ద్వయం!



### మాటల తూటాలు పేల్చిన మోడీ-షా కలిసేది కల్లేనని తేల్చేసిన కమలనాథులు

**భారతీయ జనతా పార్టీ ఆంధ్రప్రదేశ్‌పై తమ వ్యూహాన్ని మార్చింది. టీడీపీ - జనసేనలకి మద్దతుగా తమ ప్రచారంలో జోరు పెంచింది. వైసీపీతో బీజేపీకి లోపాయకారి ఒప్పందం ఉందన్న ప్రచారాన్ని తిప్పి కొట్టింది. తాము మనసా వాచా కర్మణా టీడీపీ - జనసేనలతోనే ఉన్నామన్న స్పష్టతనిచ్చింది. నిర్జీవంగా ఉన్న కూటమికి ఊపిరినిచ్చింది.**

ఆంధ్రాలో సార్వత్రిక ఎన్నికల సందడి ప్రారంభమైన తొలిరోజుల్లో నరసారావుపేటలో జరిగిన కూటమి మొట్టమెదటి సభలో ప్రధానమంత్రి మోడీ ప్రసంగం అటు కూటమి నాయకులని, ఇటు ఆ పార్టీల శ్రేణుల్ని నిరుత్సాహపరచింది. జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనపైన కానీ, చంద్రబాబు సమర్ధతపైన కానీ ప్రధాని ఒక్క ముక్క కూడా మాట్లాడలేదు. ఈ సభ చాలామందిలో అనేక అనుమానాలను రేపింది.

18లో

ఎన్నికలు 2024

## ఓటేద్దాం రండి



### మంచి నాయకులకు ఓటేద్దాం.. మంచి పాలనకు చోటిద్దాం!

ఓట్ల పండుగ ముగింపు దశకు చేరుకుంది. రాజకీయ పార్టీలన్నీ వాగ్దాన అస్త్రాలు పట్టుకుని తాముద్దరిస్తామంటే తాముద్దరిస్తామంటూ ప్రజల ముందుకి వస్తున్నాయి. బాగానే ఉంది అనుకునే లోపే వ్యక్తిగత విమర్శలతో ప్రజల్లో అవాంఛిత అపోహల సృష్టి జరుగుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో ఓటెయ్యాల్సిన రోజున ఎలాగూ సెలవే గనుక కుటుంబంతో కలిసి లైన్లో నిలబడి ఓటేసే కంటే హాయిగా కుటుంబంతో ఎక్కడికన్నా వెళ్ళి హాయిగా గడిపేద్దాం అనుకునే వాళ్ళు ఆ ఆలోచన అక్కడితోనే ఆపాల్సిన ఆవశ్యకత కూడా ఉంది. ఈ నాయకులను ఎన్నుకున్నది ఎవరు. మనమే కదా. అభివృద్ధి చెందిన మంచి నియోజకవర్గ ప్రజల్గాగా... మనం కూడా మంచివాణ్ని ఎన్నుకుని ఉంటే బావుండేదేమో కదా. కానీ మనం ఒక్కళ్ళమే ఆ మాట అనుకుంటే ఎలా. అందరూ అనుకోవాలి కదా అని మీరు అనుకోవచ్చు. ఈ సందర్భంలో మహాత్మాగాంధీ చెప్పిన మాటను ఓసారి మననం చేసుకుందాం..“సమాజంలో మీరు కోరుకుంటున్న మార్పు... ముందు మీతోనే ప్రారంభం కావాలి”. ఇదీ ఆయన అన్న మాట!

18లో




జననం : 07.08.1952 నిర్యాణం : 27.04.2024

ఉత్తరక్రియలు

మా ఇంటి దీపం, మా దైవం

శ్రీమతి పులగం రమ

(W/o లేట్ పులగం శేషారెడ్డి)

అన్నారెడ్డిపాలెం

తేది 27.04.2024 ఆదివారం నాడు స్వర్గస్తురాలైనారు.

వారి పవిత్ర ఆత్మశాంతికై ప్రార్థిస్తూ...

పులగం వంశీకృష్ణారెడ్డి - కుమారుడు

కుమార్తె - అల్లుడు

నూకలపాటి పార్వతిరెడ్డి - నూకలపాటి అనిల్‌రెడ్డి

మనుమళ్ళు - మనుమరాలు

నూకలపాటి అనుత్తమ్‌రెడ్డి - మానసరెడ్డి

నూకలపాటి ఆయుష్‌రెడ్డి

వారి పెద్దకర్మ తేది. 15.05.2024, బుధవారం ఉదయం 10.00 నుండి మధ్యాహ్నం 3.00 గంటల వరకు ప్లాట్ నెం.3, రోడ్ నెం. 51, సైలెంట్ లేక్‌వ్యాలి, జూబ్లీహిల్స్, హైదరాబాదులోని మా స్వగృహము నందు జరుగును. బంధుమిత్రులకు తెలియజేయడమైనది.

# ఆదాలకు జై అంటున్న జనం

## ○ అభివృద్ధే అస్త్రంగా రూరల్‌లో దూసుకుపోతున్న ప్రభాకర్‌రెడ్డి



నెల్లూరు రూరల్‌లో వైకాపా అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డి అలుపెరుగకుండా ప్రచారాన్ని ముమ్మరం చేశారు. ఎన్నికలు సమీపించిన తరుణంలో మండేఎండలను కూడా లెక్కచేయకుండా ఆయన రూరల్‌లోని అనేక గ్రామాల్లో సుడిగాలి పర్యటన చేస్తున్నారు. గత కొద్దికాలంగా కోట్లాదిరూపాయల అభివృద్ధిపనులు చేపట్టి రూరల్ అభివృద్ధి ప్రదాతగా పేరొందిన ఆదాలకు, ఆ నియోజకవర్గంలో ఆయన ఏప్రాంతంలో పర్యటించినా ప్రజలు ఘనంగా స్వాగతిస్తూ, అభిమానంతో జేకొడుతున్నారు.



నెల్లూరు రూరల్‌లో రౌడీయిజాలు, దౌర్జన్యాలు లేకుండా చేసి, ప్రజల అభ్యున్నతి కోసం ప్రశాంత పాలన అందిస్తూ అభివృద్ధికి కృషిచేస్తామని నెల్లూరు రూరల్ వైకాపా అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డి ఎన్నికల ప్రచారంలో చెప్తున్న మాటలకు ప్రజలు పెద్దఎత్తున స్పందిస్తున్నారు. ఇటీవల ఆయన రూరల్ పరిధిలోని 32,33, 34, 35 డివిజన్‌లలో పర్యటించినప్పుడు స్థానిక నాయకులు, ప్రముఖులు, ప్రజలు వేలసంఖ్యలో తరలివచ్చి ఆయనకు స్వాగతం చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో ప్రజలకు అన్యాయం జరుగుతోందని, ఇప్పటికే విద్యాదీవెన, ఆసరా, చేయూత, ఇన్‌పుట్ సబ్సిడీ, ఈబీసీ నేస్తం వంటి పథకాలకు నగదు రాకుండా, లబ్దిదారుల ఖాతాల్లో జమ కాకుండా కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. గత నెలలో వలంటీర్ల సేవలను అడ్డుకొని ముసలివాళ్లకి పింఛన్ రాకుండా అడ్డుకున్న చంద్రబాబు, ఇప్పుడు పలు సంక్షేమ పథకాలకు డబ్బులు రాకుండా చేస్తున్నారని విమర్శించారు. ప్రజల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి జగన్ నిరంతరం కష్టపడుతుంటే, చంద్రబాబు ప్రజలను అనునిత్యం కష్టపెడుతున్నారని దుయ్యబట్టారు. రానున్న ఎన్నికల్లో టీడీపీని ఓడించి ప్రజలే తగు గుణపాఠం చెప్పాలన్నారు. ఈనెల 13వ తేదీన జరగనున్న ఎన్నికల్లో నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థిగా తనకు, నెల్లూరు పార్లమెంటు ఎంపీ అభ్యర్థిగా విజయసాయిరెడ్డికి ఘనవిజయం చేకూర్చాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు. తొలుత, 32వ డివిజన్ నుండి 35వ డివిజన్ వరకు సాగిన ఎన్నికల రోడ్ షోలో పెద్దసంఖ్యలో ప్రజలు పాల్గొని ఆదాలకు తమ మద్దతు ప్రకటించారు.

## సంక్షేమ పథకాలే..వైకాపా విజయ సోపానాలు



ఆదాల కుమార్తె హిమబిందు

రాష్ట్రంలో జగనన్న సంక్షేమ పథకాలు, నెల్లూరు రూరల్‌లో నాన్నగారు చేసిన అభివృద్ధి కార్యక్రమాలే వైకాపాకి విజయసోపానాలని నెల్లూరు రూరల్ వైకాపా అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డి కుమార్తె ఆదాల హిమబిందు అన్నారు. ఇటీవల ఆమె నెల్లూరు రూరల్‌లోని 26, 27వ డివిజన్లలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, గత ఐదు సంవత్సరాలుగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన అన్ని సంక్షేమ పథకాలు ప్రజలకు ఎంతో ఉపకరించాయన్నారు. ఆ పథకాలే వైకాపాకి విజయం చేకూరుస్తాయన్నారు. జగనన్న సహకారంతో, తమ నాన్న రూ. 150 కోట్ల నిధులతో రూరల్ అభివృద్ధికి అమోఘమైన కృషి చేశారన్నారు. నాన్నగారు చేసిన అభివృద్ధి కార్యక్రమాలు కళ్ళెదుట కనబడుతున్నాయని కొనియాడారు.

## సమన్వయంతో విజయం సాధించాలి



రానున్న ఎన్నికల్లో నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి పార్టీకి విజయం సాధించాలని ఆదాల వైకాపా శ్రేణులకు పిలుపునిచ్చారు. ఇటీవల ఆయన 33వ డివిజన్ వెంగళరావునగర్లో ఆ డివిజన్ ఇన్చార్జి, క్లస్టర్-4 అధ్యక్షులు బెజవాడ మేఘనాథ్‌సింగ్ ఆధ్వర్యంలో వైకాపా నాయకులు, కార్యకర్తలతో నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో మాట్లాడారు. నాయకులు, కార్యకర్తలు అన్న తేడా లేకుండా ప్రతిఒక్కరు సమిష్టిగా పనిచేయాలని వారికి దిశా నిర్దేశం చేశారు. ఎన్నికలను సీరియస్‌గా తీసుకోవాలని, గడపగడపకు తిరుగుతూ ఎప్పటికప్పుడు వైకాపా సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు తెలియజేయాలని, క్షేత్రస్థాయిలో ప్రజలను చైతన్యవంతం చేసి పార్టీ విజయానికి పాటుపడాలన్నారు.

---

# మెట్టుకూరుకు.. టీడీపీలో కీలక పదవి



## రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శిగా బాధ్యతలు

మెట్టప్రాంత నాయకుడు మెట్టుకూరుకు తాజాగా టీడీపీలో కీలక పదవి లభించడంతో ఆయన అనుచర వర్గాలు సంతోషం వ్యక్తం చేస్తున్నాయి. వైకాపాలో ఉంటే మంచి భవిష్యత్తు ఉంటుందని అనుకున్న మెట్టుకూరుకు ఆ పార్టీ ఎన్నికల్లో టిక్కెట్ ఇవ్వక పోవడంతో ఆయన కంగుతిన్నారు. టిక్కెట్ వస్తుందనే ఆశతో ఎంతోకాలంగా పార్టీనే నమ్ముకుని సేవలు చేసినా, చివరికి వైకాపా మొండిచేయి చూపడంతో ఆవేదన చెందిన జిల్లా కేంద్ర సహకారబ్యాంక్ మాజీ అధ్యక్షుడు మెట్టుకూరు ధనుంజయరెడ్డి, ఇటీవలే చంద్రబాబు సమక్షంలో తెలుగుదేశం గూటికి చేరిపోయిన విషయం తెలిసిందే. దాదాపు అయిదేళ్లుగా వైకాపాలో ఉన్న మెట్టుకూరు, గత ఎన్నికల్లో వైకాపా అభ్యర్థుల విజయం కోసం విశేషంగా కృషిచేశారు. వెంకటగిరి, ఉదయగిరి, నెల్లూరు రూరల్ నియోజకవర్గాల పరిశీలకునిగా కూడా వైకాపాలో ఆయా నియోజకవర్గాల రాజకీయాల్లో ప్రధాన పాత్ర పోషించారు. ముమ్మరంగా పర్యటిస్తూ పార్టీల్లో నాయకుల మధ్య ఎక్కడైనా విభేదాలన్నా సర్దిచెప్పి, అందరినీ ఏకం చేసేవారు. అప్పగించిన బాధ్యతలను విస్మరించకుండా పనిచేసి, మాటల మనిషి కాదు చేతల మనిషి అని నిరూపించుకున్నాడు. ఇంతచేసినా, చివరి నిమిషం వరకు వేచి చూసినా, ఆ పార్టీలో టిక్కెట్ రాకపోవడంతో ఆయన నిరాశకు గురయ్యాడు. తన రాజకీయ భవిష్యత్తు అగమ్యగోచరంగా మారడంతో, పార్టీ మారాలని నిర్ణయించుకుని, తెలుగుదేశంలో చేరిన మెట్టుకూరుకు తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శిగా బాధ్యతలు అప్పగించింది టీడీపీ అధిష్టానం. ఎన్నికలు సమీపించిన ప్రస్తుత పరిస్థితుల్లో జిల్లాలో ప్రతిష్టాత్మకమైన వెంకటగిరి-రాపూరు నియోజకవర్గాల్లో ఆయన సేవలను వినియోగించుకోవాలనే ఉద్దేశ్యంతో చంద్రబాబు నాయుడు ఆయనకు రాష్ట్రస్థాయి నాయకునిగా పార్టీ పదవిని కేటాయించారు. అటు మేకపాటి వారు (వైకాపా), ఇటు ఆనం రామనారాయణరెడ్డి (టీడీపీ) వంటి ఉద్దండ నాయకులు బరిలో ఉన్న ఆత్మకూరు నియోజకవర్గంలోను, వైకాపా అభ్యర్థిగా మాజీముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి తనయుడు రామ్‌కుమార్‌రెడ్డి గట్టి పోటీ ఇస్తున్న వెంకటగిరి నియోజకవర్గంలోనూ టీడీపీ అభ్యర్థుల గెలుపుకు కృషిచేయాల్సిందిగా టీడీపీ అధిష్టానం ఆయనకు బాధ్యతలు అప్పగించినట్లు సమాచారం.



## 'జనసేన'లోకి 'నూనె'

నెల్లూరు నగరంలో వైకాపా సీనియర్ నాయకుడు, నెల్లూరు నగరపాలక సంస్థ కో-ఆప్షన్ సభ్యుడు నూనె మల్లికార్జున యాదవ్ ఉన్నట్లుండి వైకాపాకి గుడ్‌బై చెప్పేసి, జనసేనలోకి చేరిపోయారు. రాష్ట్ర భవిష్యత్తు జనసేనతోనే సాధ్యమంటూ, మే 4న ఆయన నెల్లూరుకు వచ్చిన జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌ను కలిసి ఆ పార్టీ కండువా కప్పుకున్నారు. ఎన్నికల్లో టీడీపీ-బీజేపీ-జనసేనల కూటమిదే విజయమని ఈ సందర్భంగా నూనె చెప్పారు.

## టీడీపీలో చేరిన చేరెడ్డి

మనుబోలు మాజీ సర్పంచ్, మాజీ ఎంపీపీ చేరెడ్డి పట్టాభిరామిరెడ్డి మే 4న సర్వేపల్లి టీడీపీ అభ్యర్థి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి సమక్షంలో టీడీపీలో చేరారు. తిరుపతి టీడీపీ ప్రధాన కార్యదర్శి పచ్చిపాల రామిరెడ్డి ఆధ్వర్యంలో, తన అనుచరులు సుమారు 150 మంది టీడీపీలో చేరగా, వారికి సోమిరెడ్డి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

### వేమిరెడ్డి దంపతుల సహకారంతో..

# శేఖర్‌రెడ్డికి రాష్ట్రస్థాయి గుర్తింపు



కోవూరు నియోజకవర్గం కొడవలూరు మండల టీడీపీ సీనియర్ నాయకుడు జీవీఎన్ శేఖర్‌రెడ్డికి ఆ పార్టీ మంచి గుర్తింపునిచ్చింది. నెల్లూరు టీడీపీ ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే అభ్యర్థి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిల సహకారంతో ఆయన ఇటీవల టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శిగా నియమితులయ్యారు. ఆమేరకు తెలుగుదేశం అధినేత చంద్రబాబునాయుడు అనుమతితో రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు ఆయనకు ఆ బాధ్యతలను కేటాయించారు. తనకు రాష్ట్రస్థాయి పార్టీ పదవి వచ్చేందుకు సహకరించిన వేమిరెడ్డి దంపతులకు శేఖర్‌రెడ్డి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.


# బీజేపీలో చేరిన సుమంత్‌రెడ్డి



జిల్లా కోఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ (డీసీఎంఎస్) మాజీ ఛైర్మెన్ వై.సుమంత్‌రెడ్డి మే 4న బీజేపీలో చేరిపోయారు. చిత్తూరుజిల్లా కలికిరిలో మాజీ ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి, బీజేపీ ఆర్గనైజింగ్ కార్యదర్శి శివప్రకాష్‌ల సమక్షంలో ఆయన ఆ పార్టీలో చేరారు. దేశవ్యాప్తంగా ప్రజలకు జనరంజక పాలన అందిస్తున్న నరేంద్రమోడీని మళ్ళీ ప్రధానిగా గెలిపించాలని, రాష్ట్రంలో కూడా ఈసారి బీజేపీ-టీడీపీ-జనసేనల కూటమి తప్పకుండా విజయం సాధిస్తుందని సుమంత్ ధీమా వ్యక్తం చేశారు.

# అమ్మ

అమ్మకు అంజలి



## శ్రీమతి పందిళ్ళపల్లి అరుణమ్మ

02.05.1951 - 10.05.2016

ప్రతి ఆలోచన మా గురించే అని మురిసిపోయేవాళ్లం. కాని మీ ప్రతి ఆలోచనను మాకు జ్ఞాపకంగా మిగులుస్తారని అనుకోలేదు.. మహోన్నత వ్యక్తిత్వం కలిగిన మీ పవిత్ర ఆత్మకు 8 వ వర్ధంతి సందర్భంగా ఇదే మా అంజలి.

కుమారుడు

పందిళ్ళపల్లి హేమంత్‌రెడ్డి

లాయర్
మే 10, 2024

# ప్రాణాలను నమిలేస్తున్న..'నోటి క్యాన్సర్'

ప్రజల ప్రాణాలను హరిస్తున్న ప్రాణాంతక వ్యాధుల్లో ఒకటైన 'నోటి క్యాన్సర్' నానాటికీ విజృంభిస్తోంది. ప్రపంచ వ్యాప్తంగా ఏటా లక్షలాదిమంది ప్రాణాలను నమిలేస్తోంది. మనదేశంలోనూ ఇది మరింతగా ప్రబలిపోతోందని, అప్రమత్తంగా లేకుంటే ఈ వ్యాధితో మరణాల సంఖ్య బాగా పెరుగుతుందని ప్రపంచ ఆరోగ్యసంస్థ తాజా అధ్యయనాల ద్వారా హెచ్చరిస్తోంది. నోరు మంచిదైతే ఊరు మంచిదవుతుందన్నది పాత సామెత. నోరు మంచిదైతే ఆరోగ్యం మంచిగా ఉంటుందన్నది నేటి సామెత. ఎందుకంటే, శరీర పోషణకు అవసరమయ్యే ఆహార పానీయాలన్నీ వెళ్లేది నోటి ద్వారానే కనుక, నోరు ఎంత ఆరోగ్యంగా ఉంటే అంత మంచిది. అయితే, ప్రపంచవ్యాప్తంగా కోట్లాదిమంది ప్రజలు నోటి వ్యాధులను నిర్లక్ష్యం చేస్తూ, నోటి క్యాన్సర్ వంటి వ్యాధులకు బలైపోతూనే ఉండడం బాధాకరం. ప్రపంచ ఆరోగ్యసంస్థ అంచనాల ప్రకారం ప్రపంచవ్యాప్తంగా ఏటా ఈ వ్యాధికి దాదాపు 4 లక్షలాదిమందికి పైగానే మరణిస్తున్నారు. నిత్యం ప్రతి ఆరుగురిలో ఒకరు ఈ వ్యాధికి బలైపోతూనే ఉన్నారు. దీన్నిబట్టి ఈ వ్యాధి తీవ్రత ఎంతగా ఉందో అర్థం చేసుకోవచ్చు. అంతేకాదు, అలా మరణిస్తున్నవారిలో సుమారు 30 శాతం మంది దాకా మనదేశంలో ఉన్నారని, మిగతా దేశాలతో పోలిస్తే భారత ఉపఖండంలోనే నోటి క్యాన్సర్లు విపరీతంగా ఉంటున్నాయని, కనుక జాగ్రత్తలు తప్పనిసరి అని ప్రపంచ ఆరోగ్య సంస్థ హెచ్చరిస్తోంది. అంతేకాదు, నోటి క్యాన్సర్లలో ప్రపంచంలోనే రెండవస్థానం మనదేశానిదే కావడం గమనార్హం. ప్రతి ఏటా మనదేశంలో సుమారు 70 వేలకు పైగానే నోటి క్యాన్సర్ వ్యాధులు నమోదవుతున్నాయని, దాదాపు 50 వేల మంది వరకూ ఈ వ్యాధితో మృత్యువు పాలవుతున్నారని నిపుణుల నివేదికలు స్పష్టం చేస్తున్నాయి.

స్త్రీలలో కన్నా, పురుషుల్లోనే ఇది ఎక్కువగా ఉంటోందని, పొగ తాగడం, పొగాకు ఉత్పత్తులను నమలడం వంటి దురలవాట్ల ద్వారా ఈ వ్యాధి బాగా విజృంభిస్తోందని నిపుణులు చెప్తున్నారు. చిన్న పుండుగా మొదలై, చివరికి ప్రాణాలు తీసే వ్యాధిగా ఇది ప్రబలిపోతోందని, అందువల్ల ప్రాథమిక స్థాయిలోనే దీనిని గుర్తించి నివారించుకోవాలని హెచ్చరిస్తున్నారు. ధూమపానం, మద్యపానం, గుట్కాలు, జర్దాలు తినడం, పొగాకును నమలడం వంటివి నోటి క్యాన్సర్‌కు ప్రధాన కారణమని, ఇకనైనా ఆ దురలవాట్లకు దూరంగా ఉండడం శ్రేయస్కరమని వైద్య వర్గాలు సూచిస్తున్నాయి. నేటికీ అత్యధికశాతం మందికి ఈ వ్యాధి పట్ల సరైన అవగాహన ఉండడం లేదు. ఈ వ్యాధి లక్షణాలను సరిగా గుర్తించలేక, నోటి క్యాన్సర్ వస్తే.. అదేదో ఇన్‌ఫెక్షన్ అయివుంటుందిలే అనుకోవడం, తీరా వ్యాధి ముదిరిపోయాక ప్రాణాలమీదికి తెచ్చుకోవడం తరచూ జరుగుతూనే ఉంది. వ్యాధిని ముందుగానే గుర్తించడం వల్ల ప్రయోజనం ఉంటుందని, దానిని ప్రాథమిక స్థాయిలో గుర్తించలేకపోవడం కూడా వ్యాధి ప్రాణాంతకంగా తయారవుతున్న కారణాల్లో ఒకటని నిపుణుల అంచనా.

నోటి లోపలిభాగంలో తెల్లటి మచ్చలు రావడం, అవి గడ్డలుగా తయారవడం, చిగుళ్లలో వాపు, చెవుల్లో నొప్పి, దవడ భాగంలో వాపు, పుండ్లుపడడం వంటివి నోటి క్యాన్సర్ వ్యాధి లక్షణాలని, అలాంటి లక్షణాలేమైనా ఉంటే వెంటనే అది క్యాన్సరో కాదో వైద్యపరీక్షలు చేయించుకుని నిర్ధారించుకుని, దాని నివారణకు తగు చికిత్సలు చేయించుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. నోటి క్యాన్సర్ ఇంతగా విజృంభిస్తున్న నేపథ్యంలో, ప్రజల ప్రాణాలను హరిస్తున్న ఈ వ్యాధిని నివారించేందుకు కేంద్ర రాష్ట్రప్రభుత్వాలు యుద్ధప్రాతిపదికపై చర్యలు తీసుకోవడం ఎంతైనా అవసరం. వ్యాధి నిర్ధారణకు దేశంలోని ప్రతి ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలోనూ ప్రత్యేక విభాగాలు ఏర్పాటుచేసి, వ్యాధి నివారణకు అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేయాలి. పొగాకు వాడకం వల్ల కలిగే దుష్పరిణామాలపై ప్రజలకు, ముఖ్యంగా విద్యార్థులు, యువతకు అవగాహన కలిగేలా తరచూ పాఠశాలలు, కళాశాలల్లో సదస్సులు నిర్వహించాలి. తల్లిదండ్రులు ఈ విషయంలో తమ పిల్లల ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలి. వైద్య బృందాలు, స్వచ్ఛంద సంస్థలు కూడా ఇలాంటి వ్యాధుల లక్షణాలను, వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తరచూ ప్రజలకు తెలియజెప్పుండాలి. కరపత్రాల ద్వారా ప్రజలకు ఈ వ్యాధి పట్ల చైతన్యం కలిగించాలి. దురలవాట్లకు దూరంగా ఉండాలని, వ్యాధి వచ్చాక బాధలు పడే కంటే, వ్యాధి రాకుండా ముందుగానే జాగ్రత్తలు తీసుకోవడం అవసరమని అందరికీ అవగాహన కలిగించాలి. ఇది ఎంతో ముఖ్యం.. తక్షణావసరం కూడా.

# జగన్‌కి అసహనం ఎందుకో!

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ఈమధ్య కొంత అసహనంగా కనపడుతున్నారు. ఇటీవల ఒక సందర్భంలో ఆయన మాట్లాడుతూ "ఎన్నికలు సజావుగా జరగనిచ్చేలా లేరు" అని తన అనుమానాన్ని వ్యక్తం చేయడం ఆశ్చర్యం కలిగించింది. ఎన్నికల సంఘం అధికారులను బదిలీ చేస్తున్న సంఘటనని ఉటంకిస్తూ జగన్ ఈ కామెంట్ చేశారు. ఇలా అభియోగాలు వచ్చిన అధికారులను ఎలక్షన్ కమిషన్ బదిలీ చేయడం మొదటి సారేమీ కాదు. గతంలో అనేక సందర్భాలలో ఇలా జరిగింది. అంతెందుకు 2019లో ఆంధ్రాలో సార్వత్రిక ఎన్నికలు జరిగిన సమయంలో కూడా ఇదే జగన్ మోహన్‌రెడ్డి ఫిర్యాదు ఆధారంగా అనేక మంది కీలక అధికారులను ఎన్నికల సంఘం బదిలీచేసింది. తాజాగా డీజీపీని బదిలీ చేయంగానే ముఖ్యమంత్రి హోదాలో వున్న వ్యక్తి ఇలా స్పందించడం అనేక అనుమానాలకు అవకాశం ఇస్తుంది. జగన్‌మోహన్‌రెడ్డికి తాను ఓడిపోతానన్న సందేహమేమైనా కలిగిందా...? అన్న అనుమానం వస్తోంది. మొత్తం 175 సీట్లూ తనకే కావాలని కోరుకుంటున్న వ్యక్తి ఇలాంటి అనుమానాలతో అసహనాన్ని ప్రదర్శిస్తే అది నైతికంగా పార్టీ శ్రేణుల విశ్వాసాన్ని దెబ్బతీస్తుంది.

*ఎం.చంద్రమౌళి,* **కొత్తఢిల్లీ.**

ఈ-మెయిల్
ప్రజావాణి
lawyerpatrika@gmail.com
+91 98663 14741

# శీనయ్యకి శ్రద్ధాంజలి!

జక్కా సోదరులలో మూడవ వారు జక్కా శ్రీనివాసులరెడ్డి. నాకు ఆయన చిన్నప్పటి నుండీ తెలుసు. వాళ్ళ ఊర్లో ఆయన్ని చిన్నోడా అని పిలిచేవారు. ఆ చిన్నోడు స్వయం కృషితో ఎదిగి ఎంతో పెద్దవాడయ్యాడు. నేను ఆయనని శీనయ్యా అని పిలిచేవాడిని. వాళ్ళ అన్న రాధాకృష్ణారెడ్డి ఆర్.టీ.సీలో పెద్ద ఉద్యోగంలో ఉండేవారు. మరో అన్న జే.కే.రెడ్డి 1989లో నెల్లూరు ఎం.ఎల్.ఏగా ఇండిపెండెంటుగా గెలిచాడు. తన అన్నలిద్దరి ద్వారా కూడా శీనయ్య చాలామందికి సహాయం చేసేవాడు. ఉద్యోగాలు ఇప్పించేవాడు. శీనయ్యకి వ్యవసాయం అంటే ఇష్టం. ఆటలంటే ఇష్టం. చదువంటే ఇష్టం. కళలంటే ఇష్టం. సాహిత్యమంటే ఇష్టం... అన్నింటినీ మించి స్నేహితులంటే మహాఇష్టం. ఆయన గురించి మన 'లాయర్'లో చాలా వివరంగా రాశారు. నెల్లూరులో క్యాన్సర్ ఆసుపత్రి శీనయ్య ఆలోచనే. శీనయ్య కుటుంబాన్ని అదే క్యాన్సర్ పీడిస్తోంది. వాళ్ళ నాన్న రంగారెడ్డి, వదిన సుజాతమ్మ, చెల్లెలు నిర్మలమ్మ, భార్య సౌదామినమ్మ, ఆయన పిన్నమ్మ కొడుకు ఆదాల రాఘవరెడ్డి... అందరినీ క్యాన్సర్ పొట్టన పెట్టుకుంది. శీనయ్య ఆత్మకి శాంతి కలగాలని దైవాన్ని ప్రార్థిస్తున్నాను. సద్గతి ప్రాప్తిరస్తు...!

*శీనయ్యని అమితంగా ఇష్టపడే ఓ అజ్ఞాత మిత్రుడు,*
**అట్లాంటా, అమెరికా.**

# సత్యపీఠం

నిజాలే మాట్లాడుకుందాం! 37

## తప్పుదోవ పట్టిస్తున్న సామాజిక మాధ్యమాలు

సమాజాన్ని చైతన్యవంతం చేసి మంచిదారిలో నడిపించాల్సిన సామాజిక మాధ్యమాలు తాము తప్పుదోవ పడుతూ, ప్రజలను కూడా పెడమార్గం పట్టిస్తున్నాయి. అందులోనూ ఎన్నికలు కీలకఘట్టానికి వస్తున్న ప్రస్తుత తరుణంలో ఇదే అదనుగా కొన్ని మాధ్యమాలు మరీ బరితెగించి నకిలీ సమాచారాన్ని, నకిలీ వీడియోలను కుప్పలు తెప్పలుగా ప్రసారం చేస్తూ ప్రజలను అయోమయానికి గురిచేస్తుండడం పట్ల దేశవ్యాప్తంగా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అధునాతన సాంకేతిక పరిజ్ఞానం అందివచ్చి, ప్రపంచమే అరచేతిలోకి వచ్చేసిన నేటికాలంలో డీప్‌ఫేక్‌లు, ఫేక్ వీడియోలు, ముఖాల మార్ఫింగ్‌లు, నకిలీల మాటలకు మాధ్యమాలు వేదికలవుతున్నాయి. స్మార్ట్‌ఫోన్‌లు వచ్చాక వీటి జోరు మరింత పెరిగిపోయింది. సామాజిక మాధ్యమాలు చిత్తం వచ్చిన రీతిగా విపరీతంగా లేనిపోని ప్రచారాలు, ప్రసారాలు చేస్తున్నాయి. ఉన్నవి లేనట్లు, లేనివి ఉన్నట్లు, చెప్పినవి చెప్పనట్లు.. చెప్పనివి చెప్పినట్లు మాయచేసి మార్ఫింగ్‌లు చేస్తూ ఈ నకిలీలు తమ పబ్బం గడుపుకుంటున్నాయి.

### నకిలీ వీడియోల జోరు

ఒకవైపు అభ్యర్థులు సీరియస్‌గా ఎన్నికల ప్రచారాల్లో ఉంటే, వారు అవతలివారిని ఏదో అన్నట్లు లేనిపోని మాటలు సృష్టించి క్షేత్రస్థాయిలో వ్యతిరేకతను పెంచుతూ వారిని భ్రష్టుపట్టిస్తున్నాయి. అనేక సందర్భాల్లో నాయకుల మాటలను వక్రీకరించి ప్రజల మనసులను కలుషితం చేస్తున్నాయి. నీచరాజకీయాల ఊబిలో మాధ్యమాలు కూరుకుపోతూ, ధనాశతో అలాంటి ఫేక్ వీడియోలను కుప్పలుతెప్పలుగా సృష్టిస్తుండడంతో పార్టీలకు, అభ్యర్థులకు అదొక పెద్ద తలనొప్పిగా తయారైంది. ఆంధ్రలో భూ రక్షణ చట్టం ఎంతోమంచిదని ఒక పార్టీ అంటుంటే, అది భూ భక్షక చట్టమని వేరొకపార్టీ విమర్శిస్తున్న నేపథ్యంలో, వాటిపై వస్తున్న అసత్యప్రచారాలు జనంలో అనుమానాలు రేకెత్తిస్తున్నాయి. రకరకాల మాటలు నకిలీలతో కలిపి కుప్పపోస్తుండడంతో ఏది అసలీయో ఏది నకిలీయో ప్రజలు నిర్ధారించుకోలేని దుస్థితి ఏర్పడుతోంది. వలంటీర్ల వ్యవస్థ, పింఛన్ల పంపకాలు వంటి కీలక అంశాల్లో కూడా మాధ్యమాల పాత్ర సక్రమంగా ఉండడం లేదని, ఆయా పార్టీలకు తగ్గట్టుగా పక్షపాత ధోరణితో వ్యవహరిస్తున్నాయనే ఆరోపణలు కొల్లలుగా వస్తున్నాయి.

### బడా నాయకులకే దిక్కులేదు

మరికొన్ని ఘటనల్లో నకిలీ వీడియోల పాత్ర మరింత దారుణంగా ఉంటోంది. కొందరిని అందుగ్గా ఎంపికచేసి, అవతలిపక్షం అభ్యర్థుల పట్ల అసహ్యకరమైన రీతిలో మాట్లాడించి వారి ప్రతిష్ఠను దెబ్బతీసేందుకు కొందరు నాయకులు చేస్తున్న కుట్రలకు సామాజిక మాధ్యమాలు వాటికి స్థానం కల్పిస్తూ తమవంతు పాపాన్ని మూటగట్టుకుంటున్నాయి. అవతలివారెంత మంచివారైనా..నీచులు నికృష్టులన్నట్లుగా ఎవరితోనో చెప్పించి తమ నీచ ప్రవృత్తిని కొందరు నాయకులు బయటపెట్టుకుంటున్న ఘటనలు కూడా ఇటీవల వెలుగులోకి వస్తున్నాయి. మరికొన్ని సంఘటనల్లో దేశనాయకుల మాటలను కూడా వక్రీకరించి, లేనిపోని మాటలను అంటగట్టి వైరల్ చేస్తుండడం ఇంకా దారుణం. చెప్పనిమాటలను చెప్పినట్లుగా మార్ఫింగ్‌చేసి, మంచి మాటల్ని కత్తిరించేసి, వాటిష్ట ప్రకారం ప్రసారం చేస్తున్నాయి. సాక్షాత్తూ హోంమంత్రి అమిత్‌షా రిజర్వేషన్ల అంశం విషయంలో చెప్పిన మాటలు కూడా ఆ నకిలీ వీడియోల బారినపడి దేశవ్యాప్తంగా ఎంత అల్లకల్లోలం సృష్టిస్తున్నాయో అందరికీ తెలిసిందే. నిజానిజాలను నిర్ధారించుకోకుండా చిత్తానుసారం వ్యవహరించడం ఏమాత్రం మంచిది కాదని తెలిసీ కొంత మంది నకిలీ వీడియోలను జనంలోకి పంపుతుండడం ఘోరం.

### ఎన్నికల కమిషన్ సీరియస్

సామాజిక మాధ్యమాల్లో హల్‌చల్ చేస్తున్న నకిలీ వీడియోలు, అసత్య ప్రచారాలపై ఎన్నికల కమిషన్ సీరియస్‌గా ఉంది. వాటికి బాధ్యులను వెంటనే గుర్తించి హెచ్చరించాలని, అవతలిపక్షం వ్యక్తులను అనుకరించడం, అవమానకర చేసేలా వీడియోలను మార్ఫింగ్ చేయడం తగదని స్పష్టం చేసింది. సంబంధిత ఫిర్యాదులను రాజకీయపార్టీల దృష్టికి తీసుకువచ్చిన వెంటనే 3 గంటలలోగా వాటిని తొలగించాలంటూ తాజాగా నిర్ణీత వ్యవధిని కూడా నిర్దేశించింది. డీప్‌ఫేక్ వీడియోలను సృష్టించి తప్పుడు ప్రచారాలకు దిగితే కఠినచర్యలుంటాయని హెచ్చరించింది. పార్టీలు, వాటి ప్రతినిధులు, ప్రచారకర్తలు ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించకుండా, ఎన్నికల ప్రక్రియపై విశ్వాసం పెంపొందించేలా అన్ని రాజకీయపార్టీలు నడుచుకోవాలని స్పష్టం చేసింది. ఏదేమైనా, ఎన్నికలకు ముహూర్తం సమీపించిన నేటి పరిస్థితుల్లో ఇలాంటి నకిలీలను నమ్ముకోకుండా, సామాజిక మాధ్యమాలపై ఆధారపడకుండా ప్రజలు సామాజిక స్పృహతో ఆలోచించడం, విచక్షణతో ఓటేయడం శ్రేయస్కరం!

- రాజశ్రీ

# శాసనసభలో నిన్న - నేడు - రేపు...?

*గడచిన 72 సంవత్సరాలలో జరిగిన ప్రత్యక్ష ఎన్నికలలో నెల్లూరుజిల్లా నుండి లోక్‌సభకి ఎంపికైన వారి వివరాలని గత వారం 'లాయర్' పాఠకులకి అందించాం. అదేవిధంగా ఆనాటినుండి నేటివరకు జిల్లాలోని శాసనసభ నియోజక వర్గాలకి సంబంధించిన సమాచారాన్ని క్లుప్తంగా ఈ వారం అందిస్తున్నాం.*

## విలువలతో సేవలందించిన పాతతరం నేతలు...!

ఆ రోజులలో పెల్లేటి గోపాలకృష్ణారెడ్డి, బసవారెడ్డి శంకరయ్య, గంగా చినకొండయ్య, బెజవాడ గోపాలరెడ్డి, స్వర్ణ వేమయ్య, బత్తిన రామకృష్ణారెడ్డి, ఆనం చెంచు సుబ్బారెడ్డి, రేబాల దశరథరామిరెడ్డి, వేమారెడ్డి వెంకురెడ్డి, ధనెంకుల నరసింహం, బెజవాడ పాపిరెడ్డి, పెళ్లకూరు రామచంద్రారెడ్డి, అన్నదాత మాధవరావు, నల్లపరెడ్డి చంద్రశేఖరరెడ్డి, నల్లపరెడ్డి శ్రీనివాసులరెడ్డి, ఒరేపల్లి వెంకటసుబ్బయ్య, కంచర్ల శ్రీహరినాయుడు, నువ్వుల వెంకటరత్నం నాయుడు, బొమ్మిరెడ్డి సుందరరామిరెడ్డి, కలికి యానాదిరెడ్డి, కేవీ.సుబ్బారెడ్డి, ఆనం వెంకటరెడ్డి, జక్కా వెంకయ్య, నేదురుమల్లి జనార్ధనరెడ్డితో పాటు భారత ఉపరాష్ట్రపతి స్థాయికి ఎదిగిన ముప్పవరపు వెంకయ్యనాయుడు లాంటివారు... ఇంకా అనేకమంది విలువలున్న పెద్దలు, మహానుభావులు, చైతన్యమూర్తులు, స్ఫూర్తిప్రదాతలు చట్టసభలలో తమదైన ముద్ర వేసుకున్నారు. సమాజసేవలో తరించి ప్రజల అభిమానాన్ని చూరగొన్నారు. తరాలు గడచినా వారిని మరువలేని స్థాయిలో తమ ఉనికిని చాటుకున్నారు. తమ పేర్లని చిరస్థాయిగా నిలువుకున్నారు.

## నాటి నాయకుల తీరుకి భిన్నంగా నేటి నేతలు!

గతించిన కాలంతో పోలిస్తే ప్రస్తుత పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయి. నాయకుల తీరు, ప్రవర్తన, వ్యవహారశైలి పూర్తిగా మారిపోయాయి. రాజకీయాలలో విలువలు పూర్తిగా దిగజారిపోయాయి. దౌర్జన్యాలు, దుర్మార్గాలు పెరిగిపోయాయి. అహంకారపు పోకడలు రాజ్యమేలుతున్నాయి. ప్రజాస్వామ్య పద్ధతులలో జరగాల్సిన ఎన్నికలు ఆధిపత్య ప్రదర్శనలుగా, ధనస్వామ్య ప్రహసనాలుగా తయారయ్యాయి. ఇలాంటి వాతావరణంలో రేపు మే13వ తేదీ రాష్ట్రంలో ఎన్నికలు జరగబోతున్నాయి.

## మారుతూ వచ్చిన జిల్లా రాజకీయ స్వరూపం!

శాసనసభకు తొలిసారి 1952లో జరిగిన ఎన్నికల సమయంలో జిల్లాలో 11 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండేవి. ఆ తరువాత 1955లో 14, 1962లో 17, 1967లో 16 నియోజకవర్గాలు జిల్లాలో ఉండేవి. అప్పటివరకు ప్రకాశం జిల్లాని కూడా కలుపుకుని ఉమ్మడి నెల్లూరుజిల్లాగా నెల్లూరుని పిలిచేవారు. 1972 ఎన్నికల నాటికి ప్రకాశం జిల్లాతో సంబంధం లేకుండా నెల్లూరులో 11 నియోజకవర్గాలు ఏర్పడ్డాయి. ఆ 11 నియోజకవర్గాలు 2009 వరకూ కొనసాగాయి. మళ్ళీ 2009లో జరిగిన నియోజకవర్గాల పునర్విభజనలో రాపూరు, అల్లూరు నియోజకవర్గాలు కనుమరుగయ్యాయి. కొత్తగా నెల్లూరు గ్రామీణ నియోజకవర్గం ఏర్పడి 10 అసెంబ్లీ నియోజకవర్గాలు కలిగిన జిల్లాగా నెల్లూరు అవతరించింది. వరుసగా 2009, 2014, 2019లో ఈ పది నియోజకవర్గాలలో ఎన్నికలు జరిగాయి.

## కొత్త జిల్లాల ఏర్పాటుతో 8 నియోజకవర్గాలు మిగిలాయి!

రాష్ట్రం 2014లో విడిపోయిన తరువాత అధికారంలోకి వచ్చిన తెలుగుదేశం కొత్త జిల్లాల జోలికి వెళ్ళలేదు. అయితే 2019లో జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం వచ్చాక కొత్త జిల్లాలను ఏర్పాటు చేసింది. అందులో భాగంగా నెల్లూరుజిల్లాలోని గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు కొత్తగా ఏర్పడిన తిరుపతి జిల్లాకి వెళ్ళి పోయాయి. ప్రకాశం జిల్లాలోని కందుకూరు నెల్లూరుజిల్లాలో కలవడంతో ఆ నియోజకవర్గం నెల్లూరుజిల్లాలోకి వచ్చి చేరింది. అంటే మొత్తం పది నియోజకవర్గాలలో 3 తిరుపతి జిల్లాలోకి వెళ్ళిపోవడంతో మిగిలిన 7 నియోజకవర్గాలకి కందుకూరు తోడై 8 అసెంబ్లీ నియోజకవర్గాలు కలిగిన జిల్లాగా నెల్లూరు మిగిలింది. నెల్లూరుజిల్లాలో మిగిలిన నెల్లూరు నగరం, నెల్లూరు గ్రామీణం, కోవూరు, కావలి, ఉదయగిరి, కందుకూరు, ఆత్మకూరు, సర్వేపల్లి నియోజకవర్గాలలో ఒక్క సర్వేపల్లి మాత్రం తిరుపతి పార్లమెంటు పరిధిలోకి వెళ్ళింది.

పాత నెల్లూరుజిల్లాని పరిగణలోకి తీసుకుంటే గత ఎన్నికలలో నెల్లూరు నగరం నుండి అనిల్‌కుమార్‌యాదవ్, గ్రామీణం నుండి కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, కోవూరు నుండి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి, కావలి నుండి రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, ఉదయగిరి నుండి మేకపాటి చంద్రశేఖరరెడ్డి, ఆత్మకూరు నుండి మేకపాటి గౌతమ్‌రెడ్డి, ఆయన దివంగతులైన తరువాత జరిగిన ఉప ఎన్నికలలో ఆయన సోదరుడు మేకపాటి విక్రమ్‌రెడ్డి, వెంకటగిరి నుండి ఆనం రామనారాయణరెడ్డి, గూడూరు నుండి వరప్రసాద్, సూళ్లూరు పేట నుండి కిలివేటి సంజీవయ్య అధికారపార్టీ వైసీపీ అభ్యర్థులుగా విజయం సాధించారు. ఆ ఎన్నికలలో తెలుగుదేశం పార్టీకి ఒక్క సీటు కూడా రాకపోవడం గమనార్హం.

## పార్టీలు మారిన అభ్యర్థులు - తారుమారైన పరిస్థితులు

అయిదేళ్ళ తరువాత మళ్ళీ ఎన్నికలొచ్చాయి. ఈ అయిదు సంవత్సరాల కాలంలో జిల్లా రాజకీయాలు పూర్తిగా మారిపోయాయి. వెంకటగిరి నుండి గెలిచిన ఆనం రామనారాయణరెడ్డి, నెల్లూరు గ్రామీణం నుండి నెగ్గిన కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, ఉదయగిరి నుండి విజయం సాధించిన మేకపాటి చంద్రశేఖరరెడ్డి పార్టీ మారారు. తెలుగుదేశం

## ○ పార్టీల ఉత్కంఠ పోరు.. అర్థం కాని ఓటర్ల తీరు

తీర్థం పుచ్చుకున్నారు. సరిగ్గా ఎన్నికలు సమీపించిన వేళ మాజీ రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, తన సతీమణి ప్రశాంతిరెడ్డితో సహా టీడీపీలో చేరిపోయారు. వైసీపీకి కంచుకోట అనుకున్న నెల్లూరుజిల్లాలో ఆ పార్టీ బీటలుబారింది. ప్రస్తుతం జిల్లాలోని అన్ని నియోజకవర్గాలలో పోటీ నువ్వా-నేనా అన్నట్లుగా తయారయ్యింది.

ఒక్కొక్కటిగా పరిశీలిస్తే...

### నెల్లూరు నగరం!




గత ఎన్నికలలో వైసీపీ ప్రభంజనంలో సైతం తక్కువ ఓట్లతో గెలిచిన అనిల్‌కుమార్‌యాదవ్ ఇప్పుడు జిల్లాలోనే లేరు. ఆయన స్థానంలో డిప్యూటీ మేయర్ ఖలీల్ వైసీపీ తరపున నెల్లూరు నగర అభ్యర్థిగా రంగంలో ఉన్నారు. పోయినసారి తక్కువ తేడాతో ఓడిపోయినా పొంగూరు నారాయణ ఈసారి గెలుపు ధీమాతో దూసుకుపోతున్నారు. టీడీపీ అభ్యర్థిగా భారీ మెజారిటీ లక్ష్యంగా శ్రమిస్తున్నారు.

### నెల్లూరు గ్రామీణం!




నెల్లూరు గ్రామీణ శాసనసభ వైసీపీ అభ్యర్థిగా గత ఎన్నికలలో అదే పార్టీ నుండి పార్లమెంటు సభ్యుడిగా పోటీచేసి గెలిచిన ఆదాల ప్రభాకరరెడ్డి ఇప్పుడు బరిలో ఉన్నారు. ఆదాలపైన కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తెలుగుదేశం నుండి పోటీ చేస్తున్నారు. రెండు పర్యాయాలు వరుసగా రూరల్ నుండి విజయం సాధించిన శ్రీధర్‌రెడ్డి వివాదాస్పదుడన్న అపవాదు మూటకట్టుకున్నారు. తొలిసారిగా గ్రామీణ నియోజకవర్గం నుండి పోటీ చేస్తున్న ఆదాల ప్రభాకరరెడ్డికి అజాతశత్రువు, వివాద రహితుడు, సౌమ్యుడు అన్న పేరు ఉంది.

### కోవూరు!




కోవూరు నుండి వైసీపీ పాత కాపు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డే పోటీలో ఉండగా, ఆయనపైన వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి టీడీపీ అభ్యర్థిగా రంగంలో దిగారు. ఇక్కడ కూడా టీడీపీ అభ్యర్థి ప్రశాంతి రెడ్డి మెజారిటీపైనే అక్కడి నాయకులు లెక్కలు వేసుకోవడం, పందాలు కాసుకోవడం గమనార్హం.

### కావలి!




కావలిలో వరుసగా రెండుసార్లు వైసీపీ అభ్యర్థిగా విజయం సాధించిన రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి గడచిన పదేళ్లలో కావలసినంత అపఖ్యాతి తెచ్చుకున్నారు. అయినా వైసీపీ ఆయనకే మళ్ళీ సీటిచ్చింది.

14లో



# కొత్తూరు దేవుళ్లకు..అంగరంగ వైభవంగా అభిషేక పూజలు



**ఒకవైపు హోమాలు..మరోవైపు విశిష్ట పూజలు.. అలంకారాలతో కొత్తూరులో సుప్రసిద్ధమైన రెండు దేవాలయాలు భక్తజనులను ఎంతగానో ఆకట్టుకు న్నాయి. ఆ గ్రామంలో కొలువైవున్న మహిమాన్వితమైన శ్రీ యోగాంజనేయస్వామి దేవాలయం, శ్రీ షిరిడీ సాయిబాబా వారి దేవస్థానంలో ఇటీవల జరిగిన 16వ వార్షిక బ్రహ్మోత్సవ వేడుకలు అందరినీ భక్తిభావ సమన్వితులను చేశాయి. కొత్తూరు, ఇందుకూరుపేట ప్రాంతం నుంచే కాక, జిల్లాలోని అనేకప్రాంతాల నుంచి భక్తజనం ఈ ఆలయాలకు తరలివచ్చి స్వామివార్లను దర్శించుకుని తరించారు.**

ఇందుకూరుపేట మండలం కొత్తూరు గ్రామంలో విశాలమైన ప్రాంగణలో నయనమనోహరంగా నిర్మించిన శ్రీ యోగాంజనేయస్వామి, శ్రీ షిరిడీ సాయిబాబా దేవాలయాలు అటు సముద్రతీర ప్రాంత ప్రజలను ఇటు జిల్లాలోని అనేక గ్రామాల భక్తులను ఆకట్టుకుంటూ, జిల్లాలో సుప్రశాంతమైన ఆధ్యాత్మిక దివ్య క్షేత్రాలుగా వెలుగొందుతున్నాయి. ఏటా ఇక్కడ జరిగే ఉత్సవాలు, వేడుకలు ఎంతో భక్తిశ్రద్ధలతో కన్నుల పండువగా నిర్వహిస్తుంటారు. దైవీగుణ సంపన్నులైన ఆధ్యాత్మిక సేవా తత్పరులు..ఆలయ ధర్మకర్తలు కలికి

## ○ శ్రీ యోగాంజనేయునికి, శ్రీ షిరిడీ సాయిబాబాకు విశేష అలంకారాలు
## ○ మంత్రముగ్ధులను గావించిన.. హనుమాన్ చాలీసా పారాయణం



శ్రీలత–కలికి కోదండరామిరెడ్డిల నేతృత్వంలో అనునిత్యం ఈ ఆలయాల్లో పూజలు.. సేవలు జరుగుతూనే ఉంటాయి. ప్రత్యేకించి బ్రహ్మోత్సవాల రోజుల్లో స్వామి వార్లకు జరిగే కైంకర్యాలు మరింత వైభవంగా ఉంటాయి. ఆలయాలను నిర్మించి తమ పని పూర్తయిందనే భావనతో కాకుండా, ఆలయ ధర్మకర్తలైన కలికి

### మార్మోగిన.. హనుమాన్ చాలీసా



ఈ ఉత్సవాల సందర్భంగా ప్రతి రోజు ఉదయం 11.30 గంటల నుంచి ప్రారంభమయ్యే శ్రీ హనుమాన్ చాలీసా పారాయణం వినేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. అందులోనూ హనుమత్ ఉపాసకులు, కీ.శే ఎంఎస్ రామారావు మనుమడు డా.పి.శ్రీనివాసస్వామి తన శ్రావ్యమైన కంఠంతో అత్యద్భుతంగా హనుమాన్ చాలీసాను పారాయణం చేయడంతో భక్తులు మంత్రముగ్ధులయ్యారు. ఇంతటి మహత్కార్యాలను నిర్వహించిన ఆలయ నిర్వాహకులను అందరూ కొనియాడారు. ఈ ఉత్సవాల్లో ప్రతిరోజూ మధ్యాహ్నం భక్తులందరికీ నిర్వాహకులు పెద్దఎత్తున అన్నప్రసాద వితరణ గావించారు.



దంపతులు ఈ ఆలయాలను మనోహరంగా నిర్మించడంతో పాటు నేటికీ ఆలయాల్లో జరిగే పూజా కార్యక్రమాలను, అలంకారాలను.. సేవలను అన్నిటినీ కూడా ఎప్పటికప్పుడు శ్రద్ధాసక్తులతో పర్యవేక్షిస్తుండడం వారి భక్తి తత్పరతకు నిదర్శనం. దీంతో ఆలయాలు రెండూ దివ్యమైన–భవ్యమైన దేవాలయాలుగా జిల్లావ్యాప్తంగా భక్తులను ఆకట్టుకుంటున్నాయి.

### వైభవంగా పంచామృతాభిషేకాలు

ఇటీవల జరిగిన 16వ వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయ ధర్మకర్తల సారధ్యంలో ఆలయాలు పూల అలంకారాలు, విద్యుత్ అలంకారాలతో దేదీప్యమానమయ్యాయి. పిల్లలు, పెద్దలు కుటుంబాలతో సహా అనేకమంది భక్తులు ఈ వేడుకలకు తరలివచ్చారు. గతనెల 30వ తేది నుంచి మే 3వ తేది వరకు ఎంతో దీక్షతో.. భక్తితో జరిగిన ఈ వేడుకల్లో కలికి దంపతులు పాల్గొని మే 1న శ్రీ సాయినాధునికి, 3వ తేదీన శ్రీ యోగాంజనేయస్వామి వార్లకు ప్రత్యేక పూజలు చేసి, స్వామివార్లకు ఎంతో విశిష్టమైన రీతిలో పంచామృతాభిషేకాలను నిర్వహింపజేశారు. ఈ పూజా కార్యక్రమాలను కళ్ళారా తిలకించిన భక్తులు పరమానందంతో పరవశించిపోయారు.

# వెంకటగిరి అభివృద్ధికి.. రామ్‌కుమార్‌రెడ్డి ప్రత్యేక ప్రణాళిక

## ➢ చేనేతలకు చేయూతనిస్తా!.. పరిశ్రమలు తెస్తా!
## ➢ తల్లితండ్రుల బాటలో పయనిస్తా!.. సమస్యలన్నీ తీరుస్తా!

వెంకటగిరి నియోజకవర్గ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా తాను పనిచేస్తానని, తమ తల్లితండ్రులు నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి–రాజ్యలక్ష్మమ్మలు చూపిన బాటలో ప్రజల అభ్యున్నతికి బాటలు వేస్తానని వెంకటగిరి వైకాపా అభ్యర్ధి నేదురుమల్లి రామ్‌కుమార్ రెడ్డి చెప్పారు. అందుకోసం తానొక ప్రత్యేక ప్రణాళికను రూపొందించినట్లు కూడా ఆయన తెలిపారు.మే 7న వెంకటగిరిలోని తన నివాసంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆ ప్రణాళిక వివరాలను తెలిపారు. మెరుగైన రోడ్లు, రైలు కనెక్టివిటీ, సురక్షిత త్రాగు నీటి సరఫరా, అందుబాటులోకి తెస్తానని, వెంకటగిరిలో మెరుగైన ఆధునిక వైద్య సదుపాయాలు కల్పిస్తానని చెప్పారు. మగ్గంతో జీవనోపాధి పొందే చేనేతకారులు ప్రతిఒక్కరూ ప్రభుత్వం ఇచ్చే పథకాలకు అర్హులయ్యేలా చూస్తామన్నారు. ప్రజలకు వైద్య సౌకర్యాల విస్తరణలో భాగంగా ఇప్పుడున్న గోషా ఆస్పత్రి ప్రాంగణంలోనే స్పెషాలిటీ ఆస్పత్రిని కూడా నిర్మిస్తామన్నారు. అదేవిధంగా, అక్కడే కిడ్నీ వ్యాధి గ్రస్తుల




కోసం డయాలసిస్ సెంటర్ ఏర్పాటుచేస్తామని తెలిపారు. కంప్యూటర్ సంబంధమైన ఉన్నత విద్యను అభ్యసించడానికి అనువైన కాలేజీలను విశ్వోదయ కళాశాల ఆవరణలో ఏర్పాటు చేయిస్తామన్నారు. పెట్లూరు వెళ్ళేదారిలో రైల్వేగేట్ వద్ద ఫ్లైవోవర్ బ్రిడ్జిని నిర్మిస్తామని, సోమశిల– స్వర్ణముఖి లింక్ కెనాల్ కోసం ఫారెస్ట్ క్లియరెన్స్ తిప్పించి పూర్తిచేయిస్తామని చెప్పారు. భారత్ హెవీ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్ (బిహెచ్ఐఎల్)కు సంబంధించి 700 ఎకరాలు ఖాళీ స్థలం ఉందని, ఈ ప్రాంతాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేస్తానని తెలిపారు. ఇప్పటికే, పోలేరమ్మ జాతరకు రాష్ట్ర స్థాయి పండుగ హోదాను కల్పించడం, వెంకటగిరిలో 110 ఎకరాల్లో అర్బన్ పార్క్ (నగరవనం) ఏర్పాటు, నియోజకవర్గంలోని 107 సచివాలయాల పరిధిలో రూ.53.50 కోట్లు విలువ చేసే అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందని, రూ. 3 కోట్లతో బీసీ భవన్ మంజూరు నిర్మాణానికి కృషి జరుగుతోందని, రూ.636 కోట్లతో ఆల్తూరుపాడు రిజర్వాయర్ నిర్మాణం కోసం ప్రభుత్వం సహకారం అందిస్తోందని, వెంకటగిరి పట్టణ విస్తరణకు అవుటర్ రింగ్ రోడ్ ప్రణాళిక సిద్ధంగా ఉందని ఆయన తెలిపారు. తమ తల్లిదండ్రులు నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి, రాజ్యలక్ష్మమ్మల కృషితో గతంలో జిల్లా కేంద్రంలో సైతం లేని విధంగా పాఠశాల విద్యకు సంబంధించి ఏపీ మోడల్ స్కూల్, గురుకుల పాఠశాల, కేంద్రీయ విద్యాలయం, ఏపీ రెసిడెన్షియల్ కళాశాల వంటి ప్రతిష్టాత్మక విద్యా సంస్థలతో పాటు ఐఐహెచ్‌టి ఏర్పాటు చేశారన్నారు. వారూ చూపిన బాటలో పయనిస్తూ, వెంకటగిరి అభివృద్ధికి అంకితమై పనిచేస్తానన్నారు. నేదురుమల్లి కుటుంబం వెంకటగిరి ప్రజల శ్రేయస్సుకు నిరంతరం కృషిచేస్తుందన్నారు. ప్రజలు ఆదరించి ఈ ఎన్నికల్లో తనను గెలిపించి, ఎమ్మెల్యేగా ప్రజలకు సేవచేసే భాగ్యం కల్పించాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు.



## తనయుడిని గెలిపించాలంటూ రాజ్యలక్ష్మమ్మ ప్రచారం



తనయుడి గెలుపు కోసం తల్లి ఎన్నికల ప్రచారంలో ముమ్మరంగా పాల్గొంటూ అందరి దృష్టినీ ఆకట్టుకుంటోంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, జిల్లాలో ఎందరో రాజకీయ నాయకులకు మార్గదర్శిగా ఉండిన దివంగత నేత నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి, మాజీ మంత్రి రాజ్యలక్ష్మమ్మల తనయుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ఈ ఎన్నికల్లో వెంకటగిరి నుంచి వైకాపా అభ్యర్ధిగా రంగంలో ఉన్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో రామ్ తల్లి రాజ్యలక్ష్మమ్మ ఈ మండుటెండలను సైతం లెక్కచేయకుండా గ్రామాల్లో పర్యటిస్తూ తనయుడికి విజయం సాధించిపెట్టాలని ప్రజలను కోరుతోంది. ఇటీవల ఆమె వెంకటగిరి నియోజకవర్గంలోని బాలాయపల్లి మండలంలో ఉన్న కామమూరు గ్రామ పంచాయతీలోని దళితవాడల్లో పర్యటించి ప్రజల సమస్యలు తెలుసుకోవడంతో పాటు, నేదురుమల్లి కుటుంబం ఎల్లవేళలా ప్రజలకు అండగా ఉంటోందని, రామ్‌ను ప్రజలు ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేసింది.



# మనసున్న మారాజు

మనసున్న మారాజులు
నూటికో కోటికో
ఒక్కరే పుడతారు

## జక్కా శ్రీనివాసులురెడ్డి గారు
## (జే.యస్.రెడ్డి)

1944 — 2024

### మా పెద్దాయనకి కన్నీటి నివాళి...

లేట్ ప్రత్తి సూరి కుమారుడు **ప్రత్తి శ్రీనివాసులు**



కీ॥శే॥ ప్రత్తి సూరి

రేబాల లక్ష్మీనరసారెడ్డి పురమందిరం (టౌన్‌హాలు)
రవీంద్రనాథ్ ఠాగూర్ ఆడిటోరియం
శ్రీ కస్తూరిదేవి విద్యాలయ ప్రాంగణం
శ్రీరాజ్ హైరర్స్
నెల్లూరు. సెల్ : 9347102503.

# మా మద్దతు నారాయణకే

## మాటిచ్చిన అక్కినేని అభిమానులు



నెల్లూరు నగర టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ పొంగూరు నారాయణకే తమ మద్దతు అంటూ సినీ నటుడు, యువసామ్రాట్ అక్కినేని నాగార్జున అభిమానులు మాటిచ్చారు. ఇటీవల ఆ సంఘం ప్రెసిడెంట్ మధు, తన మిత్రబృందంతో కలసి నెల్లూరులోని నివాసంలో నారాయణను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నారాయణను వారు శాలువాలతో సన్మానించి సత్కరించారు. రానున్న ఎన్నికల్లో మీ విజయానికి తమవంతు శక్తి వంచన లేకుండా కృషిచేస్తామని నారాయణకు హామీ ఇచ్చారు. అనంతరం, నారాయణ వారికి కృతజ్ఞతలు తెలియజేశారు. రాష్ట్రాభివృద్ధి, ప్రజా సంక్షేమం రెండూ జరగాలంటే... టీడీపీ–బీజేపీ–జనసేన కూటమి అధికారంలోకి రావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. మే 13న జరిగే ఎన్నికల్లో ప్రజలందరూ ఎన్డీఏ కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు.

# మన హక్కులు మనం కాపాడుకుందాం!

## మానవ హక్కుల అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు చౌహాన్ లక్ష్మణ్‌సింగ్ పిలుపు



మానవ హక్కుల గురించి సరైన అవగాహన లేకపోవడంతో సమాజంలో సగటు మానవుడు చాలా నష్టపోతున్నాడని, హ్యూమన్ రైట్స్ అసోసియేషన్ నెల్లూరుజిల్లా అధ్యక్షులు చౌహాన్ లక్ష్మణ్‌సింగ్ అన్నారు. భారత మాజీ రాష్ట్రపతి దివంగత జ్ఞానీ జైల్‌సింగ్ స్థాపించిన "ఆల్ ఇండియా హ్యూమన్ రైట్స్ అసోసియేషన్" నెల్లూరుజిల్లా కార్యవర్గ బృందాన్ని నియమించుకుని వారందరికీ గుర్తింపుకార్డులని ఇచ్చే కార్యక్రమం ఇటీవల లక్ష్మణ్‌సింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో తమ హక్కుల గురించి తెలియక సగటు మనిషి అనేక సందర్భాల్లో చాలా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లావాసులు సమాజంలో ఎక్కడైనా తమకి అన్యాయం జరుగుతుందని, తమ హక్కులకు భంగం కలుగుతోందని భావిస్తే... ఆ విషయాన్ని తమ దృష్టికితెస్తే వారికి తమ సంస్థ ద్వారా న్యాయం జరిగేలా చూస్తామని చెప్పారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ముఖ్య పోషకులు ఎద్దల రామచంద్రారెడ్డి, కార్యవర్గసభ్యులు మురళీకృష్ణ, యోగేంద్రనాథ్, సాయి కిరణ్‌రెడ్డి, గిరిబాబు, ప్రకాష్‌రావు, శ్రీనివాసులు, శ్రీకాంత్, సురేష్, చెన్న కేశవరెడ్డి, వెంకటేష్, జయకుమార్, నారాయణరెడ్డిలను వివిధ హోదాలలో నియమించి సంస్థ గుర్తింపుకార్డులను అందించారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ పడవల సుధాకర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.

# నెల్లూరు కబుర్లు

## ఎన్నికల ప్రచారాలకు..

# 11వ తేదీ వరకే అనుమతి



ఎన్నికల ప్రచారాలకు మే 11వతేది సాయంత్రం 6 గంటల వరకే అనుమతి ఉంటుందని జిల్లా ఎన్నికల అధికారి..కలెక్టర్ హరినారాయణన్ చెప్పారు. ఎన్నికల సంఘం నిర్ధేశించిన నిబంధనలు అభ్యర్థులు తప్పని సరిగా పాటించాలన్నారు. మే 8న ఆయన నెల్లూరు కార్పొరేషన్ కమాండ్ కంట్రోల్ సెంట్రల్‌లో జరిగిన రాజకీయపార్టీల ప్రతినిధులు సమావేశంలో మాట్లాడారు. 11వ తేది సాయంత్రం 6 గంటల తర్వాత, ఎలాంటి మైకులు, జనం లేకుండా కేవలం నలుగురితో మాత్రమే ఇంటింటికి వెళ్ళి నిశ్శబ్ధంగా ప్రచారం చేసుకోవచ్చన్నారు. బయట నియోజకవర్గాల నుంచి వచ్చినవారు జిల్లాను విడిచివెళ్ళాలన్నారు. అన్ని కల్యాణ మండపాలు, లాడ్జీల్లో ముమ్మరంగా తనిఖీలుంటాయని చెప్పారు. ఈనెల 7వ తేదీ నాటికి పోస్టల్ బ్యాలెట్ ద్వారా 19,542 మంది ఉద్యోగులు తమ ఓటుహక్కును వినియోగించుకున్నారని, ఇంకా 566 మంది ఓటు వేయాల్సి ఉందని, వారంతా కూడా ఓటు హక్కును వినియోగించుకోవాలని ఆయన సూచించారు.

# వైకాపా విజయం తథ్యం!

## --- రావు శ్రీనివాసరావు ---



మే 13న జరిగే సార్వత్రిక ఎన్నికల్లో వైకాపా విజయం తథ్యమని వైకాపా రాష్ట్ర సేవాదళ్ కార్యదర్శి రావు శ్రీనివాసరావు (ఆర్ఎస్ఆర్) అన్నారు. మే 8న ఆయన నెల్లూరులోని 20వ డివిజన్ వనంతోపు సెంటర్, హరేకృష్ణనగర్, పెద్దబావి సెంటర్, స్నేహనగర్, ఎస్టీకాలనీ తదితరప్రాంతాల్లో ముమ్మరంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలను అందించిన ఏకైక ముఖ్యమంత్రి ఒక్క జగన్‌మోహన్‌రెడ్డేనని ఆయన కొనియాడారు. ఈ ఎన్నికల్లో వైకాపా అభ్యర్థులుగా నెల్లూరు ఎంపీగా పోటీచేస్తున్న విజయసాయిరెడ్డిని, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యేగా ఆదాల ప్రభాకర్‌రెడ్డిని ప్రజలు ఆశీర్వదించి గెలిపించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వైకపా జిల్లా మహిళా కార్యదర్శి పోతురాజు రమాదేవి, నాయకులు రాజారెడ్డి, గోపాల్‌రెడ్డి, నాగేశ్వరరెడ్డి, సరళమ్మ, రఘురామయ్య తదితరులు పాల్గొన్నారు.

## క్రికెట్ ఎంపికల కమిటీలో..

# మరోసారి మలిరెడ్డి కోటారెడ్డి



ఆంధ్ర క్రికెట్ అకాడమీ (ఏసీఏ) జూనియర్స్ పురుషుల ఎంపిక కమిటీ సౌత్‌జోన్ సభ్యునిగా నెల్లూరుకు చెందిన ప్రముఖ క్రికెట్ క్రీడాకారుడు, మాజీ రంజీ ఆటగాడు మలిరెడ్డి కోటారెడ్డి మరోసారి నియమితులవడం పట్ల క్రికెట్ క్రీడాకారుల్లో సంతోషం వ్యక్తమైంది. ఆ మేరకు మే 7న ఏసీఏ ఉత్తర్వులివ్వడంతో, క్రికెట్ క్రీడాకారులను ఎంతగా ప్రోత్సహించే మలిరెడ్డి నియామకాన్ని అందరూ హర్షిస్తున్నారు.

## ఖలీల్ అహ్మద్ కోసం..

# పర్వతరెడ్డి తనయుడి ప్రచారం



నెల్లూరు 54 డివిజన్ ఇస్లాంపేటలో వైసిపి నెల్లూరు నగర నియోజకవర్గ అభ్యర్థి ఖలీల్ అహ్మద్‌తో కలిసి వైసీపీ జిల్లా అధ్యక్షులు ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి తనయుడు రానా ప్రమోద్‌రెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి ఈ ఎన్నికల్లో వైకాపాను గెలిపించాలని కోరారు. డివిజన్ ఇన్‌చార్జ్ ముజీర్, కోఆప్షన్ సభ్యులు జమీర్, తదితరులు పాల్గొన్నారు.

# విశ్వకవీంద్రుడు..రవీంద్రుడు



విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ జయంతిని పురస్కరించుకుని మే 7న నెల్లూరులోని డా.ఎస్ఆర్‌కె విశ్వసాయి స్కూల్‌లో రవీంద్రుని జీవితంపై విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించారు. విజేత వర్షితను అభినందించి బహుమతినిచ్చారు. నెల్లూరు బాలభవన్ డైరెక్టర్ గోవింద రాజుల సుభద్రాదేవి, పాఠశాల డైరెక్టర్ కృష్ణమోహన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వారు రవీంద్ర కవీంద్రుని జీవిత విశేషాలను విద్యార్థులకు తెలియజెప్పారు. రవీంద్రుడంటే విశ్వకవీంద్రుడని కొనియాడుతూ, ఆయన రచనలు ఎంత మహత్తరమైనవో వివరించారు.

# జయభారత్ ఆసుపత్రికి విరాళం



నెల్లూరులోని జయభారత్ ఆసుపత్రిలో చేస్తున్న ఉచిత కంటి ఆపరేషన్ల పథకానికి నెల్లూరులోని న్యూమిలిటరీ కాలనీకి చెందిన అరుణ కుమారి తన పుట్టిన రోజు సందర్భంగా మే 4న రూ.24 వేలు విరాళంగా ఇచ్చారు. అదేవిధంగా ఆసుపత్రి ప్రాంగణంలో నిర్వహిస్తున్న మజ్జిగ చలివేంద్రం నిర్వహణకు రూ.1500 చేయూతగా అందించారు. ఆ మొత్తాలను ఆసుపత్రి జనరల్ మేనేజర్ గురుప్రసాద్‌కు ఆమె అందజేశారు.

# నగరంలో వాన

మండిపోతున్న ఈ ఎండల్లో ఎట్టకేలకు ఒక్కసారిగా చల్లని వాతావరణం ఉపశమనం కలిగించింది. మే7 మంగళవారం అర్ధరాత్రి సమయంలో నగరంలో చిటపట చినుకులు కురవడంతో ఉక్కపోత తగ్గింది. రోడ్లు కాస్తంత చల్లబడ్డాయి. ఉరుములు గాలులతో వాన వాతావరణం కనిపించింది. హమ్మయ్య, ఇక రెండుమూడు రోజులు వర్షాలు కురుస్తాయిలే అనుకుంటుండగానే, మళ్ళీ ఉదయానికల్లా సూర్యుడు భగభగలాడాడు.






## పెద్దాసుపత్రి రోగులకు

# అన్నం, మజ్జిగ వితరణ

నెల్లూరు ప్రభుత్వాసుపత్రిలోని ప్రసూతి విభాగం వద్ద ఈనెల 7న స్థానిక హ్యాండ్స్ వన్ ఫౌండేషన్ స్వచ్ఛంధ సంస్థ వ్యవస్థాపకులు రమేష్ ఆధ్వర్యంలో సుమారు 150 మంది రోగులకు, సిబ్బందికి అన్నం, మజ్జిగ పంపిణీ చేశారు. తమ ఫౌండేషన్ సభ్యుడు శ్రీమన్నారాయణ – సుజాత దంపతుల వివాహదినోత్సవం సందర్భంగా, వారి కుటుంబసభ్యుల సౌజన్యంతో తాము ఈ సేవా కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం మహిళా అధ్యక్షురాలు పద్మప్రియ, సభ్యురాలు లీలాదీప, ఫౌండేషన్ ప్రతినిధులు నవీన్, తులసీనాథ్, జ్యోతిశ్రీ తదితరులు పాల్గొన్నారు.

# 'జయహో విపిఆర్'.. అంటున్న జనం

విపిఆర్.. విపిఆర్!.. విపిఆర్!... జిల్లాలో ఎక్కడికెళ్ళినా ఇదే మాట. వాడవాడలా ఇదే పలవరింత..ఇదే కలవరింత. జనంలో వీపీఆర్ పట్ల విపరీతంగా పెరిగిపోతున్న ఆదరణకు ఇదో నిదర్శనం. మంచివాడు, ఎంత డబ్బున్నా..గొప్ప దయాగుణం ఉన్న వాడు, తొలినుంచీ ఆధ్యాత్మిక-సామాజికసేవా పరాయణుడు, జిల్లా ప్రజల శ్రేయస్సు కోసం సొంతడబ్బును కోట్లాదిరూపాయలుగా వెచ్చించిన మహాదాత, అనాథలకు ఆత్మబంధువు, నిరుపేదలకు ఆదరహస్తం, దీనజనులకు, దివ్యాంగులకు అభయప్రదాత, రోగార్తులకు ప్రాణదాత అన్నీ..ఆ ఒక్క విపిఆరే. అన్నిటికంటే మిన్నగా..ఆయనో నిస్వార్థ సేవా తత్పరుడు. పదవి ఉన్నా లేకున్నా జనం కోసం 'నేనున్నా'నంటూ ఎన్నో సందర్భాల్లో నిరూపించుకున్న అసలుసిసలైన ప్రజానాయకుడు. అలాంటి మానవీయ మూర్తి.. మహోన్నత వ్యక్తి జిల్లాలో ఆయనొక్కరేనన్నది అందరికీ తెలిసిందే. ఎంతో కాలంగా సేవారంగంలో తరిస్తున్న విపిఆర్ ఇప్పుడు ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చి ఎన్నికల రంగంలోకి రావడంతో ప్రజల్లో విపిఆర్ పట్ల అభిమానం వెల్లువెత్తుతోంది. ఆయనతో పాటు ఆయన సతీమణి ప్రశాంతిరెడ్డి కూడా ఎన్నికల్లోకి రావడం విశేషం. 'తమను దీవించండి' అంటూ వారు ముకుళిత హస్తాలతో అభ్యర్థిస్తుంటే, ప్రజలు వారికి జేజేలు పలుకుతున్నారు. తెలుగుదేశం పార్టీ తరపున నెల్లూరు ఎంపీ అభ్యర్థిగా పోటీచేస్తున్న తనను, కోవూరు నియోజకవర్గంలో తొలిసారిగా మహిళా అభ్యర్థిగా ఎన్నికల రంగంలోకిదిగిన తన శ్రీమతి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిని గెలిపించాలని విపిఆర్ వినమ్రంగా కోరుతుంటే, ప్రజలంతా 'మీకు మేమున్నామంటూ' ఆ సేవామూర్తులకు బహిరంగంగానే తమ మద్దతు ప్రకటిస్తున్నారు. జిల్లాలో భార్యాభర్తలు ఎంపీ-ఎమ్మెల్యే స్థానాల్లో కీలక పోటీలో ఉండడం కూడా ఈ ఎన్నికల్లో మరో విశేషం.



- వాడవాడలా వేమిరెడ్డికి హారతులు
- ఎక్కడికెళ్ళినా ఘ(జ)న నీరాజనాలు
- ఉవ్వెత్తున ఉత్సాహంతో పార్టీశ్రేణులు



విపిఆర్ అంటే ఒక నమ్మకం! విపిఆర్ అంటే ఒక భరోసా! మంచికీ-మానవీయతకు పెట్టిందిపేరైన వేమిరెడ్డి దంపతుల పట్ల నెల్లూరుజిల్లా ప్రజానీకంలో అభిమానం వెల్లువెత్తుతుండడంతో, టీడీపీ శ్రేణుల్లో ఉత్సాహం ఉరకలు వేస్తోంది. ఎలాంటి స్వార్థం, ధనాశ అన్నదే లేకుండా.. ప్రజలకు నిజాయితీగా సేవచేసి తమ జీవితాలను సార్థకం చేసుకోవాలనే మహాదాశయంతో రాజకీయరంగంలోకి వచ్చిన ఆ మహాదాతలను మనసారా ప్రజలు ఆశీర్వదిస్తున్నారు. కరోనా సమయంలో కోట్లాదిరూపాయలతో బాధితుల ప్రాణాలను కాపాడిన ప్రాణదాత ఆయన. జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో తాగేందుకు గుక్కెడు మంచినీళ్ళు లేక ప్రజలు అల్లాడుతుంటే, కోట్లాది రూపాయలను వెచ్చించి 'విపిఆర్ అమృతధార' వంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్న అపరభగీరథుడాయన. అందుకే విపిఆర్ అంటే ప్రజలకు అంత అభిమానం.. ఆత్మీయత!..



## టీడీపీ విజయంతోనే రాష్ట్రానికి అభివృద్ధి

ఎన్నికల ప్రచారంలో భాగంగా మే 8న వీపీఆర్ దంపతులు కోవూరు నియోజకవర్గంలోని బుచ్చిరెడ్డిపాళెంకు వచ్చినప్పుడు, ప్రజల ఉత్సాహం చెప్పనలవి కాదు. వేలకొద్దీ జనం వారిని చూసేందుకు, వారి అమూల్యమైన మాటలు వినేందుకు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. టీడీపీ-బీజేపీ-జనసేన కూటమి తరపున పోటీచేస్తున్న ఆ దంపతులను 'జయహో' అంటూ దీవించారు. విపిఆర్ దంపతుల రోడ్‌షోతో బుచ్చి వీధులు జనంతో క్రిక్కిరిసిపోయాయి. నియోజకవర్గంలో తాము ఎక్కడికి వెళ్ళినా ప్రజలు ఎన్నో సమస్యలను తమ దృష్టికి తీసుకువస్తున్నారని, ఆ సమస్యలన్నీ తీర్చేందుకు తమవంతు శక్తివంచన లేకుండా కృషిచేస్తామని విపిఆర్ ఈ సందర్భంగా ప్రజలకు హామీ ఇచ్చారు. టీడీపీ గెలుపుతోనే ప్రజలకు మేలు కలుగుతుందని, ఎన్డీఏ కూటమి విజయంతోనే రాష్ట్రం బాగుపడుతుందని ఆయన స్పష్టం చేశారు. ఈ ఎన్నికల్లో తమను ప్రజలు ఆదరించి గెలిపిస్తే, అవినీతికి-అక్రమాలకు తావులేని పాలన అందిస్తామని ఆయన భరోసా ఇచ్చారు.

## మీ సేవ చేసుకునే భాగ్యం కల్పించండి - విపిఆర్ అభ్యర్థన

తాము డబ్బు కోసమో, పదవుల కోసమో రాజకీయాల్లోకి రాలేదని, ప్రజాసేవ చేసేందుకు మాత్రమే వచ్చామని, నమ్ముకున్న ప్రజలకు మేలుచేసి, పుట్టిన గడ్డ రుణం తీర్చుకోవాలన్నదే తమ ఆశయమని విపిఆర్ చెప్తుంటే, ప్రజలు పెద్దఎత్తున హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తూ జేజేలు పలికారు. 'మీ దీవెనల కోసం వచ్చాం.. ఆశీర్వదించండి.. మీసేవ చేసుకునే భాగ్యం కల్పించండి' అని అంటుంటే ప్రజలు ఆనందంతో పులకించిపోయారు. ప్రజల ఆశీస్సులతో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే జిల్లాను అభివృద్ధి బాట పట్టిస్తామన్నారు. ప్రత్యేకించి కోవూరు నియోజకవర్గంలో ప్రతిగ్రామంలో ప్రతి సమస్యను పరిశీలించి సత్వర పరిష్కారానికి కృషిచేస్తామని విపిఆర్ ప్రజలకు హామీ ఇచ్చారు. జిల్లాలోనే కాదు, రాష్ట్రంలోనే కోవూరును ఒక ఆదర్శ నియోజకవర్గంగా, అభివృద్ధిలో అగ్రగామిగా తీర్చిదిద్ది, ఆ అభివృద్ధి నంతా ప్రజలకు బహుమానంగా ఇవ్వాలన్నదే తమ లక్ష్యమని అన్నారు. ఇఫ్‌కో భూముల్లో పరిశ్రమలు స్థాపించి, జిల్లావ్యాప్తంగా ఎంతో కాలంగా ఉద్యోగాలు లేక బాధలుపడుతున్న వేలాదిమంది నిరుద్యోగ యువతీ యువకులకు ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు కల్పించాలని, వారి కళ్ళల్లో మెరిసే ఆనందం చూడాలన్నదే తమ అభిమతమని, ఆ సదవకాశాన్ని ప్రజలు తమకు కలిగించాలని విపిఆర్ ప్రజలను కోరుతున్నప్పుడు ప్రజలు పెద్దఎత్తున హర్షం వ్యక్తం చేశారు. విపిఆర్ దంపతులకు అండగా 'తామున్నా మంటూ' భరోసా ఇస్తూ, వారిపట్ల తమకున్న అభిమానాన్ని కరతాళధ్వనుల ద్వారా చాటుకున్నారు.

## టీడీపితోనే పేదలకు మేలైన పథకాలు

### కాకర్ల తనయుడు సంపేత్



తెలుగుదేశం పార్టీ గెలిస్తే పేదలకు మేలైన, మరింత మెరుగైన సంక్షేమ పథకాలు అందుతాయని ఉదయగిరి నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి కాకర్ల సురేష్ తనయుడు కాకర్ల సంపేత్ చెప్పారు. తండ్రి చేస్తున్న ఎన్నికల ప్రచారానికి తోడుగా ఆయన ఇటీవల ఉదయగిరి నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో పర్యటించి ప్రజలకు టీడీపీ మేనిఫెస్టోను వివరించారు. టీడీపీ వల్ల ఒనగూరే 'సూపర్ సిక్స్' వంటి పథకాల ప్రయోజనాలను వివరించి చెప్పారు. ఈ ఎన్నికల్లో తమ నాన్న కాకర్ల సురేష్‌కు, నెల్లూరు పార్లమెంటు అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డికి ఘనవిజయం చేకూర్చాలని ఆయన ప్రజలను కోరారు.

## వైకాపాదంతా దోపిడీ పాలనే

### - సోమిరెడ్డి ధ్వజం

వైకాపా నాయకులదంతా దోపిడీ పాలనేనని, మంత్రి కాకాణి 'మీ ఇంటి బిడ్డనంటూ' ప్రజాధనాన్ని సొంతం దోచేశాడని, విరువూరును అంతర్రాష్ట్ర ఇసుక మాఫియాకు అడ్డాగా మార్చి వందల కోట్లు కొల్లగొట్టాడని మాజీమంత్రి, సర్వేపల్లి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ధ్వజమెత్తారు. ఇటీవల ఆయన పొదలకూరు మండలంలోని విరువూరు, తాటిపర్తి పంచాయతీలోని నల్లపాలెం గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాకాణి అరాచక పాలన చేస్తూ, విలువైన ప్రకృతి సంపదనంతా స్వాహా చేసేస్తున్నాడని ఆరోపించారు. తాటిపర్తి పంచాయతీ వరదాపురంలో వందలకోట్ల విలువైన తెల్లరాయిని కొల్లగొట్టేశారని, మరుపూరు, మొగళ్లూరు, ముదిగేడు..ఇలా ఏ ఊరిని వదిలిపెట్టకుండా అందినంతా కాజేశారని దుయ్యబట్టారు. కనుపూరు కాలువలో తట్ట మట్టి ఎత్తకుండానే రూ.50 కోట్లు మాయం చేసేశాడని విమర్శించారు. నియోజకర్గంలో సాగునీరు, తాగునీటి ప్రాజెక్టులను బీడు పెట్టేశాడని అంటూ, పొదలకూరు మండల ప్రజల ఓట్లతో రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిచి, మంత్రి అయిన కాకాణి చేసిన ఘనకార్యాలివేనంటూ తూర్పారబట్టారు. తాను ఎన్నికల్లో ఓడిపోయినా పొదలకూరు మండల చరిత్రలో శాశ్వతంగా నిలిచిపోయే పనులు చేశానని చెప్పారు. కండలేరు ఎడమ కాలువ లిఫ్ట్, సోమశిల దక్షిణ కాలువ, మెగా వాటర్ ప్లాంటు, ప్రభుత్వ ఆస్పత్రి నిర్మాణం, అనేక గ్రామాలకు రోడ్లు,



చెరువుల ఆధునికీకరణ... ఇలా ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలను టీడీపీ హయాంలో తాము అందించామని ఆయన గుర్తుచేశారు. తనకు, కాకాణికి ఉన్న తేడాను గమనించండి.. ఎవరికి ఓటు వేయాలో ఆలోచించి సరైన నిర్ణయం తీసుకోండి అని ఆయన ప్రజలకు సూచించారు. ఈ ఎన్నికల్లో తనను గెలిపిస్తే సర్వేపల్లి నియోజకవర్గం అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు. తొలుత సోమిరెడ్డిని విరువూరు, తాటిపర్తి గ్రామాల్లో ప్రజలు పెద్దఎత్తున పూలమాలలతో స్వాగతించి తమ మద్దతు ప్రకటించారు.

● ప్రచార హోరు... పార్టీల జోరు

# జగన్ రాకతో.. నెల్లూరు జనసంద్రం




## ○ వైకాపా అభ్యర్థులను గెలిపించండన్న యువనేత

రాష్ట్ర ముఖ్యమంత్రి, వైకాపా అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మే 4వ తేది ఎన్నికల ప్రచారానికి నెల్లూరుకు రావడంతో, నెల్లూరు జనసంద్రంగా మారింది. మండుటెండలో సైతం నగర వీధుల్లో ఎక్కడ చూసినా వేలాదిగా అభిమానజనం జగన్‌ను చూసేందుకు, ఆయన మాటలు వినేందుకు తరలివచ్చారు. నగరంలోని గాంధీబొమ్మ కూడలి వద్దకు జగన్ ప్రచార రథం చేరుకోగానే జనం పెద్దఎత్తున కేరింతలు కొట్టారు. వైకాపా తరపున ఈ ఎన్నికల్లో పోటీ చేస్తున్న నెల్లూరు లోక్‌సభ అభ్యర్థి విజయసాయిరెడ్డి, నెల్లూరు సిటీ అభ్యర్థి ఖలీల్ అహ్మద్, రూరల్ అభ్యర్థి ఆదాల ప్రభాకరరెడ్డిలు ఎంతో మంచి వారని, వారిని గెలిపిస్తే ప్రజలకు ఎనలేని సేవ చేస్తారని జగన్ వారిని ప్రజలకు పరిచయం చేశారు. ఈ ఎన్నికలు ఎమ్మెల్యేలను, ఎంపీలను ఎన్నుకునేందుకు మాత్రమే నిర్దేశించినవి కావని, ఇవి మీ భవిష్యత్తును నిర్ణయించే ఎన్నికలని ఆయన ప్రజలనుద్దేశించి అన్నారు. వైకాపాను గెలిపిస్తే సజావుగా ప్రజలకు సంక్షేమపథకాలు అందుతాయని, పొరపాటున చంద్రబాబు గెలిస్తే ఆ పథకాలన్నిటికీ చరమగీతం పాడతారని గుర్తుంచుకోవాలని అన్నారు. ప్రజలకిచ్చిన హామీలు అమలుచేయకుండా, మాట మీద నిలబడని చంద్రబాబును నమ్మొద్దని అన్నారు. టీడీపీకి ఓట్లేసి మోసపోవద్దని, కూటమి మేనిఫెస్టో అంతా బూటకమని విమర్శించారు. తమ పాలనలో 99శాతం హామీలను అమలుచేసి చూపించామన్నారు. అటు రాష్ట్రాభివృద్ధిని, ఇటు ప్రజా సంక్షేమాన్ని కాంక్షించి ఎన్నో కార్యక్రమాలను, పథకాలను అమలుచేసిన వైకాపాను మళ్లీ ఎన్నుకోవాలని, అన్నిచోట్లా వైకాపా అభ్యర్థులను ప్రజలు ఆశీర్వదించి గెలిపించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. తొలుత విఆర్‌సి కళాశాల మైదానంలో జగన్‌కు వైకాపా నాయకులు విజయసాయిరెడ్డి, ఆదాల ప్రభాకర్‌రెడ్డి, నల్లపరెడ్డి ప్రసన్న కుమార్‌రెడ్డి, ఖలీల్ అహ్మద్, పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, సన్నపురెడ్డి పెంచలరెడ్డి తదితరులు ఘనంగా స్వాగతం పలికారు.

# బాబు, పవన్ పర్యటనతో.. ఉప్పొంగిన ఉత్సాహం

## ○ టీడీపీ అభ్యర్థులకు విజయం చేకూర్చాలన్న జననేతలు

ఎన్నికల ప్రచారంలో భాగంగా మే 3న నెల్లూరుకు చంద్రబాబునాయుడు, పవన్‌కల్యాణ్‌లు రావడంతో అభిమానజనం పోటెత్తారు. ప్రచార వాహనంలో చెరొకవైపు నిల్చొని ప్రజలకు అభివాదం చేయడంతో జనంలో ఉత్సాహం పెల్లుబికింది. టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు వేలసంఖ్యలో పాల్గొన్నారు. రోడ్‌షోలో చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌లతో పాటు నెల్లూరు ఎంపీ టీడీపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, నెల్లూరు నగర ఎమ్మెల్యే అభ్యర్థి నారాయణ, రూరల్ అభ్యర్థి కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డిలతో కలసి వారు పాల్గొని, నర్తకి సెంటర్ దాకా ర్యాలీగా వచ్చి అక్కడ బహిరంగ సభ నిర్వహించారు. చంద్రబాబు మాట్లాడుతూ, ఈ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను గెలిపించాలని, డబ్బుతో..కుట్రలు కుతంత్రాలతో రాజకీయాలు చేస్తున్న వైకాపాను ఓడించాలని కోరారు. 'భూమి మనది.. చుట్టూ ఉన్న హద్దు రాళ్లు, పట్టాదార్ పాస్‌బుక్‌పై ఫొటో జగన్‌ది. ఒక మనిషి అరాచకానికి పరాకాష్ట ఇది. రేపట్నుంచి మీ భూమికి ఒరిజినల్ దస్తావేజులు, పాస్ బుక్, అడంగల్ ఉండవు.. అన్నీ ఆన్‌లైన్‌లోనే. ఇదంతా జగన్ మాయ. మీ ఆస్తి ఇతరులకు రాయొచ్చు, తాకట్టు పెట్టి అప్పు తెచ్చుకోవచ్చు. జవాబుదారీ తనం ఉండదు. మీరు ఆత్మహత్యలు చేసుకున్నా పట్టించుకునే వారే ఉండరు. ల్యాండ్ టైటిలింగ్ యాక్టు వల్ల ఉపయోగం లేదు. ఈ చట్టం రైతు మెడకు ఉరితాడుగా మారుతుందని' చంద్రబాబు అన్నారు. తాము అధికారంలో రాగానే మొదటి సంతకం డిఎస్సీ పైన, రెండో సంతకం ఆ ల్యాండ్ టైటిలింగ్ చట్టాన్ని రద్దు చేసేందుకు పెడతామని ఆయన హామీ ఇచ్చారు.





### విపిఆర్‌కి.. విజయసాయికీ పోలికే లేదు

నెల్లూరు ఎంపీ టీడీపీ అభ్యర్థిగా పోటీచేస్తున్న వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి (విపిఆర్)కి, విజయసాయిరెడ్డికి పోలికే లేదని చంద్రబాబు అన్నారు. వేమిరెడ్డి డబ్బు కోసం రాజకీయాల్లోకి రాలేదని, పుట్టిన గడ్డ రుణం తీర్చుకునేందుకు ప్రజాసేవ చేయాలని వచ్చారని, కానీ విజయసాయిరెడ్డి విశాఖను దోచుకుని, ఇప్పుడు నెల్లూరును దోచుకునేందుకు వచ్చారని చంద్రబాబు దుయ్యబట్టారు. నారాయణ మంత్రిగా ఉన్నప్పుడు నెల్లూరు నగరానికి ఎన్నో మంచిపనులు చేశారని, నగరాభివృద్ధి కోసం అప్పట్లో దాదాపు 5వేల కోట్ల పనులు జరిగాయని ఆయన గుర్తుచేశారు. ఈ ఎన్నికల్లో వేమిరెడ్డిని, నారాయణను, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డిని గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఇకనైనా రాతయుగం పోవాలని, స్వర్ణయుగం రావాలని అన్నారు. పవన్‌కల్యాణ్ మాట్లాడుతూ, రాష్ట్రంలో అరాచకపాలన సాగుతోందని, దానిని కూకటివేళ్ళతో సహా పెకలించి వేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

# రాష్ట్రానికి రాజధాని కూడా లేకుండా చేశాడు



## ○ అన్న పాలనను దుయ్యబట్టిన చెల్లెమ్మ

జగన్ పాలనలో రాష్ట్ర ప్రజలకు ఒరిగిందేమీ లేదని, చివరికి రాష్ట్రానికి రాజధాని కూడా లేకుండా చేశారని రాష్ట్ర కాంగ్రెస్ నాయకురాలు వైఎస్ షర్మిల దుయ్యబట్టారు. మే 5న ఆమె కోవూరులో పెద్దఎత్తున జరిగిన ఎన్నికల సభలో పాల్గొన్నారు. నెల్లూరు ఎంపీగా పోటీచేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి కొప్పుల రాజు, కోవూరు ఎమ్మెల్యేగా పోటీచేస్తున్న కిరణ్‌కుమార్‌రెడ్డి, జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి చేవూరు దేవకుమార్‌రెడ్డిలతో కలసి ఆమె ఈ ఎన్నికల ప్రచారంలో మాట్లాడారు. వైకాపా అయిదేళ్ళ పాలనలో చేసిందంతా హత్యా రాజకీయాలేనన్నారు. ఇసుక, మట్టి, సిలికా, గ్రావెల్ అన్నీ దోచేసుకుంటున్నారని, ఇది దొంగల రాజ్యం.. దోపిడి రాజ్యమంటూ ఆమె నిందించారు. జగన్ వైఎస్ఆర్ వారసుడే అయితే, వైఎస్ రాజశేఖరరెడ్డి ఆశయాలను ఎందుకు పాటించడం లేదని ప్రశ్నించారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా వచ్చివుంటే ఎంతో మేలు జరిగేదని, ఈ విషయంలో బీజేపీ పూర్తిగా మాట తప్పిందని విమర్శించారు. చంద్రబాబు, జగన్‌లు ఇద్దరూ బీజేపీకి వత్తాసు పలుకుతూ, ప్రత్యేకహోదా అంశాన్ని రాజకీయంగా వాడుకున్నారే తప్ప రాష్ట్రానికి ఆ హోదాను సాధించలేదన్నారు. ఈ రాష్ట్రాన్ని జగన్, చంద్రబాబు దారుణంగా మోసం చేశారని విమర్శించారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు పులిలా గర్జించిన జగన్, అధికారంలోకి వచ్చాక పిల్లిలా అయ్యారని ఆమె తూర్పారబట్టారు. ఏడాదికో జాబ్ క్యాలెండర్ అని జగన్ ప్రజలను మభ్యపెట్టారని, మెగా డీఎస్సీ పేరుతో దగా డీఎస్సీని ప్రకటించారన్నారు. పంట నష్టపోయిన రైతులకు పరిహారం కూడా ఇవ్వలేదన్నారు. మద్యపాన నిషేధం చేస్తామని చెప్పి, మద్యాన్ని అమ్ముకుంటూ ప్రజల ప్రాణాలు తీస్తున్నారని, డా. వైఎస్ఆర్ బీజేపీని వ్యతిరేకిస్తే, జగన్ ఆ పార్టీతో డ్యూయెట్లు పాడుకుంటున్నాడని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో ఒక్క సీటు కూడా గెలవలేని బీజేపీ రాష్ట్రాన్ని శాసిస్తోందన్నారు. ప్రజలు ఈ పరిస్థితులన్నిటినీ గమనించి రానున్న ఎన్నికల్లో వైకాపా, తెదెపా, భాజపాలకు గుణపాఠం చెప్పాలన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రాష్ట్రానికి ప్రత్యేకహోదా తెస్తామన్నారు. నెల్లూరు ఎంపీ అభ్యర్థిగా కాంగ్రెస్ తరపున పోటీచేస్తున్న రిటైర్డ్ ఐఏఎస్ అధికారి కె.రాజును, కోవూరు ఎమ్మెల్యే అభ్యర్థిగా రంగంలో ఉన్న కిరణ్‌కుమార్‌రెడ్డిని గెలిపించి కాంగ్రెస్ పార్టీకి అఖండవిజయం చేకూర్చాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

# ప్రసన్నకు బై బై చెప్పండి

## కబ్జాదారుల నుంచి కోవూరును కాపాడుకుందామన్న ప్రశాంతిరెడ్డి



భూకబ్జాలకు పాల్పడే దోపిడీదారుల నుంచి రక్షణ పొందాలంటే అవినీతిపరుడైన ప్రసన్నకుమార్‌రెడ్డికి బై బై చెప్పాలని, కోవూరును కబ్జాదారుల నుంచి కాపాడుకోవాలని కోవూరు ఎన్డీఏ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి కోవూరు నియోజకవర్గ ప్రజలను కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇటీవల ఆమె ఈనెల 8న బుచ్చిరెడ్డిపాళెంలో మాట్లాడుతూ, ప్రత్యర్థి ప్రసన్న తీరుపై ధ్వజమెత్తారు. ప్రజాప్రతినిధులుగా ఉన్నవాళ్ళు ప్రజాధనం ఆశించకుండా నీతి నిజాయితీగా ప్రజలకెలా సేవచేయాలో ఆచరణలో చేసి చూపిస్తానని ఆమె అన్నారు. ప్రజల దీవెనలతో తాను ఎమ్మెల్యే అయ్యాక, కోవూరు నియోజకవర్గంలోని ప్రతి మండలంలో ఒక కార్యాలయం ఏర్పాటు చేసి ప్రజాసమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. వైకాపా పాలనలో టీడీపీ కార్యకర్తల పట్ల వివక్ష చూపుతూ పెన్షన్, రేషన్ కార్డులు లాంటి సంక్షేమ పథకాలు అందకుండా చేశారని, రానున్న తెలుగుదేశం ప్రభుత్వంలో పార్టీలకతీతంగా పేదలందరికీ సంక్షేమ పథకాలు అందచేస్తామన్నారు. కోవూరు నియోజకవర్గ ప్రజల కోసం తనింటి తలుపులు ఎప్పుడూ తెరిచే ఉంటాయన్నారు. కోవూరు ప్రజలు కోరుకుంటున్నట్లుగా జెండాదిబ్బ శ్మశాన వాటికకు ప్రహరీగోడ నిర్మిస్తానని ఆమె ఈ సందర్భంగా హామీ యిచ్చారు. కమ్యూనిటీ హాలుకు మరమత్తులతో పాటు



అంగన్‌వాడి కేంద్రానికి భవనం నిర్మిస్తామన్నారు. టీడీపీ అధికారంలోకొచ్చాక అమలయ్యే 'బాబు ష్యూరిటీ– భవిష్యత్తు గ్యారెంటీ' తదితర సంక్షేమ పథకాలను ఆమె ఈ సందర్భంగా ప్రజలకు వివరించారు. ప్రస్తుత ప్రభుత్వం నిరుపేదలకు ఆరు అంకణాలు మాత్రమే ఇంటి స్థల్లాలు కేటాయిస్తుంటే చంద్రబాబు నేతృత్వంలోని టీడీపీ ప్రభుత్వం అధికారంలోకొచ్చాక, గ్రామీణ ప్రాంతాలలో 18 అంకణాలు నివాస స్థలం కేటాయిస్తామన్నారు. మహిళలకు ఉచిత ప్రయాణం సౌకర్యంతో పాటు ఏడాదికి 3 గ్యాస్ సిలెండర్లను ఉచితంగా అందచేస్తారన్నారు. నెల్లూరు జిల్లాలోని యువతీ యువకులకు నెల్లూరుజిల్లాలోనే ఉద్యోగవకాశాలు కల్పించాలన్నదే నెల్లూరు ఎంపీ టీడీపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి చిరకాల స్వప్నమన్నారు. తెలుగుదేశం పార్టీ గెలిస్తే.. ఇఫ్కో సెజ్‌లో పరిశ్రమలు తీసుకొచ్చి యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు తప్పకుండా కృషి జరుగుతుందన్నారు. రాష్ట్రన ప్రజలకు సంక్షేమంతో పాటు రాష్ట్రంలో అభివృద్ధి కార్యక్రమాలు కూడా కొనసాగించే సమర్థత టీడీపీ అధినేత చంద్రబాబునాయుడుకే ఉందని ఆమె స్పష్టం చేశారు. ప్రజలంతా ఈ ఎన్నికల్లో బాగా ఆలోచించి ప్రజల శ్రేయస్సుకు పాటుపడే తెలుగుదేశం పార్టీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని ఆమె కోరారు. తొలుత, టీడీపీ జాతీయ అధికార ప్రతినిధి పోలంరెడ్డి దినేష్‌రెడ్డితో కలిసి ఆమె బుచ్చిరెడ్డిపాళెం పట్టణంలోని సాల్మన్‌పురం, వడ్డిపాలెం, జెండాదిబ్బ ప్రాంతాలకు రాగానే స్థానిక ప్రజలు వారిని పూల మాలలతో స్వాగతించారు. అన్నిప్రాంతాల్లో ప్రశాంతిరెడ్డికి ప్రజలు తమ సంపూర్ణ మద్దతును ప్రకటించారు.

# అత్త గెలుపు కోసం..రంగంలోకి దిగిన కోడలు



కోవూరు నియోజకవర్గంలో తొలి మహిళా అభ్యర్థినిగా ఈ ఎన్నికల్లో టీడీపీ తరఫున పోటీచేస్తున్న వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డికి మద్దతుగా ఆమె కోడలు ఐషితారెడ్డి రంగంలోకి దిగి, గ్రామాల్లో తిరుగుతూ ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు. మే 7న బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీలో ఎన్నికల ప్రచారానికి వచ్చిన ఐషితారెడ్డికి ప్రజలు మహిళలు పెద్దఎత్తున హారతులు పడుతూ స్వాగతించారు. కోవూరు నియోజకవర్గంలో ప్రశాంత పాలన కావాలంటే ప్రశాంతమ్మకే విజయం చేకూర్చాలని ఆమె ప్రజలను కోరారు. ఈ సందర్భంగా పలు దుకాణాల నిర్వాహకులు ఆమె వద్దకు వచ్చి, గతంలో ఎలాంటి నోటీసులు కూడా ఇవ్వకుండా తమ ఇళ్లను, భవనాలను పగలగొట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. అందుకు స్పందించిన ఐషితారెడ్డి, చంద్రబాబు పాలనలోనే అన్నివర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందని చెప్పారు. టీడీపీతోనే అన్ని ప్రాంతాల అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. రానున్న ఎన్నికల్లో నెల్లూరు పార్లమెంట్ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని, కోవూరు అభ్యర్థి ప్రశాంతిరెడ్డిని గెలిపించుకుంటే ప్రజలకు వారు పరిపూర్ణమైన సేవలందిస్తారని హామీ ఇచ్చారు.

# ప్రశాంత ఎన్నికలకు పటిష్ట చర్యలు తీసుకోండి

## రాష్ట్ర ప్రత్యేక పోలీస్ పర్యవేక్షకులు దీపక్ మిశ్రా



రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించడానికి పటిష్టమైన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రత్యేక పోలీస్ పరిశీలకులు దీపక్ మిశ్రా పోలీస్ అధికారులను ఆదేశించారు. ఈనెల 7న నెల్లూరులోని నగరపాలక సంస్థ కార్యాలయ ప్రాంగణంలోని కమాండ్ కంట్రోల్ రూమ్‌లో రాష్ట్ర ప్రత్యేక పోలీస్ పరిశీలకులు, పోలీసు అధికారులతో ఆయన ఎన్నికల నిర్వహణపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఎన్నికల నిర్వహణ పారదర్శకంగా జరగాలని, నిబద్ధతతో పోలీసు అధికారులు పనిచేయాలని అన్నారు. సాధారణ ప్రజలు స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకునే అవకాశాన్ని కల్పించాలని పోలీసులకు సూచించారు. ఎన్నికల్లో రాజకీయాలకు, కుల మతాలకు అతీతంగా పోలీసు అధికారులు పనిచేయాలన్నారు. శాంతియుత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించడానికి పోలీస్ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద ప్రజలు గుంపులుగా నిలబడి ఉండకుండా ప్రశాంతంగా ఓటును వినియోగించుకునే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈవీఎంలకు పటిష్టమైన భద్రత ఉండాలన్నారు. జిల్లా కలెక్టర్ ఎం.హరినారాయణన్ మాట్లాడుతూ జిల్లాలో నెల్లూరు పార్లమెంట్ నియోజకవర్గంలో 8 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయని, జిల్లాలో పోలింగ్ నిర్వహించడానికి 2470 కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. జిల్లాలో అన్ని పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ ఏర్పాటు చేశామన్నారు. జిల్లా ఎస్.పి ఆరిఫ్ హాఫీజ్ మాట్లాడుతూ జిల్లాలో సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో నగదు, మద్యం అక్రమ రవాణా జరగకుండా 18 చెక్ పోస్టులను ఏర్పాటు చేశామన్నారు. అనుమానం ఉన్న వ్యక్తులను బైండోవర్ చేసుకోవడం జరిగిందన్నారు. జిల్లా ప్రత్యేక పోలీస్ పరిశీలకులు అశోక్ టి.దూదే, గుంటూరు రేంజ్ ఐజి సర్వ శ్రేష్ట త్రిపాఠి, జిల్లా అదనపు ఎస్పీ సౌజన్య, డీఎస్పీలు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.



నెల్లూరు పార్లమెంటు టీడీపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఆత్మకూరు శాసనసభ టీడీపీ అభ్యర్థి ఆనం రామనారాయణరెడ్డి తరఫున ఆత్మకూరు పట్టణంలోని పలు వీధుల్లో ఎన్నికల ప్రచారంలో ముమ్మరంగా పాల్గొని కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరుతున్న టీడీపీ, బీజేపీ నాయకులు.



# శాసనసభలో నిన్న - నేడు - రేపు...?

(7వ పేజీ తరువాయి)

అయితే, ఇక్కడ విచిత్రంగా చాలా రోజులనుండి సీటు ఆశిస్తున్న సుధాకర్‌యాదవ్‌ని కాకుండా టీడీపీ అధిష్టానం కావ్య కృష్ణారెడ్డిని పోటీలో దింపింది. ఇప్పుడు సుధాకర్‌యాదవ్ ఇండిపెండెంటుగా పోటీ చేస్తున్నారు. బీద సోదరులు కూడా అటొకరు ఇటొకరు గట్టిగా తిరుగుతున్నారు.

మొత్తంమీద పోరు హోరీనే అన్నమాట సర్వత్రా వినిపిస్తోంది.

## ఉదయగిరి!





ఉదయగిరి వైసీపీ అభ్యర్థి ఎవరు..? అన్న సందిగ్ధం చాలా రోజులు కొనసాగింది. రాజకీయ వర్గాల ఊహాగానాలకి తెరదించుతూ వైసీపీ అధిష్టానం ఇక్కడ మళ్ళీ మేకపాటి కుటుంబానికే తలొగ్గింది. మేకపాటి శేఖరరెడ్డి తమ్ముడు రాజగోపాలరెడ్డిని రంగంలో దించింది. అయితే, అమెరికా నుండి మకాం మార్చి రెండేళ్ళుగా నియోజకవర్గంలో తిష్ట వేసి నియోజకవర్గ ప్రజల మంచి చెడులు గమనిస్తున్నాడన్న మంచి పేరు తెచ్చుకున్న కాకర్ల సురేష్‌ని టీడీపీ తమ పార్టీ తరపున నిలబెట్టింది. జగన్‌మోహన్‌రెడ్డి పథకాల వ్యామోహం తప్ప మరో ఏ కోణంలో చూసినా ఉదయగిరిలో కాకర్లదే పైచేయన్నది ముక్త కంఠంతో వినిపిస్తున్న మాట.

## ఆత్మకూరు!





ఆత్మకూరులో రెండు సాధారణ ఎన్నికలలోనూ, ఒక ఉప ఎన్నికలోనూ అంటే మొత్తం 3సార్లు ఇక్కడ ఓటర్లు ఫ్యాన్‌కి జైకొట్టారు. ఇప్పుడు మళ్ళీ ఫ్యాన్‌కే వేయమంటూ వైసీపీ అభ్యర్థి గౌతమ్ తమ్ముడు విక్రమ్‌రెడ్డి అభ్యర్థిస్తున్నారు. తెలుగుదేశం తరపున పోటీచేస్తున్న ఆనం రామనారాయణరెడ్డి గతంలో తాను చేసిన అభివృద్ధి గుర్తుంటే తనకే ఓటేయమంటూ విజ్ఞప్తి చేస్తున్నారు. ఆర్థికమంత్రిగా ఆత్మకూరులో తాను చేసిన అభివృద్ధిని మరోసారి ఓటర్లకు గుర్తుచేస్తున్నారు. ఆత్మకూరు వాసులు మార్పుని కోరుకుంటున్నారన్న మాట ఆనోటా ఈనోటా వినిపిస్తోంది.

## కందుకూరు!





కందుకూరులో ఇద్దరూ కొత్తవాళ్లే. అధికార వైసీపీ సిట్టింగ్ శాసనసభ్యుడు మానుగుంట మహీధర్‌రెడ్డిని కాదని, బుర్రా మధుసూదన్ యాదవ్‌ని కనిగిరి నుండి దిగుమతి చేసి ఇక్కడ పెట్టింది. ఇక టీడీపీ అభ్యర్థి ఇంటూరు నాగేశ్వరరావు ప్రత్యక్ష రాజకీయాలకి కొత్తే అయినా, నియోజకవర్గానికి పాతే. వారి కుటుంబం ఎప్పటినుండో రాజకీయాలలో ఉంది. మహీధర్‌రెడ్డి మౌనవ్రతం పాటిస్తున్నారు. ఆయన ఎటువైపు కనుసైగ చేస్తే ఆ పార్టీయే నెగ్గడం అక్కడ ఆనవాయితీ. ఆయన టీడీపీవైపే చూస్తున్నారన్నది కందుకూరు వాసుల సమాచారం.

## సర్వేపల్లి!





సర్వేపల్లి నుండి కాకాణి గోవర్ధనరెడ్డినే మళ్ళీ యుద్ధంలో దింపింది వైసీపీ అధిష్టానం. పాత కొత్త నెల్లూరుజిల్లా మొత్తం పరిశీలిస్తే గత ఎన్నికలలో పోటీచేసిన అభ్యర్థులే అదే పార్టీలనుండి మళ్ళీ అభ్యర్థులుగా మారి ప్రత్యర్థులుగా తలపడుతున్న ఒకే ఒక నియోజకవర్గం సర్వేపల్లి. ఇక్కడ అభ్యర్థులిద్దరూ 3వ సారి తలపడుతున్నారు. ఒక్క సర్వేపల్లి తప్ప మిగిలిన అన్ని స్థానాలలో క్యాండేట్ల మార్పు జరిగింది. ఇక్కడ కూడా చివరివరకూ ఉత్కంఠరేపి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పేరును ప్రకటించింది తెలుగుదేశం. అదే ఆయనకి కలిసొచ్చిందంటున్నారు సోమిరెడ్డి అభిమానులు. సర్వేపల్లి నియోజకవర్గం సహజవనరులు దోపిడీకి అడ్డాగా మారిపోయిందన్నది చిన్న పిల్లవాడి నడిగినా చెప్తారంటారు. సోమిరెడ్డికి కూడా ఇదే చివరి ఎన్నికలుగా ఆయనే చెప్పుకుంటున్నారు. గత ఎన్నికల్లో ఓటమి, ఈ ఎన్నికలలో కూటమి చంద్రమోహన్‌రెడ్డికి కలిసొచ్చే అంశాలుగా ప్రజలు చర్చించుకుంటున్నారు.

## వెంకటగిరి!





వెంకటగిరి, గూడూరు, సూళ్లూరుపేట నియోజక వర్గాలు పాత నెల్లూరుజిల్లాకి చెందినవైనా ప్రస్తుతం తిరుపతి జిల్లాలో ఉన్నాయి.

వెంకటగిరిలో ముందుగా కురుగొండ్ల రామకృష్ణ కుమార్తెను టీడీపీ తరపున బరిలో దించిన ఆ పార్టీ నాయకులు ఎందుకో జంకారు. మళ్ళీ రామకృష్ణనే తెరపైకి తెచ్చారు. అధికారపార్టీ అభ్యర్థిగా అలు పెరుగని పర్యటనలతో ప్రజల అభిమానాన్ని చూరగొంటున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డికి వస్తున్న ఆదరణ చూసి అభ్యర్థిని మార్చారని ఆ నియోజకవర్గ ఓటర్లు అభిప్రాయపడుతున్నారు. ఇక్కడ ఫ్యాన్‌కి ఎదురుగా ఎవరు నిలబడినా ఆ గాలికి కొట్టుకుపోవలసిందే అన్న ధీమా వ్యక్తం చేస్తున్నారు.

## గూడూరు!





గూడూరులో కూడా అధికారపార్టీ అభ్యర్థి మేరిగ మురళివైపే జనం మొగ్గు చూపిస్తున్నారని వినికిడి. టీడీపీ అభ్యర్థి పాశం సునీల్‌కుమార్ కన్నా మురళి అయితేనే అందరికీ అందుబాటులో ఉంటారన్న మాట సర్వత్రా వినిపిస్తోంది.

## సూళ్లూరుపేట!





సూళ్లూరుపేటలో అధికార వైసీపీ అభ్యర్థిగా కిలివేటి సంజీవయ్య వరుసగా మూడవసారి ఎన్నికల రణరంగంలో దిగారు. అధికారపార్టీ సర్వేలో సంజీవయ్యకి నూటికి ఎనభై శాతం మార్కులు రావడంతో ఆయనని అక్కడే ఉంచారు. సంజీవయ్యపై టీడీపీ నుండి నెలవల సుబ్రహ్మణ్యం కుమార్తె నెలవల విజయశ్రీని పోటీలోపెట్టారు. తొలిసారిగా ఇక్కడ మహిళని ప్రయోగాత్మకంగా టీడీపీ బరిలో దించింది. పదేళ్లుగా నియోజకవర్గాన్ని కనిపెట్టుకుని ఉంటూ అందరికీ అందుబాటులో ఉంటాడన్న పేరు తెచ్చుకోవడమే సంజీవయ్యకి కలిసొచ్చే అంశంగా అక్కడ రాజకీయవర్గాల అభిప్రాయం.

మొత్తంమీద మరో మూడు రోజులలో వీరందరి జాతకాలు ఈవీఎంలలోకి చేరిపోతాయి. ఎవరి భవిష్యత్తు ఏమిటో జూన్ 4 ఉదయానికల్లా తేలిపోతుంది. గడచిన 72 సంవత్సరాలలో జరిగిన అనేక ఎన్నికలతో పోలిస్తే ఆంధ్రప్రదేశ్‌లో ఈ ఎన్నికలలో ఉన్నంత ఉత్కంఠ, ఉత్సాహం గతంలో ఎన్నడూ లేదని, ఓటర్ల తీరు, తీర్పు ఎలా ఉండబోతోందో అర్థం కావడం లేదని సీనియర్ రాజకీయవేత్తలు చెప్పడం గమనార్హం...!






# ప్రజాభ్యుదయమే.. ఆయన పరమావధి!

## కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి కె.రాజుకు విశ్రాంత ఐఏఎస్ అధికారుల బాసట

నెల్లూరు పార్లమెంట్ స్థానానికి కాంగ్రెస్‌పార్టీ తరఫున పోటీచేస్తున్న నెల్లూరుజిల్లా మాజీ కలెక్టర్ కె.రాజుకు పార్టీలకు అతీతంగా పలువురు ఐఏఎస్ అధికారులు బాసటగా నిలిచారు.

జిల్లా ప్రజలకు కె.రాజు కలెక్టర్‌గా సుపరిచితులే. గతంలో ఆయన కలెక్టర్‌గా ఉన్నప్పుడు నెల్లూరు జిల్లాలో అక్షరాస్యత ఉద్యమం, సారా ఉద్యమం, పొదుపు ఉద్యమాల్లో కీలకపాత్ర పోషించి ప్రజా చైతన్యానికి బాటలు వేసిన విషయం తెలిసిందే. కలెక్టర్ అయినప్పటికీ ఎంతో నిరాడంబరంగా ఉంటూ, జిల్లాలోని పేద బడుగు వర్గాల సంక్షేమానికి ఆయన ఎనలేని సేవలు చేశారు. జిల్లాలో వయోజనుల విద్యకు పెద్దపీట వేశారు. ప్రజల బాగు కోసం పలు ఉద్యమాలకు ఊపిరిపోశారు. తానెక్కడ ఉన్నా ప్రజలకు మంచి చేయాలనే తపనతో నిజాయితీగా సేవలందించారు. అంతటి ఒక మంచి ఐఏఎస్ అధికారి ఇప్పుడు రాజకీయాల్లోకి రావడం, ఎన్నికల్లో పోటీ చేయడం హర్షదాయకమని, అలాంటి ఆదర్శనీయునికి తాము సంఘీభావం తెలుపుతున్నామంటూ ఇటీవల నెల్లూరు జిల్లా మాజీ కలెక్టర్ సుజాతారావు, మరో మాజీ ఐఏఎస్ అధికారి పివి రమేష్‌లు నెల్లూరుకు వచ్చి మరీ ప్రకటించారంటే అది కె.రాజు నిబద్ధతకు, ప్రజాసేవకు నిదర్శనం. సుజాతారావు కూడా గతంలో నెల్లూరు జిల్లా కలెక్టర్‌గా ఎంతో ఆదర్శవంతంగా పనిచేసిన విషయం పాతతరం వారికి తెలిసిందే. ఆమె కూడా కె.రాజుకు మద్దతుగా నిలవడం విశేషం. కలెక్టర్ హోదాలో ఈ జిల్లా అభివృద్ధికి ఎంతగానో కృషిచేసిన కె.రాజు, ఇప్పుడు ప్రజల ముందుకువచ్చి తనను ఈ ఎన్నికల్లో గెలిపించవలసిందిగా విజ్ఞప్తి చేస్తున్నారని, తమతో పాటు అనేకమంది విశ్రాంత ఐఏఎస్ అధికారులు కూడా ఆయనకు అండగా నిలుస్తున్నారని ఆమె ఈ సందర్భంగా చెప్పారు. ఐఏఎస్ అధికారిగా కె.రాజు ప్రజల కోసం ఎన్నో సంస్కరణలు చేపట్టారని, మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి పథకానికి స్ఫూర్తినందించిందీ, పొదుపుసంఘాలను ప్రవేశపెట్టి దేశవ్యాప్తంగా మహిళల సాధికారత సాకారానికి బాటలు పడిందీ ఆయన కృషి వల్లనేనని ఆమె పేర్కొన్నారు.

గతంలో కలెక్టర్‌గా ఈ జిల్లాలోనే కె.రాజు పనిచేశారు కనుక, నెల్లూరుజిల్లా ప్రజల సమస్యల పట్ల ఆయనకు మంచి అవగాహన ఉందని అన్నారు. ఆయన్ను ఎన్నుకుంటే జిల్లాను అభివృద్ధిపథంలో పయనింపజేస్తారని ఆమె చెప్పారు. అరాచకాలు చేసేవారు, అక్రమాలతో ధనార్జన చేసేవారు రాజకీయాల్లో ఎందరో ఉంటున్న నేటి రోజుల్లో, నిస్వార్థంగా ప్రజల అభ్యుదయం కోసం పనిచేసే కె.రాజు లాంటి వారు ఎంతో అరుదని, ఒక ఉత్తమ ఐఏఎస్ అధికారి ఎన్నికల్లో నిలవడంతో ఆయనకు తమ అండదండలందించేందుకు తాము ముందుకు వచ్చామని, అలాంటి మంచివ్యక్తి ఎంపీగా ఉంటే ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని వారు పేర్కొంటూ, నెల్లూరు ఎంపీ అభ్యర్థిగా పోటీలో ఉన్న కె.రాజును ప్రజలు ఆదరించి.. ఆశీర్వదించి గెలిపించాలని వారు ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు.

# నారాయణ.. ఓ ఆణిముత్యం

○ కొనియాడుతున్న నెల్లూరు నగర ప్రజలు





ఎక్కడికి వెళ్ళినా..
భారీ స్వాగతాలు
ఈ 'చెత్త' ప్రభుత్వానికి..
బుద్ధిచెప్పండంటూ
నారాయణ పిలుపు

*ఎన్నికలు సమీపిస్తున్న వేళ నెల్లూరు నగరంలో మాజీమంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ ప్రచారంలో ముందుకు దూసుకుపోతున్నారు. నగరంలో ఎక్కడికి వెళ్ళినా 'నారాయణ ఓ ఆణిముత్యం..నెల్లూరు నగరాభివృద్ధి ఆయనకే సాధ్యం'..అంటూ ప్రజలు కొనియాడుతూ ఆయన్ను పూలమాలలతో పెద్దఎత్తున స్వాగతిస్తున్నారు. నెల్లూరు అభివృద్ధితో పాటు ప్రతి కార్యకర్త సంక్షేమమే తన ధ్యేయమంటూ నారాయణ వారికి చెప్తున్నప్పుడు, తాను మంత్రిగా ఉన్నప్పుడు నగరానికి చేసిన పలు అభివృద్ధిపనులను వివరిస్తున్నప్పుడు ప్రజలు కరతాళధ్వనులతో హర్షం వ్యక్తం చేస్తున్నారు. తెలుగుదేశం పార్టీపై నమ్మకం, చంద్రబాబునాయుడుపై విశ్వాసాన్ని ప్రకటిస్తూ అనేకమంది స్థానిక నాయకులు, ప్రజలు టీడీపీలో చేరేందుకు ముందుకు వస్తున్నారు.*

'వైకాపా పాలనలో ప్రజలపై పన్నుల భారాన్ని మోపారని, చివరికి చెత్తపన్ను కూడా విధించారని, ఈ 'చెత్త' ప్రభుత్వానికి ఈ ఎన్నికల్లో ప్రజలు గుణ పాఠం చెప్పాలని'.. నెల్లూరు నగర టీడీపీ అభ్యర్ధి డా.పొంగూరు నారాయణ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఇటీవల ఆయన నెల్లూరులోని గోమతినగర్ క్యాంప్ కార్యాలయం వద్ద పలు డివిజన్ల నుంచి వందలాదిగా విచ్చేసిన పలు పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు టీడీపీలో చేరిన సందర్భంగా ఆయన మాట్లాడారు. తనను ప్రజలు గెలిపిస్తే, నెల్లూరు అభివృద్ధితో పాటు ప్రజాసంక్షేమమే ధ్యేయంగా పని చేస్తానని అన్నారు. టీడీపీతోనే రాష్ట్రానికి మంచి జరుగుతుందని ప్రజలంతా నమ్ముతున్నారన్నారు. అందుకు ప్రత్యక్ష నిదర్శనమే రోజురోజుకు టీడీపీలో చేరుతున్న ప్రజలేనని అన్నారు. విజనరీ ఉన్న నేత చంద్రబాబు వల్లనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమవుతుందని చెప్పారు. రాష్ట్రాన్ని జగన్ సర్వనాశనం చేశారని మండిపడ్డారు. వైసీపీ పాలనలో పంచాయతీరాజ్ వ్యవస్థను నిర్వీర్యం చేశారని, ప్రజలు వైసీపీ పట్ల విసిగిపోయారని అన్నారు. ఈ సందర్భంగా టీడీపీలో చేరిన వారందరికీ ఆయన పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, రూప్‌కుమార్ యాదవ్, తాళ్ళపాక అనురాధ పాల్గొన్నారు.

## నాన్న గెలిస్తే..మళ్ళీ 'అన్న క్యాంటీన్లు'

- నారాయణ కుమార్తె సింధూర



మా నాన్న గెలిస్తే మళ్ళీ పేదవాడికి కడుపు నిండా అన్నం పెట్టే 'అన్న క్యాంటీన్లు' ప్రారంభ మవుతాయని నెల్లూరు నగర టీడీపీ అభ్యర్ధి పొంగూరు నారాయణ కుమార్తె సింధూర చెప్పారు. టీడీపీ అందుకు కట్టుబడి ఉందన్నారు. ఇటీవల ఆమె నెల్లూరులోని 47వ డివిజన్‌లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. తాను తమ తండ్రి తరఫున చేస్తున్న ఎన్నికల ప్రచారంలో సుమారు 7వేల ఇళ్లను సందర్శించి ప్రజల సమ స్యలను అడిగి తెలుసుకున్నానని ఆమె అంటూ, ఈ ఎన్నికల్లో తమ నాన్న విజయం సాధిస్తే ఆ సమస్యలన్నిటికీ పరిష్కారం చూపుతారని, ప్రజలు ఆయన్ను ఆశీర్వదించాలని కోరారు. తమ నాన్న మంత్రిగా ఉన్నప్పుడు నెల్లూరులో 45వేల టిడ్కో గృహాలను హై టెక్నాలజీతో నిర్మించారని, అయితే వైకాపా ప్రభుత్వం వాటిని ప్రజలకి ఇవ్వక పోగా... పాడుబెట్టిందని ఆవేదన వ్యక్తం చేశారు. నారాయణ అధికారంలోకి రాగానే మొదట ఆ 45వేల ఇళ్లను నిరుపేదలందరికి అందచేయడంతోపాటు, పేదలం దరికీ ఇళ్ళు కట్టిస్తారని తెలిపారు. నెల్లూరు ఎంపీగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని, ఎమ్మెల్యేగా పోటీలో ఉన్న తమ నాన్నను గెలిపించాలని ఆమె కోరారు.



# మోడీ నాయకత్వంలోనే.. దేశానికి సుస్థిర అభివృద్ధి

*ప్రధాని మోడీ నాయకత్వంలోనే దేశానికి సుస్థిరమైన అభివృద్ధి జరుగుతుందనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. ఎందుకంటే, ఈ శతాబ్దంలోనే అత్యంత భయానకమైన కరోనా విపత్తులో కూడా మన భారతదేశం అభివృద్ధి పథంలో దూసుకుని పోవడానికి ప్రధాన కారణం ప్రధానమంత్రి నరేంద్రమోడీ నాయకత్వ పటిమ, దూరదృష్టి అన్నది నిర్వివాదాంశం. గత 10 సంవత్సరాలుగా ప్రధాని నరేంద్రమోడీ సారధ్యంలో బీజేపీ ప్రభుత్వం చేపట్టిన అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను పరిశీలిస్తే ఈ అంశాలు మనకు సుబోధకం అవుతాయి.*

### కరోనా విపత్తులోనూ దేశం ప్రగతిపథంలో పయనం :

2014వ సంవత్సరంలో రూ.17 లక్షల కోట్లుగా ఉన్న కేంద్ర బడ్జెట్‌ను 2024లో రూ.47 లక్షల కోట్లకు తీసుకొచ్చిన ఘనత కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానిదే. అంతేకాదు, ప్రపంచమంతా కోవిడ్ విపత్తులో ఆర్ధికంగా అల్లకల్లోలం అయినప్పటికీ, మనదేశంలో మాత్రం జీడీపీ రేటు పెరగడం విశేషం. అంతటి విపత్తులోనూ దేశాన్ని ప్రగతిపథంలో పయనింపజేసిన ఘనత మోడీదే. అభివృద్ధి సంక్షేమ పథకాలకు ఎలాంటి లోటు లేకుండా చేయడం కూడా బీజేపీ ప్రభుత్వం గొప్పతనమే. 2014లో ప్రపంచంలో 10వ ఆర్థికశక్తిగా ఉన్న భారతదేశాన్ని 2024 సంవత్సరానికి 5వ ఆర్ధికశక్తిగా తీర్చిదిద్దడమే దీనికి నిదర్శనం. అదేవిధంగా 2014లో ప్రజల తలసరి ఆదాయం రూ.6 వేలు ఉండగా, ప్రస్తుతం రూ.15వేలకు పెరిగిన విషయం గమనార్హం.

### వ్యవసాయం ఇప్పుడు దండగ కాదు..పండగే :

2014లో వ్యవసాయ రంగానికి 30వేల కోట్లు మాత్రమే సబ్సిడీ ఉండగా, 2024కు దానిని లక్షా 27వేల కోట్ల రూపాయలకు పెంచిన ఘనత బీజేపీ ప్రభుత్వానిదే. రైతులు పండించిన పంటలకు మద్దతు ధరలుగా క్వింటాలు వరికి రూ.1300 నుంచి రూ. 2040కి, గోధుమలకు రూ.1400 నుంచి 2125కు, పండ్ల ధరలు టన్నుకు రూ.19 వేల నుంచి రూ.48 వేలకు పెంచి, దేశ వ్యాప్తంగా రైతులకు వ్యవసాయాన్ని దండగ కాకుండా, పండగగా మార్చింది కూడా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వమే. పీఎం కిసాన్ సమ్మాన్ నిధి కింద ఎకరాకు రూ.6వేల రూపాయల వంతున పంటఖర్చులకు అందించడమే కాక, 2014లో 2.5 గిగా వాట్స్‌గా ఉన్న విద్యుత్ సామర్థ్యాన్ని 70 గిగా వాట్స్‌గా పెంచి, రైతులకు ఉచిత వ్యవసాయాన్ని అందించేవిధంగా రాష్ట్ర ప్రభుత్వాలను ప్రోత్సహించారు ప్రధాని నరేంద్రమోడీ. అదేవిధంగా, 2014కి 14 కోట్లుగా ఉన్న గ్యాస్ కనెక్షన్లను 31 కోట్లకు పెంచి, సుమారు 4 కోట్ల కొత్త ఇళ్లను కట్టించిన ఘనత కూడా బీజేపీ ప్రభుత్వానిదే.

### మోడీ సారధ్యంలోనే దేశానికి వెలుగుబాటలు

ప్రధాని మోడీ సారధ్యంలోని బీజేపీ ప్రభుత్వం ద్వారానే దేశానికి వెలుగుబాటలు పడుతున్నాయన్నది అందరికీ తెలిసిందే. 2014లో 105 స్టార్టప్ కంపెనీలు మనదేశంలో ఉండగా, ప్రధాని మోడీ వచ్చాక ఆ సంఖ్యను ఇప్పటికి లక్షా 50వేలకు పెంచి, లక్షలాదిమందికి ఐటీ, సాఫ్ట్‌వేర్ రంగాల్లో ఉద్యోగాలు కల్పించింది కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వమే. 2014లో విశ్వ విద్యాలయాలు 723 ఉంటే వాటి సంఖ్యను 1043కు పెంచింది, కళాశాలల సంఖ్యను 36 వేల నుంచి 46 వేలకు, ఐఐటీలను 16 నుంచి 23కు, ఐఐఎంలను 13 నుంచి 21కి, మెడికల్ కాలేజీలను 384 నుంచి 704కు, మెడికల్ కళాశాలల్లో ప్రవేశాలను 82 వేల నుంచి లక్షా 50వేల వరకు పెంచి దేశంలోని విద్యార్థులకు ఉన్నత విద్యలను అభ్యసించే మహదవకాశా లను కల్పించింది..మోడీ ప్రభుత్వమే. జాతీయ విద్యావిధానంతో విద్యా వ్యవస్థకు మెరుగులు దిద్దడం, నైపుణ్యాభివృద్ధి కోర్సు లను ప్రవేశపెట్టడం కూడా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ ఘనతే. 2014లో 250 రూపాయలుగా ఉన్న ఒక జీబీ ఇంటర్నెట్‌ను 16 రూపాయలకు తగ్గించి, ఇంటర్నెట్ స్పీడ్ పెంచి ఐటీ రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చింది, జాతీయ రహ దారులను సైతం విస్తరించి, మెట్రో రైళ్లను ప్రజలకు అందుబాటులోకి తెచ్చిందీ, వందేభారత్ వంటి హైస్పీడ్ రైళ్లను ప్రవేశపెట్టింది కూడా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వమే. అంతేకాదు, 2014 వరకు అంత రిక్షంలో 35 ఉపగ్రహాలను ప్రయోగించిన మనదేశం, మోడీ అధికారంలోకి వచ్చాక 389 ఉపగ్రహాలను దిగ్విజయంగా ప్రవేశపెట్టడం, చంద్రయాన్ వంటి సాహసోపేత పరిశోధన యాత్రలను సైతం జయప్రదంగా నిర్వహిస్తున్న ఘనత కూడా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానిదే. ఈ నేపథ్యంలో, అభివృద్ధి సాధకుడైన మన ప్రధాని నరేంద్రమోడీ మూడవసారి కూడా దేశ సారధ్యాన్ని చేపడతారని, మన దేశం ప్రపంచంలోనే 3వ అతిపెద్ద ఆర్థికశక్తిగా అవతరిస్తుందనడంలో ఎలాంటి సందేహం లేదు.



**యల్లాల మంజుల**
బీజేపీ మహిళా మోర్చా
రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు,
ఆంధ్రప్రదేశ్



## తిరుపతి జిల్లా గూడూరు డివిజన్



# వైకాపా మహాసంగ్రామ ర్యాలీ

గూడూరు పట్టణంలో వైకాపా నాయకులందరూ కలిసి ఎమ్మెల్యే అభ్యర్థి మేరిగ మురళీధర్‌తో ఇటీవల మహాసంగ్రామ ఎన్నికల ర్యాలీ నిర్వహించారు. దీంతో పట్టణంలోని అన్ని వీధులు జనసంద్రంతో నిండిపోయాయి. సిఐసి సభ్యులు ఎల్లసిరి గోపాల్‌రెడ్డి, పొణకా దేవసేనమ్మ, మాజీ కౌన్సిలర్లు, కార్యకర్తలు, మహిళలు పెద్ద సంఖ్యలో ఈ ర్యాలీలో పాల్గొన్నారు.

## బీసీల ఆత్మీయ సమ్మేళనం

ఈ నెల 6వ తేదీ గూడూరులోని పివిఆర్ కళ్యాణ మండపంలో బీసీల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమం జరిగింది. తిరుపతి పార్లమెంటు వైకాపా ఎంపీ అభ్యర్థి గురుమూర్తి, రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్‌రావు, గూడూరు వైకాపా ఎమ్మెల్యే అభ్యర్థి మేరిగ మురళీధర్, పొణకా దేవసేనమ్మ, చేవూరు విజయమోహన్‌రెడ్డి తదితరులు పాల్గొని సభను జయప్రదం చేశారు.

# జోరు పెంచిన కూటమి



ఎన్నికల వేళ గూడూరు నియోజకవర్గంలో కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ పాశం సునీల్‌కుమార్ ప్రచారాలతో హోరెత్తిస్తున్నారు. వివిధ రూపాల్లో ఓటర్లను ప్రసన్నం చేసుకుంటున్నారు. ఇంటింటికి తిరుగుతూ వైసీపీ అరాచకపాలనను ఎండగడుతున్నారు. సమస్యలు అడిగి తెలుసుకొని పరిష్కరిస్తామని హామీ ఇస్తున్నారు. సూపర్ సిక్స్ పథకాలను గురించి ప్రజలకు వివరిస్తూ, చంద్రబాబుతోనే రాష్ట్రం అభివృద్ధి సాధ్యమని వెల్లడిస్తున్నారు. ఈ నెల 5న వాకాడు మండలంలోని తీరప్రాంత గ్రామాలైన రావిగుంటపాళెం, నిడుగుర్తి, పూడిరాయిదరువులలో పాశం సునీల్‌కుమార్ పర్యటించారు. టిడిపి మండల అధ్యక్షులు దువ్వూరు మధుసూదనరెడ్డి ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. నల్లపరెడ్డి జగన్మోహన్‌రెడ్డి, బీజేపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి పాపారెడ్డి, పురుషోత్తంరెడ్డి, టిడిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రశాంతంగా
# పోస్టల్ బ్యాలెట్



గూడూరు పట్టణంలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో ఆదివారం పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రశాంతంగా జరిగింది. ఆర్వో కిరణ్‌కుమార్ పోస్టల్ బ్యాలెట్ ఓట్లు వేసేందుకు వచ్చే ఉద్యోగులకు వసతుల ఏర్పాట్లు పర్యవేక్షించారు. డిఎస్పీ సూర్య నారాయణరెడ్డి ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

## దివ్యాంగులకు
# కృత్రిమ చేతులు

రోటరీ క్లబ్ ఆఫ్ మంగళగిరి ఆధ్వర్యంలో మే19 నుండి 26వరకు పాక్షికంగా లేక పూర్తిగా చేయి లేని దివ్యాంగులకు కృత్రిమ చేతిని ఉచితంగా అందజేస్తున్నారని, గూడూరు మరియు పరిసర ప్రాంత చేయి లేని దివ్యాంగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మయూరి శ్యాంయాదవ్ తెలియజేశారు. 72074 03150 నెంబర్‌కి ఫోన్‌చేసి పేర్లను నమోదు చేసుకోవాలని ఆయన కోరారు.

## ప్రజా డాక్టర్
# సీతారామయ్య కన్నుమూత



గూడూరుకు చెందిన ప్రముఖ చిన్నపిల్లల వైద్యులు, సాహిత్యాభిలాషి కందనూరు సీతారామయ్య తన 85వ యేట అనారోగ్యంతో ఈ నెల 8వ తేదీ చెన్నైలో మృతిచెందారు. ఆయనకు ముగ్గురు కుమారులు, ఒక కూతురు ఉన్నారు.

## రాష్ట్ర భవిష్యత్తు కోసం..
# వైకపాను గెలిపించండి

**మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి**



రాష్ట్ర భవిష్యత్తు కోసం ఈ ఎన్నికల్లో వైకాపాను గెలిపించాలని మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి ప్రజలకు పిలుపునిచ్చారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా సర్వేపల్లి నియోజకవర్గంలోని మనుబోలులో మే 8న జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ, అయిదేళ్లపాటు పేదలకు తాము అండగా నిలిచామని, ఈసారి కూడా వైకాపాకు ప్రజలు అవకాశం ఇవ్వాలని కోరారు. చంద్రబాబు మాటలు నమ్మొద్దని, సూపర్ సిక్స్ పథకాలన్నీ మోసమేనని ఆయన ఈ సందర్భంగా దుయ్యబట్టారు. ప్రజాసంక్షేమమే ధ్యేయంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నో సంక్షేమపథకాలను అమలు చేస్తున్నారని, అలాంటి సీఎంను మరోసారి గెలిపించుకోవాలన్నారు. రాష్ట్ర ప్రజల బాగు కోసం కృషిచేసే పార్టీ ఒక్క వైకాపాయేనన్నారు. ఈ ఎన్నికల్లో సర్వేపల్లి నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా పోటీచేస్తున్న తనను, తిరుపతి ఎంపీగా పోటీలో ఉన్న గురుమూర్తిని గెలిపించాలని కోరారు.

# చంద్రబాబు వస్తే.. సంక్షేమం మాయం

**ప్రసన్న విమర్శ**



ఈ ఎన్నికల్లో చంద్రబాబు గెలిస్తే ప్రజాసంక్షేమం మాయమవుతుందని, మాటలతో మభ్యపెట్టి ప్రజలను మోసం చేయడం చంద్రబాబుకు అలవాటేనని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్న కుమార్‌రెడ్డి విమర్శించారు. మే 8న కొడవలూరు మండలంలోని నాయుడుపాళెం తదితర ప్రాంతాల్లో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహిస్తూ, టీడీపీ వల్ల ప్రజలకు ఒరిగేదేమీ వుండదని, సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సారధ్యంలో వైకాపా ప్రభుత్వం ఉంటేనే ప్రజలకు సంక్షేమ పథకాలన్నీ సజావుగా కొనసాగుతాయని చెప్పారు. ఈ ఎన్నికల్లో వైకాపాకు అఖండవిజయం చేకూర్చాలని, కోవూరు ఎమ్మెల్యే అభ్యర్థిగా తనను, నెల్లూరు ఎంపీ అభ్యర్థి విజయసాయిరెడ్డిని గెలిపించాలని ఆయన కోరారు.

# టీడీపీ గెలిస్తేనే రాష్ట్రం బాగుపడుతుంది

**నారా రోహిత్**



ఈ ఎన్నికల్లో టీడీపీ గెలిస్తేనే రాష్ట్రం బాగుపడుతుందని, చంద్రబాబు సంకల్పంతో సిద్ధమైన సూపర్‌సిక్స్ పథకాలు ప్రజలకు ఎంతో ఉపయోగకరమని ప్రముఖ సినీనటుడు నారా రోహిత్ అన్నారు. మే 8న కావలి అసెంబ్లీ టీడీపీ అభ్యర్థి కావ్య కృష్ణారెడ్డితో కలిసి ఆయన కావలి రూరల్ మండలంలోని ఆనెమడుగు, మొండి దిన్నెపాళెం, కట్టకిందపాళెం, బైనేటివారిపాళెం తదితర ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వైకపా పాలనలో రాష్ట్రం సంక్షోభంలో కూరుకుపోయిందని, ఎలాంటి అభివృద్ధి లేని రాష్ట్రంగా తయారైందని విమర్శించారు. రాష్ట్ర ప్రజలకు సంక్షేమంతో పాటు రాష్ట్రాభివృద్ధి జరగాలంటే మళ్ళీ చంద్రబాబునాయుడు అధికారంలోకి రావాలన్నారు. కావ్య కృష్ణారెడ్డి మాట్లాడుతూ వైకపా పాలనలో అంతా దోచుకోవడం దాచుకోవడమే తప్ప ప్రజల కష్టసుఖాలు పట్టించుకునేవారే లేరన్నారు. ఎమ్మెల్యేగా రామిరెడ్డి ప్రతాప్ కావలి అభివృద్ధికి చేసిందేమీ లేదని ఆయన విమర్శించారు. నాయకులు వంటేరు వేణుగోపాలరెడ్డి, ఆవుల రామకృష్ణ ఉప్పాల వెంకట్రావు, కందుకూరి సత్యనారాయణ, మామిడి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

# తూపిలి రామ్మోహన్‌రావు కన్నుమూత

## పలువురు జర్నలిస్టు నాయకుల నివాళి



నెల్లూరులోని సీనియర్ జర్నలిస్టు తూపిలి రామ్మోహన్‌రావు మే 7న అనారోగ్యంతో కన్నుమూశారు. ఆయన భౌతికకాయాన్ని ఈనెల 8న ఏపీయుడబ్ల్యుజె నాయకులు జయప్రకాష్, ఏపి జర్నలిస్ట్ యూనియన్ నాయకుడు గాదంశెట్టి శేఖర్‌బాబు తదితరులు సందర్శించి నివాళులర్పించారు. కొంతకాలం క్రితం పలు దినపత్రికల్లో రామ్మోహన్‌రావు నిబద్ధతతో పనిచేశారని, జర్నలిస్టు సంఘంలోనూ సేవలందించారని వారు గుర్తు చేసుకున్నారు. ఆయన మరణం తీరని లోటని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన కుటుంబసభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు.





స్మృత్యంజలి

మీ జ్ఞాపకాలు అజరామరం..
మీ ఆశయాలు అమరం!
మీ స్మృతులతో...

కీ॥శే॥ శ్రీ కె.వి.రమణయ్య - శ్రీమతి రమాదేవి

| కుమారులు - కోడళ్లు | కుమార్తెలు - అల్లుళ్లు |
| --- | --- |
| కనుపర్తి రామకృష్ణప్రసాద్ - మీన | సీతాలక్ష్మి - దంటు విశ్వనాథ సూరి |
| కనుపర్తి దయాశంకర్ - రేణుక | జ్యోతిలక్ష్మి - చుండి వెంకటనరసింహశర్మ |

మనవళ్ళు, మనవరాళ్ళు మరియు మునిమనుమరాలు



# మంచి సేవలందిస్తున్న 'కంచి'

## • మునిసిపల్ కమిషనర్ ప్రశంస

నిస్వార్థ సేవాభావంతో ప్రజల కోసం, ముఖ్యంగా పేదల శ్రేయస్సు కోసం మంచి సేవలందిస్తున్న కంచి పరమేశ్వరరెడ్డి ఆత్మకూరు ప్రాంతంలో స్థానికుల ప్రశంసలందుకుంటున్నారు. తాను ఏర్పాటుచేసిన 'సాంబశివా చారిటబుల్ ట్రస్ట్' ద్వారా అనునిత్యం ఏదో ఒక సేవా కార్యక్రమాన్ని ఆయన నిర్వహిస్తూనే ఉన్నారు. ఇప్పటికే ఆత్మకూరు పట్టణంలో వందలాది మంది ప్రజలకు నిత్యాన్నదానం చేస్తున్నారు. ఆత్మకూరు పట్టణంలో పేద కుటుంబాల్లో ఎవరైనా చనిపోతే ఆ కుటుంబాలకు ఆర్థిక సాయం అందిస్తున్నారు. 15వ వార్డుకు చెందిన యాదనపూడి శ్రీధర్‌మూర్తి, 10వ వార్డుకు చెందిన పరిటాల సుశీలమ్మ ఇటీవల మరణిస్తే, వారి కుటుంబాలకు రూ.10వేల వంతున ఆర్థిక సాయం అందించారు. ఇటీవల ఆత్మకూరులోని ఎంజిఆర్ మునిసిపల్ బస్టాండు, నెల్లూరుపాళెం కూడళ్ళ వద్ద చలివేంద్రాలు కూడా ఏర్పాటు చేశారు. ఈ మండుటెండల్లో చలివేంద్రాలు ఏర్పాటుచేసి ప్రజల దాహార్తి తీరుస్తుండడం కంచి మంచి మనసుకు నిదర్శనమంటూ ఆ చలివేంద్రాలను ప్రారంభించడానికి వచ్చిన మునిసిపల్ కమిషనర్ ఫజులుల్లా సంతోషం వ్యక్తంచేశారు. ఇలా ఎన్నో సేవా కార్యక్రమాల ద్వారా ప్రజలకు మంచి చేస్తున్న కంచి, పదికాలాల పాటు చల్లగా ఉండాలని ఆయన ఆశీర్వదించారు. ట్రస్ట్ సభ్యులు కెవి శేషారెడ్డి, రాంపల్లి ప్రసాద్‌రెడ్డి, అశోక్‌రెడ్డి పాల్గొన్నారు.

# తుది ఓటర్ల జాబితా వచ్చేసింది

ఎన్నికలకు సంబంధించి 25.4.2024 నాటికి సమీకృత ఓటర్ల జాబితా వచ్చేసింది. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు, జిల్లా ఎన్నికల అధికారి సూచనల మేరకు వాటిని రాజకీయపార్టీల ప్రతినిధులకు అందజేశారు. నెల్లూరు అసెంబ్లీ నియోజకవర్గం-117 తుది ఓటర్ల జాబితాను మే 4న నెల్లూరులోని కార్పొరేషన్ కార్యాలయంలోని కమాండ్‌కంట్రోల్ విభాగంలో రిటర్నింగ్ అధికారి వికాస్ మర్మత్ గుర్తింపు పొందిన పార్టీల ప్రతినిధులకు ఇచ్చారు. గుర్తింపు పొందని రాజకీయపార్టీలు, ఇండిపెండెంట్ అభ్యర్థులు ఎన్నికల కమిషన్ వెబ్‌సైట్ నుంచి, లేకుంటే తగిన రుసుమును చలానా ద్వారా చెల్లించి రిటర్నింగ్ అధికారి కార్యాలయం నుంచి పొందవచ్చని ఆయన తెలిపారు.

# కాంగ్రెస్‌తోనే ప్రజలకు భరోసా!

## ➢ నెల్లూరు పార్లమెంట్ అభ్యర్థి కె. రాజు

కాంగ్రెస్ అంటే ప్రజలకు ఓ భరోసా అని, ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలిస్తే దేశంలోని అన్నివర్గాల ప్రజలకు అండగా నిలుస్తుందని, ప్రజలు కాంగ్రెస్‌ను గెలిపించాలని నెల్లూరు పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి కె.రాజు చెప్పారు. ఇటీవల ఆయన బుచ్చిరెడ్డిపాళెంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తొలుత అక్కడున్న డా.బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, యువకులకు ఉద్యోగావకాశాలు రావాలన్నా, మహిళలకు సంక్షేమ కార్యక్రమాలు అమలు కావాలన్నా, ప్రజలంతా సంతోషంగా ఉండాలన్నా కాంగ్రెస్‌నే గెలిపించాలన్నారు. కాంగ్రెస్ అధికారం లోకి వస్తే ప్రజలకు ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు వస్తాయని, కోట్లాదిమంది అసంఘటిత కార్మికులకు కాంగ్రెస్ అండగా ఉం టుందని అన్నారు. నెల్లూరుజిల్లా కలెక్టర్‌గా తాను గతంలో పని



చేశానని, ఎన్నో సంక్షేమ పథకాలను తమ హయాంలో అమలు చేయడం జరిగిందని ఆయన ఈ సందర్భంగా గుర్తుచేశారు. ఈ ఎన్నికల్లో నెల్లూరు ఎంపీ స్థానానికి పోటీచేస్తున్న తనకు విజయం చేకూర్చి ప్రజలకు సేవచేసే అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

# కృష్ణపట్నం పోర్టుకు ప్రతిష్టాత్మక అవార్డులు





నెల్లూరుజిల్లా ముత్తుకూరు మండలంలోని అదాని కృష్ణపట్నం పోర్టుకు ఇటీవల రెండు ప్రతిష్టాత్మక అవార్డులు లభించాయి. 2023-24 సంవత్సరానికి 16వ కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీస్ (సీఐఐ) సదరన్ రీజన్ 5 ఎస్ ప్రాసెస్ మెచ్యూరిటీ ఎక్స్‌లెన్సీ అవార్డు అందుకుంది. చెన్నైలో ఇటీవల ఏర్పాటుచేసిన సీఐఐ కార్యక్రమంలో ఇహెచ్ఎస్ ఏజీఎం వేణుగోపాలరెడ్డితోపాటు మధుసూదన్, నాగార్జున, రేవతి ఈ అవార్డును అందుకున్నారు. తమ పోర్టుకు ఈ అవార్డు రావడం పట్ల అదాని కృష్ణపట్నం పోర్టు సీఇఓ జీజేరావు ఒక ప్రకటనలో సంతోషం వ్యక్తం చేశారు.

## గ్రీన్‌లీఫ్ ప్లాటినం అవార్డు :

అదేవిధంగా మే 5న హార్బర్స్, పోర్టు సెక్టార్‌లో అపెక్స్ ఇండియా గ్రీన్‌లీఫ్ ప్లాటినమ్ అవార్డు కూడా లభించడం విశేషం. ఈ అవార్డును కృష్ణపట్నం పోర్టు వైస్ ప్రెసిడెంట్ (ఎన్విరాన్‌మెంట్) డాక్టర్ జ్యోతి గణపతి అందుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, కృష్ణపట్నం పోర్టు కార్యకలాపాల్లో భాగంగా సుస్థిరతకు ప్రాధాన్యతనిస్తూ, పర్యావరణ అనుకూల పద్ధతులను అమలుచేయడంలో అంకితభావంతో వ్యవహరిస్తుండడంతో ఈ అవార్డు లభించిందన్నారు.



# జానకిరామ.. రామాయణం 12

**- ఊటుకూరు జానకి రామారావు**

గౌతమ మహర్షి ఆతిథ్యం స్వీకరించిన తర్వాత విశ్వామిత్ర మహర్షి ఈశాన్యదిక్కుగా ప్రయాణమయ్యాడు.

అన్నదమ్ములిరువురూ ఆయనను అనుసరించారు.

జనకుడి యజ్ఞశాలకు ప్రవేశించారు మహర్షి!.

మహాత్ముడైన విశ్వామిత్ర మహర్షి రాక తెలిసికొని జనకమహారాజు తన పురోహితుడైన శతానందులవారిని వెంట పెట్టుకొని అతిశీఘ్రంగా ఆయన వద్దకు చేరి, అర్ఘ్యపాద్యాదులొసగి ఆ మహానుభావుని తగురీతిని సత్కరించి అంజలి ఘటించి నిలుచున్నాడు.

జనకుడిని యజ్ఞం ఏవిధంగా జరుగుతున్నదో అడిగి తెలుసుకున్నారు మహర్షి.

అప్పుడు జనకుడి మదిలో ఒక ఉత్సాహమేర్పడి, మహర్షివెంట ఉన్న ధనుర్ధారులైన రాకుమారులెవరో తెలుసుకోవాలని కోరిక కలిగింది.

మహర్షీ వీరిరువురూ ఎవరు?
పద్మపత్రాల వంటి కన్నులు,
అశ్వినీ దేవతల సౌందర్యం,
దేవతాసమానపరాక్రమము,
గజ సింహ సమానమయిన నడక,
చూడగానే దేవతలవలే కనపడే ఈ బాలురెవ్వరు?
ఎవరువారు? నీతో కాలి నడకనే ఇక్కడికి వచ్చినారెందుకు?

జనకుడి ప్రశ్నల పరంపరకు చిరునవ్వుతో మహర్షి ఇలా సమాధానమిచ్చారు... వీరు అయోధ్యా పురాధీశుడు దశరథమహారాజు కుమారులు రామలక్ష్మణులు!... అని చెప్పి!.

***తాటకన్ద్రుంచి వైచి యతిదర్పితుడైన సుబాహుసాయకోత్పాటితు చేసి***
***గీటడిచి ధర్మ మెలర్పన్ అహల్య శాపముచ్చాటన***
***మొందజేసి కడు సమ్మద మారగ నీగృహంబునం***
***జాటగనున్న శంకరుని చాపము జూడగ వచ్చిరి ఏర్పడన్***

తాటకను చంపినవారు వీరే,
సుబాహుడిని మృత్యువు కౌగిలిలోకి తోసినది వీరే,
అహల్య శాపవిమోచనం గావించినవారు వీరే!
నీ ఇంట ఉన్న శివధనుస్సును చూడటానికి ఇప్పుడు ఇక్కడికి వచ్చారు.
(● పై పద్యం భాస్కర రామాయణంలోనిది)

ఇది వింటున్న శతానందులవారు ఆనందంతో ఎగిరి గంతువేసి ఏమిటి మహర్షీ? మా అమ్మ అహల్యకు శాపవిమోచనమైందా? అని ఆత్రుతతో ప్రశ్నించాడు.

శతానందులవారు అహల్యాగౌతముల కుమారుడు.

ఓ బ్రహ్మర్షీ! నా తల్లిని రాముడు చూసినాడా? ఆమెను అనుగ్రహించినాడా? మరల నా తండ్రి అచటికి ఏతెంచినాడా? నా తల్లితండ్రులు ఇరువురూ సంతోషంగా కలసినారు కదా!

రాముడు వారి ఆతిథ్యమును స్వీకరించెనా? నా తల్లిదండ్రులు రామునకు ఫలపుష్పాదులొసగినారు కదా!

ఇలా ఒకదానివెంట మరొక ప్రశ్న సంధిస్తూ వెడుతున్న శతానందుల వారికి విశ్వామిత్రుడు చిరునవ్వుతో ఒకే ఒక సమాధానం చెప్పారు.

"నాయనా, జరుగవలసిన వెల్ల జరిగినవి. నా కర్తవ్యము నేను నిర్వహించితిని. ఆ మాటలు విన్న శతానందుడు... ధన్యుడనైతిని ఓ రామచంద్రా నీవు నా తలితండ్రులకు, కుటుంబానికి చేసిన మేలు మరువలేనిదయ్యా!

నీవు కూడా ధన్యుడవయితివయ్యా! అనితర సాధ్యమైన బ్రహ్మర్షి పదాన్ని స్వయంకృషితో అందుకున్న ఈ మహాతేజోసంపన్నుడైన విశ్వామిత్రుని శిష్యరికం నీకు లభించినది.

ఈయన సామాన్యుడనుకున్నావా! కాదు, కాదు! ఈయన ఒక్కడే! (unique). చరిత్రలో మరొకరు లేరు.

ఒక సామాన్య రాజుగా జన్మించి రాజర్షియై, ఋషియై, మహర్షియై, బ్రహ్మర్షి అయిన ఈయన చరిత్ర అత్యంత స్ఫూర్తిదాయకం, ఆదర్శవంతం. ఒక లక్ష్యం కోసం పట్టువిడవక వేల ఏండ్లు తపస్సు చేసి సాధించిన మహోన్నతమైన వ్యక్తి విశ్వామిత్రమహర్షి!

తపస్సు ద్వారా మనస్సులోని మలినములు ఒక్కొక్కటిగా తొలగించుకుంటూ మనస్సు అత్యంత పరిశుద్ధమైన మానససరోవరంగా మార్చుకున్న వాడయ్యా ఈయన!

ఈయన చరిత్ర మానవాళికి అందించే పాఠం అత్యంత విలువైనది! ఈ చరిత్ర కార్యసాధకుడైన ప్రతి వ్యక్తి హృదయంలో స్ఫూర్తి రగిలిస్తుంది!

రామచంద్రా ఈ బ్రహ్మర్షిగుర్చి నీకు వివరించ ప్రయత్నం చేస్తాను... అంటూ శతానందులవారు విశ్వామిత్రమహర్షి చరిత్ర చెప్పటం మొదలు పెట్టారు!.

బ్రహ్మదేవుని కుమారుడు కుశుడు, ఆయన కుమారుడు కుశనాభుడు, ఆయన కుమారుడు గాధి, గాధి కుమారుడు విశ్వామిత్రుడు!

విశ్వామిత్రుడు ఒక రాజు. ఒకసారి ఈయన తన సైన్యాన్ని వెంట



పెట్టుకుని విహారానికి బయలుదేరాడు! అలా వెళుతూ, వెళుతూ అరణ్య మధ్యంలో ఉన్న వశిష్ట మహర్షి ఆశ్రమం చేరుకుంటాడు.

ఒకరినొకరు కుశలప్రశ్నలు వేసుకొన్న తరువాత వశిష్ట మహర్షి కౌశికునితో నీకు, నీ సైన్యానికి ఆతిథ్యం ఇస్తాను స్వీకరించు! అని అంటాడు! అప్పుడు విశ్వామిత్రుడు మీరిచ్చిన కందమూలఫలములు నాకు తృప్తికలిగించినవి ఇక వేరే ఆతిథ్యమెందులకు మహర్షీ, వలదు... అని వినయంగా బదులు పలుకుతాడు.

(ఒక అక్షౌహిణీ సైన్యానికి విందు ఇవ్వటం మాటలుకాదు! ఆశ్రమంలో ఉండే మునుల వద్ద అంత వ్యవస్థ ఉండదు కాబట్టి మహర్షిని ఇబ్బంది పెట్టడం ఎందుకని, వద్దంటాడు).

వశిష్ట మహర్షి పట్టిన పట్టు వదలక విందు స్వీకరించాల్సిందేనని అంటాడు. అప్పుడిక తప్పనిసరి పరిస్థితుల్లో సరేనంటాడు విశ్వామిత్రుడు!

క్షణాలలో అంత సైన్యానికీ కూడా పంచభక్ష్య పరమాన్నాలతో, షడ్రసోపేతమైన విందు ఏర్పాటు చేస్తాడు మహర్షి వశిష్ఠుడు. అంతకు ముందెన్నడూ అంత అద్భుతమైన వంటకాలను రాజుగాని, ఆయన పరివారం గాని రుచిచూసి ఉండలేదు! ఆశ్చర్యం కలుగుతుంది విశ్వామిత్రునకు! ఇది ఎలా సాధ్యం? ముక్కుమూసుకుని మూలన కూర్చున్న మునులకు ఇంత వ్యవస్థ ఎలా సమకూరింది?

ఉండబట్టలేక ఆ విషయాన్ని వశిష్ట మహర్షి వద్ద ప్రస్తావిస్తాడు!

అందుకు జవాబుగా ఆయన తన ఆశ్రమంలోని ఒక "ఆవు"ను చూపిస్తాడు. ఈ ఆవా? ఎంతో అమాయకంగా ఉన్న ఈ ప్రాణా? నమ్మబుద్ధికాలేదు విశ్వామిత్రుడికి!

అప్పుడు వశిష్ఠుడు చెపుతాడు ! దీని పేరు "శబల" ఇది దివ్యధేనువు! దీనికున్న శక్తులు అపారం!

శబలను చూసి ముచ్చటపడతాడు విశ్వామిత్రుడు! మహర్షీ ఈ ఒక్క ఆవును నాకిచ్చేయి, నీకు లక్ష గోవులను ఇస్తాను అని అంటాడు విశ్వామిత్రుడు, అందుకు ఒప్పుకోడు వశిష్ఠుడు.

..(సశేషం)

# ధ్వజమెత్తిన ద్వయం!

(మొదటి పేజీ తరువాయి)

రాజకీయ విశ్లేషకులని ఆలోచింపజేసింది. బీజేపీ – వైసీపీ ఒకటే అన్న భ్రమని కల్పించింది. వైసీపీ శ్రేణుల్లో ఆనందాన్ని నింపింది. పోలింగ్ తేదీ దగ్గరపడుతున్న సమయంలో, పార్టీల బలాన్ని, నేతల భవిష్యత్తును ఆంధ్ర ఓటర్లు తేల్చనున్న తరుణంలో భారత ప్రధాని నరేంద్రమోడీ, హోంమంత్రి అమిత్‌షాలు తమ వరుస పర్యటనలలో ఆంధ్ర ప్రభుత్వంపైనా, ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డిపైన చేస్తున్న ఘాటైన విమర్శలు ఇప్పుడు రాష్ట్ర రాజకీయాలలో సంచలనంగా మారాయి.

## ఆంధ్రాలో మాఫియా రాజ్యం నడుస్తోంది - ప్రధాని



ఎన్నికల ప్రచారంలో భాగంగా భారత ప్రధాన మంత్రి నరేంద్రమోడీ మే 6వ తేదీ రాష్ట్రానికి వచ్చారు. రాజమండ్రి, అనకాపల్లిలలో జరిగిన 'ప్రజాగళం' బహిరంగ సభలలో పాల్గొని వైసీపీపై ధ్వజమెత్తారు. ఆంధ్రప్రదేశ్‌లో మాఫియా రాజ్యం నడుస్తోందంటూ దుయ్యబట్టారు. మద్యం, ఇసుక, మైనింగ్‌లలో కోట్ల రూపాయలు దోచేశారని ఆరోపించారు. మూడు రాజధానులంటూ ఒక్క రాజధాని కూడా లేకుండా చేశారని అన్నారు. వైసీపీ నాయకులు తమ ఇష్టారాజ్యాంగ అక్రమాలు, అరాచకాలు చేస్తూ భూదందాలకి పాల్పడుతున్నారని విమర్శించారు. కేంద్రం ఇస్తున్న పథకాలని తమ పథకాలుగా గొప్పలు చెప్పుకుంటున్నారని ఎద్దేవా చేశారు. ఇంకా అనేక ఆరోపణలతో వైసీపీపై వాగ్బాణాలని సంధించారు.

అభివృద్ధి – సంక్షేమం సంవృద్ధిగా కావాలంటే కూటమిని గెలిపించాలని పిలుపిచ్చారు. సత్తా, సమర్ధత వున్న నాయకుడిగా చంద్రబాబుని ప్రధాని పొగడ్తలతో ముంచెత్తారు.. రాష్ట్రంలో కూటమిని గెలిపిస్తే, కేంద్రంలో మళ్ళీ అధికారంలోకి రానున్న బీజేపీ సహకారంతో టీడీపీ – జనసేనల డబుల్ ఇంజన్ పాలనని అందిస్తామని హామీ ఇచ్చారు. ప్రగతిని పరుగులు పెట్టిస్తామని భరోసా కల్పించారు. లోక్‌సభకి 25 సీట్లు, అసెంబ్లీకి 140 సీట్లు ఇచ్చి కూటమిని గెలిపించండి... మీ రాష్ట్ర భవిష్యత్తుకి మోడీ గ్యారెంటీ అంటూ కూటమి శ్రేణుల్లో సమరోత్సాహాన్ని నింపారు.

## వైకాపా అంతం మా పంతం - అమిత్ షా



ప్రధాని నరేంద్ర మోడీ రాష్ట్రానికి రావడానికి సరిగ్గా ఒక్క రోజు ముందు కేంద్ర హోంమంత్రి అమిత్ షా సత్యసాయి జిల్లా ధర్మవరానికి వచ్చారు. అక్కడ జరిగిన ప్రజాగళం సభలో షా మాట్లాడారు. రాష్ట్రంలో జగన్ సర్కారు అంతం కోసమే తాము టీడీపీ, జనసేనలతో పొత్తు పెట్టుకున్నామని స్పష్టం చేశారు. మద్య నిషేధం మానేసి మద్యం వ్యాపారం చేస్తావా...? అంటూ జగన్‌ని ప్రశ్నించారు. పోలవరం ఎందుకు కట్టలేక పోయారు అంటూ వైసీపీ సర్కారుని నిలదీశారు. అమరావతిని ఎందుకు అడ్డుకున్నారు..? అని అడిగారు. ఆంధ్రాలో గూండాల పాలన సాగుతోందని, నియంతృత్వ పోకడ కొనసాగుతోందని.. వాటన్నిటిని మట్టుపెట్టడానికే తాము బాబుతో కలిశాం అని చెప్పారు. చంద్రబాబు సమర్ధతకి ఆయన ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఉమ్మడి రాష్ట్రంలో జరిగిన అభివృద్ధే నిదర్శనమని పాత రోజులని గుర్తు చేశారు. వైసీపీని ఓడించండి, కూటమిని గెలిపించండి... అంటూ పిలుపిచ్చారు. కేంద్రంలో మోడీ, రాష్ట్రంలో బాబు ఉంటే ఆంధ్ర అభివృద్ధిలో అగ్రగామిగా నిలుస్తుందని హామీ ఇచ్చారు. తన ప్రియమిత్రుడు సత్యకుమార్‌ని హిందూపురం శాసనసభ్యుడిగా గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

వైసీపీ వైఫల్యాలను ఎత్తిచూపుతూ, బాబు ప్రతిభని కీర్తిస్తూ మోడీ – షా ద్వయం చేసిన ప్రసంగాలు రాష్ట్ర రాజకీయాలలో సంచలనాత్మక మార్పుకి సంకేతాలు కానున్నాయని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారన్న నెపంతో డీజీపీతో సహా అనేకమంది అధికారులని ఎన్నికల కమిషన్ బదిలీ చేసింది. వాలంటీర్ల వ్యవస్థకి బ్రేకులు వేసింది. ప్రజల ఖాతాలో డబ్బులు జమచేసే ప్రక్రియకు చెక్ పెట్టింది. ఇలాంటి చర్యలన్నీ ఆంధ్ర విషయంలో బీజేపీ వైఖరిని స్పష్టం చేస్తున్నాయన్నది మేధావుల భావన. తాము జగన్మోహన్‌రెడ్డితో అంటగట్టలేదన్న క్లారిటీ ఇవ్వడంతోపాటు టీడీపీ–జనసేనలకి తమ పరిపూర్ణమద్దత్తు ఇస్తున్నామన్న సందేశాన్ని కూడా మోడీ – షా ద్వయం ప్రజల్లోకి తీసుకెళ్లారని విశ్లేషకులు అభిప్రాయ పడుతున్నారు.

విశ్లేషకులు, మేధావులు ఊహించినట్లుగా కమలనాథులు చేస్తున్న ప్రయత్నాలు బీజేపీ వైఖరిని ప్రస్ఫుటం చేస్తే, మోడీ – షాల ప్రసంగాలు ప్రజలని చైతన్యపరచి ఆలోచింపచేస్తున్నాయన్న మాట కూడా రాజకీయవర్గాల నుండి వినపడడం గమనార్హం...!

# ఓటేద్దాం రండి!

(మొదటి పేజీ తరువాయి)

ప్రజాస్వామ్య దేశంలో పౌరుడి అస్తిత్వానికి ప్రతీకగా నిలిచే చిరునామా ఓటే. దేశ భవిష్యత్తును ప్రభావితం చేయగల శక్తి ఓటుకు ఉంది. మరి అలాంటి ఓటును సమగ్రంగా వినియోగించుకోగల శక్తి, అవకాశం మన చేతుల్లోనే ఉంది. మనం ఓటు వేసి ఎన్నుకున్నవారే మనకు సేవ చేస్తారు. ఇలాంటి అవకాశం ఎన్ని దేశాల్లో ఉంది. ఐదేళ్ళకు ఓసారి గ్యారంటీ ఉన్న ప్రభుత్వాన్ని ఎన్నుకుంటూ, వారంటీ లేని నాయకులను ఈడ్చి కొట్టే ఇలాంటి అవకాశాన్ని వదులుకోవటం నిజంగా అజ్ఞానమే అవుతుంది.

కూటికి గుడ్డకున్ ప్రజలు, కొంగరవోవుచుండ నీటుగా
మోటారూబండ్లపై నగదు మూటలతో కలవారి వోటు భి
క్షాటన సాగుచున్నయది జాగ్రత! దేశనివాసులారా! మీ
యోటులు స్వీయభారత సముజ్వల గాత్రికి సూత్ర బంధముల్...

భవిష్యత్తుని మహాకవి జాషువా ఎప్పుడో ఊహించారు. సరైన వాడికి ఓటు వేసి ఎన్నుకోకపోతే దేశమాతకు సంకెళ్ళు తప్పవని హెచ్చరించారు. అసలు ఓటే వెయ్యకపోతే సరైన వాణ్ని ఎలా ఎన్నుకోగలం. సామాన్యుడి ఆవేదన కంటే, మేధావి మౌనం ఈ దేశానికి చాలా ప్రమాదకరం అన్నది పెద్దల మాట. అందుకే ఓటింగ్ మహా యజ్ఞాన్ని ముందుండి నడిపించాల్సింది చదువుకున్న వారు, మేధావులే. వీరంతా ఎక్కువగా పట్టణాల్లోనే నివసిస్తున్నారు. లేదంటే పట్టణాల్లోనే పని చేస్తున్నారు. మరి పట్టణాల్లో ఓటింగ్ శాతం ఎందుకు తక్కువగా ఉంది. ఈ విషయాన్ని ప్రతి ఒక్కరూ ఆలోచించాల్సిన అవసరం ఉంది. అభివృద్ధిలో వెనుకబడి ఉన్న గ్రామాలు... ఓటింగ్ విషయంలో మాత్రం ఎంతో పరిణతిని చూపిస్తున్నాయి. తమ ఓటును కచ్చితంగా వినియోగించుకుంటున్నాయి. కానీ చదువుకున్న వాళ్ళం, మేధావులం, నాగరికులం అని చెప్పుకుంటున్న వాళ్ళలో చాలా మంది పోలింగ్‌బూత్‌ల వైపు కన్నెత్తి కూడా చూడటం లేదు.

## ఓటు కోసం పోరాటం చేసిన దేశాలున్నాయి..!

ఇదే ఓటు విషయంలో అమెరికా లాంటి దేశాలు ఎన్ని పోరాటాలు చేయవలసి వచ్చిందో ఒక్కసారి తెలుసుకుంటే... ఎవరైనా తమ ఓటు విలువను కచ్చితంగా తెలుసుకోగలుగుతారు. దాదాపు 200 సంవత్సరాల సుదీర్ఘ పోరాటం తర్వాత అమెరికా ప్రజలు ఓటు హక్కు సాధించుకోగలిగారు. ప్రపంచంలో మొట్టమొదటి ప్రజాస్వామ్య దేశం అమెరికా అయితే, అతిపెద్ద ప్రజాస్వామ్య దేశం భారత్. మొదటి ప్రజాస్వామ్య దేశంలో మహిళలకు ఓటు హక్కు లేని రోజుల్లో, భారతదేశంలో మహిళలు ఓటు హక్కును పొందగలిగారు అనే విషయం ఎంత మందికి తెలుసు. 1907లో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంలో వేసిన రాయల్ కమిషన్ సిఫార్సుల ఆధారంగా 1909లో ఉన్నత సంపన్న వర్గాల వారికి ఓటు హక్కును బ్రిటీష్ ప్రభుత్వం కల్పించింది. అంటే ఆర్థికంగా సంపన్నంగా ఉన్నవారే ఓటు వేయటానికి అర్హులు. సామాన్యులకు ఆ అర్హతే లేదు. 1919లో అమలులోకి వచ్చిన సంస్కరణల ద్వారా ఓటు హక్కును కొంతమేర విస్తృత పరిచారు. ఆ తర్వాత 10.6 శాతం ప్రజలకు, రాజ్యాంగ పరిషత్ ఎన్నికల నాటికి 28.5 శాతం భారత పౌరులకు ఓటు హక్కును విస్తరింపజేశారు. ఈ తరహా కొలమానం ప్రజాస్వామ్యానికి విరుద్ధం. అసలు ప్రజాస్వామ్యంలో ఓటు హక్కుకు ప్రాతిపదిక ఏమిటి అన్న చర్చలు మొదలైనప్పుడు, వయసు ఆధారంగా ఓటు వేయటం ఒక్కటే ప్రాతిపదికగా తీసుకోవాలని భావించారు. ఫలితంగా రాజ్యాంగంలో 326వ అధికరణం కుల, మత, జాతి, వర్గ, లింగ విచక్షణ లేకుండా వయోజనులైన భారతీయ పౌరులందరికీ ఓటు హక్కు కల్పించారు. ప్రారంభంలో 21 ఏళ్ళ వయసు దాటిన వారికే ఉన్న ఓటు హక్కు 1988లో 61వ రాజ్యాంగ సవరణ ద్వారా 18 ఏళ్ళకు కుదించారు.

## హక్కుగా భావిద్దాం... బాధ్యతగా ఓటేద్దాం...!

ఇంతటి చరిత్ర ఉన్న ఓటు ఈ రోజు మనకు హక్కుగా లభిస్తున్న నేపథ్యంలో, మన బాధ్యతగా వినియోగించుకోవలసిన అవసరం ఎంతైనా ఉంది. ప్రజాస్వామ్యంలో ఓటు పటిష్టత ఎలాంటిదన్నది ఓటరు ప్రవర్తన మీదే ఆధారపడి ఉంటుంది. ఐదేళ్ళ నిర్ణీత కాలానికి మన నాయకుణ్ని ఎన్నుకునేటప్పుడు ఎంతో జాగ్రత్తగా ఆలోచించి, ఆచితూచి ముందుకు సాగాలి. మన భవిష్యత్తుకు అండనిచ్చేవాడు కావాలి గానీ, మన భవిష్యత్తును తాకట్టుపెట్టేవాడు మనకెందుకు? ముఖ్యంగా నేరగాళ్ళు, అవినీతిపరులకు సరైన బుద్ధి చెప్పే సమయమిది. భారతదేశ పూర్వ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు పలు సందర్భాల్లో చెప్పినట్లు... బూతులు మాట్లాడే వారికి బూతుల్లో ఓటు వేసే బుద్ధి చెప్పాలి. అంతే కాకుండా క్యారక్టర్ (గుణం), కెపాసిటీ (సామర్థ్యం), క్యాలిబర్ (యోగ్యత), కాండక్ట్(నడత) ఆధారంగానే మన ప్రతినిధులను ఎన్నుకోవాలి తప్ప... డబ్బులు ఇస్తున్నారనో, ఇంకేవో సౌకర్యాలు అందిస్తున్నారనో, మన కులం వాడనో, మన ఊరి వాడనో ఓటు వేయకూడదు. రానున్న ఐదేళ్ళలో వాళ్ళ నడత ఏ విధంగా ఉంటుందో చూసుకుని ఓటేయాలి. వాళ్ళ గత చరిత్ర తెలుసుకుని ఓటేయాలి.

కాళోజీ మాటల్లో చెప్పాలంటే....

"అభ్యర్థి ఏ పార్టీ వాడని కాదు – ఏ పాటి వాడో చూడు
ఎన్నుకుంటే వెలగబెట్టడం కాదు – ఇందాక ఏం చేసిండో చూడు
ఇప్పుడు కట్టే ముడుపులు కాదు – ఇందాక చెల్లించింది చూడు
పెట్టుకునే టోపీ కాదు – పెట్టిన టోపీ చూడు"

అందుకే ఓటు వేసే ముందు అన్నీ ఆలోచించాలి. వారు ఏ పాటి వారో, వారితో భవిష్యత్తు ఏ పాటి ఉంటుందో ఆలోచించుకుని ఓటు వేయాలి. అయితే ఓటు వెయ్యటం మాత్రం మరువకూడదు. ఏ మాత్రం అశ్రద్ధ చేయకూడదు. మనలోని చైతన్యమే రేపటి భవిష్యత్తుకు దిశానిర్దేశం అనే విషయాన్ని ప్రతి ఒక్కరం మననం చేసుకుందాం. ఓటు హక్కుతో ప్రజాస్వామ్యాన్ని పరిఢవిల్లనిద్దాం.

మన భవిష్యత్తును మనమే నిర్ణయించుకోవడానికి మనకున్న ఏకైక ఆయుధం ఓటు!.. మన దేశాన్ని సమర్ధవంతమైన పాలకుల చేతుల్లో ఉంచడానికి మన చేతిలో ఉన్న ఒకే ఒక్క వజ్రాయుధం ఓటు..!

**మే 13న జరగబోయే సార్వత్రిక ఎన్నికలలో ఓటేద్దాం రండి...!**

# ఆ మూడు పార్టీలను నమ్మకండి

## బీజేపీ, టీడీపీ, వైసీపీల తీరుపై సీపీఎం నేత బీవీ రాఘవులు ధ్వజం

నెల్లూరు నగర నియోజకవర్గం సీపీఎం అభ్యర్థిగా పోటీచేస్తున్న మూలం రమేష్‌ను గెలిపించాలంటూ సీపీఎం రాష్ట్ర నాయకుడు, ఆ పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు మే 8న నెల్లూరులో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక సీపీఎం కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని, రాష్ట్రంలోని వైకాపా, తెదేపాల విధానాలను విమర్శించారు. అనంతరం, నగరంలోని ఆర్‌ఆర్ వీధిలో ప్రజలనుద్దేశించి ఆయన మాట్లాడుతూ, పేదప్రజల కోసం పోరాడేది సీపీఎం పార్టీయేనన్నారు. ఈ ఎన్నికల్లో నగర సీపీఎం అభ్యర్థి మూలం రమేష్‌ను, ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఇండియా కూటమి కాంగ్రెస్ అభ్యర్థి కొప్పుల రాజు (కె.రాజు)ను గెలిపించుకోవాలని ఆయన కోరారు.



ఈ సమావేశంలో మూలం రమేష్, ఐద్వా రాష్ట్ర కార్యదర్శి రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల అభ్యున్నతి కోసమే..
# టీడీపీ 'సూపర్ సిక్స్'
**పొంగూరు రమాదేవి**



ప్రజల అభ్యున్నతి కోసం మాజీ ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు 'సూపర్ సిక్స్' పథకాలను సిద్ధం చేశారని, టీడీపీ ఈ ఎన్నికల్లో విజయం సాధించగానే ఆ పథకాలన్నీ అమలులోకి వస్తాయని నెల్లూరు సిటీ అభ్యర్థి పొంగూరు నారాయణ సతీమణి రమాదేవి, సోదరి వల్లీ చెప్పారు. ఇటీవల వారు నెల్లూరు నగర నియోజకవర్గంలోని 53వ డివిజన్ వెంకటేశ్వరపురం తదితరప్రాంతాల్లో పర్యటించి నెల్లూరు నగరాభివృద్ధి కోసం నారాయణను గెలిపించాలని విజ్ఞప్తిచేశారు. ఇంటింటికీ వెళ్ళి టీడీపీ మేనిఫెస్టోను, ప్రజలకు కలిగే ప్రయోజనాలను వివరించారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చాక, నారాయణ రాష్ట్రం నుండి, వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి కేంద్రం నుండి ప్రత్యేక నిధులు తీసుకువచ్చి, నెల్లూరు చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయే విధంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపడతారని, ప్రజలు బాగా ఆలోచించి నెల్లూరు ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని, నగర నియోజకవర్గం అభ్యర్థి డా. పొంగూరు నారాయణను గెలిపించాలని వారు ప్రజలను కోరారు.

# 'దేశం'లోకి.. సూరిశెట్టి బ్రదర్స్



నెల్లూరు నగరంలోని శ్రీ ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి దేవస్థానం మాజీ ఛైర్మెన్ సూరిశెట్టి నరేంద్ర దంపతులు, రాయాజీ వీధిలోని శ్రీ ఆంజనేయస్వామి ఆలయ ఛైర్మెన్ ఉమా దంపతులు వైఎస్ఆర్ కాంగ్రెస్‌పార్టీకి రాజీనామా చేసి, ఇటీవల టీడీపీలో చేరారు. మాజీమంత్రి నారాయణ వారికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. రానున్న ఎన్నికల్లో నారాయణ విజయానికి తమవంతు సహాయ సహకారాలందిస్తామని సూరిశెట్టి బ్రదర్స్ నారాయణకు హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా నారాయణ వారికి ధన్యవాదాలు తెలియజేశారు. తెలుగుదేశం పార్టీలో చేరే ప్రతిఒక్కరికి సముచిత స్థానం, గౌరవం ఉంటాయని చెప్పారు.

## జేఏస్ మరణం..బాధాకరం! - సోమిరెడ్డి

ప్రముఖ పారిశ్రామికవేత్త, సమాజసేవాభిలాషి జేఏస్ రెడ్డి (జక్కా శ్రీనివాసులురెడ్డి) మరణం ఎంతో బాధాకరమని మాజీమంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఓ ప్రకటనలో విచారం వ్యక్తంచేశారు. జగదేవిపేటకు చెందిన జేఏస్‌రెడ్డితో తమ కుటుంబానికి ప్రత్యేక అనుబంధం ఉందన్నారు. నెల్లూరులో జక్కా సుజాతమ్మ రెడ్‌క్రాస్ క్యాన్సర్ ఆసుపత్రి నిర్మాణానికి స్ఫూర్తిగా నిలిచారని, నెల్లూరు టౌన్‌హాలు పునరుద్ధరణ, చిల్డ్రన్స్‌పార్కు వంటివి ఆయన సేవకు నిదర్శనంగా శాశ్వతంగా నిలిచిపోతాయన్నారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని, వారి కుటుంబసభ్యులకు ఆ భగవంతుడు మనోధైర్యం కల్పించాలని ప్రార్థిస్తున్నానని పేర్కొన్నారు.

## తీరని లోటు - నల్లపరెడ్డి ప్రసన్న

అందరూ బావుండాలని నిత్యం కోరుకునే జేఏస్ రెడ్డి మరణ వార్త తనను కలచివేసిందని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్న కుమార్‌రెడ్డి అన్నారు. ఇటీవల జగదేవిపేటలో ఆయన ఎన్నికల ప్రచారంలో పాల్గొని జేఏస్ మృతికి కొద్దిసేపు మౌనం పాటించారు. జేఏస్‌రెడ్డి సేవలను ఆయన వివరిస్తూ, జగదేవిపేటలో ఆసుపత్రి, కల్యాణమండపం, పశువులాసుపత్రి వగైరాలన్నీ నిర్మించిన సేవామూర్తి అని కొనియాడారు. జేఏస్ మృతి తీరని లోటని అన్నారు.

# పేదింటి పిల్లలకు పెద్ద చదువులు
**- జగన్‌తోనే సాధ్యమన్న ఆదాల**



పేదింటి పిల్లలు పెద్ద చదువులు చదవడమన్నది ఒక్క జగన్‌తోనే సాధ్యమని, జగన్మోహన్‌రెడ్డి సంకల్పంతోనే రాష్ట్రంలో ప్రభుత్వ బడులు రూపురేఖలు సమగ్రంగా మారాయని నెల్లూరు రూరల్ వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డి చెప్పారు. 'నాడు-నేడు' కార్యక్రమం ద్వారా కార్పొరేట్ స్థాయిలో ప్రభుత్వ బడులను తీర్చిదిద్దిన ముఖ్యమంత్రి భారతదేశంలో ఎవరైనా ఉన్నారంటే ఒక్క జగన్మోహన్‌రెడ్డి మాత్రమేనని ఆయన కొనియాడారు. ఇటీవల సీఎం జగన్‌మోహన్ రెడ్డి ఎన్నికల ప్రచార నిమిత్తం నెల్లూరు నగరానికి వచ్చిన సందర్భంగా, జగన్ రాకకోసం గాంధీబొమ్మ కూడలి వద్ద ఎదురుచూస్తున్న భారీ జనసందోహాన్నుద్దేశించి ఆయన మాట్లాడారు. మనం పిల్లలకి ఇచ్చే ఆస్తి ఏమైనా ఉందంటే అది ఒక్క చదువు మాత్రమేనని, ముఖ్యమంత్రి నాడు-నేడు కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారని, తద్వారా అనేకమంది పేదింటి పిల్లలు ఇంగ్లీష్ మీడియంలో చదువుతున్నారని, ప్రభుత్వ పాఠశాలను కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా చేసి డిజిటల్ విద్యా వ్యవస్థను తీసుకొచ్చిన రాష్ట్రం ఒక ఆంధ్రప్రదేశ్ మాత్రమేనని చెప్పారు. పేదవాళ్ళకి ఆర్థిక తోడ్పాటును అందించిన ప్రభుత్వం వైయస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రమేనన్నారు. నెల్లూరు రూరల్, నెల్లూరు నగరంతో పాటు నెల్లూరు జిల్లా సమగ్ర అభివృద్ధి సాధించాలంటే వైకాపాను గెలిపించాలన్నారు. ఈ ఎన్నికల్లో పోటీచేస్తున్న తనను, నగర అభ్యర్థి మహమ్మద్ ఖలీల్ అహ్మద్‌ను, ఎంపీ అభ్యర్థి విజయసాయిరెడ్డిని ఈనెల 13వ తేదీన జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు.




# జాతీయ బాలల పురస్కారాలకు దరఖాస్తులు పంపండి
**- ఐసీడీఎస్ అధికారిణి హేనా సుజన్**

కేంద్రప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే జాతీయ బాలల పురస్కారాలకు అర్హులైన బాలబాలికలు ఆన్‌లైన్‌లో తమ దరఖాస్తులు పంపాలని జిల్లా స్త్రీ శిశుసంక్షేమశాఖ అధికారిణి బి. హేనాసుజన్ మే 7న ఒక ప్రకటనలో కోరారు. ఈ పురస్కారాల కార్యక్రమంలో భాగంగా ప్రధానమంత్రి రాష్ట్రీయ బాలల పురస్కారాలను ప్రదానం చేస్తారని పేర్కొన్నారు. 18 ఏళ్ళలోపు వయసు కలిగివుండి, క్రీడలు-సామాజిక సేవారంగం-ధైర్య సాహసాలు-శాస్త్ర సాంకేతిక విజ్ఞానం, నూతన ఆవిష్కరణలు, పర్యావరణ పరిరక్షణ, సంస్కృతి సంప్రదాయాలు, సాంకేతిక విజ్ఞానంతో పాటు తమదైన ప్రతిభా నైపుణ్యాలతో రాణిస్తున్నవారు తమ దరఖాస్తులను జులై 31వ తేదీ లోపు వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఆ దరఖాస్తులను కేంద్ర కమిటీ పరిశీలించిన తర్వాత, ఎన్నికైన బాలబాలికలకు 2025 జనవరి నెలలో ఢిల్లీలో జరిగే కార్యక్రమంలో రాష్ట్రపతి చేతులమీదుగా బహుమతి ప్రదానం, జ్ఞాపికల బహుకరణ ఉంటాయని, బాలబాలికలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

# ఎన్నికల సిబ్బందికి.. ప్రత్యేక బస్సులు

జిల్లాలో ఎన్నికల సిబ్బంది సౌకర్యార్థం 250 ప్రత్యేక బస్సులను ఏర్పాటుచేశామని, ఆర్టీసీ ఆధ్వర్యంలో ఆ బస్సులు నడుస్తాయని జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి హరి నారాయణన్ మే 7న ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా కేంద్రమైన నెల్లూరు నుంచి వివిధ ప్రాంతాలకు 103 బస్సులు, కావలి నుంచి 36, కందుకూరు నుంచి 29, ఆత్మకూరు నుంచి 44, ఉదయగిరి నుంచి 43 బస్సులు నడుస్తాయని, ఈనెల 12న అవి ఆయా కేంద్రాలనుంచి బయలుదేరి వివిధ ప్రాంతాలకు వెళ్తాయని, పోలింగ్ ముగిసిన అనంతరం తిరిగి గమ్యస్థానాలకు చేరుకుంటాయని పేర్కొన్నారు.

## టూకీగా...



### పెంచలకోనలో..
### వైభవంగా లక్ష్మీనృసింహుని కల్యాణం

రాపూరు మండలం పెంచలకోనలో కొలువై ఉన్న చెంచులక్ష్మి-ఆదిలక్ష్మి సమేత శ్రీ పెనుశిల లక్ష్మీనృసింహస్వామి వారి కల్యాణోత్సవం ఇటీవల కన్నులపండువగా జరిగింది. వేకువనే మూలమూర్తికి అభిషేకం, పూలంగిసేవ, గో పూజలు చేసిన తర్వాత ఉభయదేవేరులతో స్వామివారి పెళ్ళివేడుకను వైభవంగా నిర్వహించారు. పెద్దఎత్తున భక్తులు పాల్గొన్నారు.

### కట్టుబడిపాళెం యువత ఆధ్వర్యంలో చలివేంద్రం

బుచ్చిరెడ్డిపాళెం మండలంలోని కట్టుబడిపాళెంలో, ఈ మండుటెండల్లో ప్రజల దాహార్తిని తీర్చేందుకు ఆ గ్రామ యువత చలివేంద్రం ఏర్పాటుచేశారు. డాక్టర్ చీదరాల చెన్నయ్య ఈ చలివేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడుతూ, చల్లని మంచినీళ్ళు ప్రజలకు అందించడం మంచి సేవ అని అంటూ నిర్వాహకులను అభినందించారు.

### మనుబోలులో.. రెండిళ్ళలో చోరీలు

మనుబోలు అంబేద్కర్‌నగర్‌లో ఇటీవల వినోద్, బ్రహ్మయ్య అనేవారి ఇళ్లలో దొంగలు దూరి అందినంతా ఊడ్చుకుపోయారు. వినోద్ ఇంట్లో 3జతల కమ్మలు, 24వేల రూపాయలు, బ్రహ్మయ్య ఇంట్లో రెండు సెల్‌ఫోన్లు, ఒక ఉంగరాన్ని దొంగిలించుకుపోయారంటూ, బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

### తూర్పు కనుపూరులో ముత్యాలమ్మకు పొంగళ్ళు

చిల్లకూరు మండలంలోని గ్రామదేవత శ్రీ ముత్యాలమ్మ వారికి గతనెల 2న జాతర నిర్వహించిన నేపథ్యంలో, ఇటీవల తూర్పుకనుపూరు, ఈదులవారిపాళెం, పోసినవారిపాళెం, రావులవారిపాళెం, కొమరావారిపాళెం గ్రామస్తులు అమ్మవారికి నెల పొంగళ్లు సమర్పించుకున్నారు. ఇఓ నవీన్‌కుమార్, ఆలయ ఛైర్‌పర్సన్ సిద్ధారెడ్డి ఇంద్రసేనమ్మ పర్యవేక్షించారు.

### అల్లంపాడు వద్ద సిమెంట్ ట్యాంకర్ బోల్తా

మర్రిపాడు మండలంలోని జాతీయరహదారిపై అల్లంపాడు క్రాస్‌రోడ్డు వద్ద ఇటీవల ఓ సిమెంట్ ట్యాంకర్ అదుపు తప్పి బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో ట్యాంకర్‌లో ఉన్న డ్రైవర్, క్లీనర్లకు గాయాలయ్యాయి. నిద్రమత్తులో వాహనం నడిపినందువల్ల ఈ ప్రమాదం జరిగి ఉండవచ్చని స్థానికులు భావిస్తున్నారు.

### వింజమూరులో ఆస్తమాపై అవగాహన

ప్రపంచ ఆస్తమా దినోత్సవం సందర్భంగా మే 7న వింజమూరు పట్టణంలోని డాక్టర్ మాశిలామణి తన ఆసుపత్రిలో ఆస్తమా వ్యాధి పట్ల అవగాహన కల్పించారు. ఆస్తమా అంటు వ్యాధి కాదని, అలర్జీ వల్ల వస్తుందని, శీతల వాతావరణం వల్ల శ్వాసకు ఇబ్బందిగా ఉంటుందని, వ్యాధిని నిర్ధారించుకుని తగు చికిత్సలు తీసుకోవాలని సూచించారు.

### వీరంపల్లెలో పోలీసుల 'పల్లె నిద్ర'

మనుబోలు మండలం వీరంపల్లి గ్రామంలో పోలీసులు మే 6న 'పల్లెనిద్ర' కార్యక్రమం నిర్వహించి, పోలింగ్ కేంద్రాన్ని సందర్శించారు. ఎన్నికల సందర్భంగా గ్రామంలో ఎవరూ గొడవలు పెట్టుకోవద్దని, శాంతిభద్రతలకు విఘాతం కల్గిస్తే కఠినచర్యలుంటాయని హెచ్చరించారు. మనుబోలు సీఐ దాంబాబు, ఎస్ఐ అజయ్‌కుమార్, పోలీసులు పాల్గొన్నారు.

### కలువాయి పీహెచ్‌సీ తనిఖీ

మండలకేంద్రమైన కలువాయిలోని పీహెచ్‌సీ (ప్రాథమిక ఆరోగ్యకేంద్రం)ని మే 7న జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పెంచలయ్య ఆకస్మికంగా తనిఖీ చేశారు. మెడికల్ రికార్డులను పరిశీలించి, వేసవికాలంలో రోగుల కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలను సిబ్బందికి సూచించారు. మండల వైద్యాధికారి రామ్‌కుమార్, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

### జొన్నవాడ మాజీ సర్పంచ్ బుజ్జమ్మ..కన్నుమూత

బుచ్చిరెడ్డిపాళెం జొన్నవాడ గ్రామంలో 2001 నుంచి 2006 వరకు సర్పంచ్‌గా పనిచేసిన పుట్టా బుజ్జమ్మ(75) మే 7న అనారోగ్యంతో మరణించారు. మాజీ సర్పంచ్ పి. మోహన్ మురళీకృష్ణతో పాటు అనేకమంది ప్రముఖులు, గ్రామస్తులు ఆమె భౌతికకాయాన్ని సందర్శించి, సర్పంచ్‌గా ఉన్నప్పుడు గ్రామానికి ఆమె చేసిన సేవలను గుర్తుకు తెచ్చుకున్నారు.

# ఉత్తరక్రియలు



## కీ॥శే॥ జక్కా శ్రీనివాసులురెడ్డి
(J.S.రెడ్డి)

8-3-1944 1-5-2024

**"పురుషులందు పుణ్యపురుషులు వేరయా"**

### పెద్దకర్మ

**తేది 15-05-2024, బుధవారం**

ఉదయం 11-00 గంటలకు

ఇందిరానగర్ క్లబ్, ఇందిరానగర్, బెంగళూరు నందు జరుగును.

కావున తెలియజేయడమైనది.

ఇట్లు

**కుటుంబ సభ్యులు**

Edited, Published, Printed & Owned by THUNGA SIVAPRABHATH REDDY, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at Roopa Graphics, Magunta Layout, NELLORE-3.
Cell: 9866314741. Editor-THUNGA SIVAPRABHATH REDDY, Managing Editor : T.BHARATHI REDDY, Sub-Editor : MADDURU SRINIVASULU. e-mail: lawyerpatrika@gmail.com